# మా ఊరి బాగోతం

కథలు

## పెద్దింటి అశోక్‌కుమార్



# మాఊరి బాగోతం

'నవ్య' వారపత్రిక సీరియల్ కథలు

(డిసెంబర్ 2004 నుండి మే 2005 వరకు)

## పెద్దింటి అశోక్ కుమార్




నయనం ప్రచురణలు

సిరిసిల్ల-505 301

MAAVOORI BAAGOTHAM anthology of Stories
by Peddinti Ashok Kumar ©

First Edition : June - 2005
'nayanam' prachuranalu - 19

Cover Page & inner Photos :
V.K. Ashok
Back Cover Photo : writer on the Bagotham stage
Cover Disign : Karampuri Srikanth

available at : writer, Post: Mallareddypet,
Mdl. Gambhirao pet, Dist: Karimnagar- 505 304.
and
# 6-5-101, Vidyanagar,
Sircilla-505 301, Dist: Karimnagar.
and all reputed book houses

composed and printed at :
Pathipaka graphics & digitals,
Sircilla - 505 301. Cell: 9440022075

**Rs. 60/-**



## మా బాగోతాలు:

| | | |
|---|---|---|
| **1.** | మ్యానమామ సాలు | **1** |
| **2.** | మా బాగోతం మొదలయింది | **6** |
| **3.** | నేనూ - మామ - దున్నపోతు | **11** |
| **4.** | మా గురువు జంగం పంతులు | **16** |
| **5.** | కోతి మూతి ఎల్లయ్య | **21** |
| **6.** | రియార్సల్ మా ఇంట్లకచ్చింది | **25** |
| **7.** | మాయ పాము | **30** |
| **8.** | ఆటమంచిదే మోతకోర్వాలె | **34** |
| **9.** | అచ్చు పుస్తకం పోయిందోయ్...! | **38** |
| **10.** | కొత్త పంతులు వచ్చిండు | **43** |
| **11.** | తెల్లారెదాక ఉంటేగదా | **48** |
| **12.** | అల్లీరాణికి మీసాలున్నయి | **53** |
| **13.** | వానగొట్టింది | **58** |
| **14.** | కల్లుకుండల బాగోతం | **63** |
| **15.** | మనిషికి తూమెడు వడ్లు | **68** |
| **16.** | ఒక్కనాటి బాగోతం ఇడుపు కాయిదాలకచ్చింది | **73** |
| **17.** | దొంగలు... దొంగలు | **78** |
| **18.** | ఇంటికో కత ఉంది | **83** |
| **19.** | కర్రె కుక్కనే బాలనాగమ్మ | **88** |
| **20.** | పిచ్చుకుంట్ల బాగోతం | **93** |
| **21.** | అలుకుడు అటు-మామ ఇటు | **98** |
| **22.** | ఎడ మొఖం - పెడ మొఖం | **103** |
| **23.** | పారేనీళ్లను కట్టే మంత్రగాడు | **108** |
| **24.** | ఆ గుర్తులు ఇంకా ఉన్నాయి | **114** |

# దాతు గల్వని బంగారం

ఇప్పుడు మండలాలు అనవట్టిరి గని పెద్దింటి అశోక్ కుమార్‌ది, మాది ఎన్కట ఒక్కటే సిర్సిల్ల పాత తాలూక. ఇంక అండ్లదండ్ల దగ్గెర ఇలాక, వాల్ల ఊరు మల్లరెడ్డిపేట. మాది నారాయణపురం నడుమల పెద్దవాగు. మల్లరెడ్డిపేట అనంగనే నాకిప్పటి కి "ఆవునూరుకు ఆడివిల్లనియ్యొద్దు - మల్లరెడ్డిపేటకు ఎద్దునియ్యొద్దు" అనే సామెతనే యాదికత్తది. ఆవునూరు దగ్గర పెద్దవాగుకు ఎల్కు తక్కువుంటది. అందుకని బొండిగెల మంటి వాగచ్చినా నూకుడు ఎక్కువుంటదట! వాగు దాట రాదట!! ఆవునూరుకు ఆడివిల్లనిత్తె ఆపతికి సంపతికి అందదని చెప్పుకునెటోల్లు. ఇగ మల్లరెడ్డిపేటల ఎటుజూసినా పొలాలల్ల, చేన్లు చెల్కలల్ల రాల్లు రప్పలుంటయి. నాగలిగట్టి దున్నుతున్నప్పుడు జెర్రంత దూరంబోయెసరికి రాల్లు తల్గి ఎడ్లకు మస్తు కష్టమైతదట. అగో గట్ల మల్లరెడ్డిపేటకు ఎద్దునియ్యొద్దు అనెటోల్లు. ఇంక మల్లరెడ్డిపేట అనంగనే ఆడ మా బాపు వుద్యోగం జేసిన రోజులు మల్లరేడ్డిపేట జాత్ర నా శిన్నప్పటి దోస్తు డి. కిషన్ నన్ను ఎంట వెట్టుకొని కరెంటు బిల్లుల వసూల్‌కు పొయిన రోజులు, ఇవ్వన్నీటితోని మా దోస్తు గొవర్ధన్ రెడ్డి, గరిపెల్లి ఆశోక్, ఇప్పుడేమొ పెద్దింటి అశోక్ వీల్లంత గుర్తుకత్తరు.

'నవ్య'ల తర్వాయి వట్టి రాసిన 'మా ఊరిబాగోతం' కతల్ని యిప్పుడు వయ్యి రూప్కంగ అశోక్ అచ్చుగొట్టిచ్చి మన ముందర వెట్టిండు. అవ్విజదువుతుంటె గూడ నాకు మల్ల మల్లరెడ్డిపేట, ఎల్లరెడ్డిపేట, గొల్లపెల్లి, రాజన్న పేట, నారాయణపురం, బండలింగంపల్లె... ఇట్ల మా వూల్లల్ల తిరిగినట్టు అనిపిచ్చింది. మా బాషల మాట్లాడుకున్నట్టు అనిపిచ్చింది. ఎన్కట మేంగూడ నాటుకాలు ఏసెటోల్లం. ఎండకాలం తాతీల్లు వచ్చినయంటె జాలు... ఏషాలే ఏషాలు. పాటలే పాటలు ఆటలే ఆటలు. గంతెందుకు? నేను శిన్నగ వున్నప్పుడు అంటె ఐదో తరగతిల గావచ్చు లవకుశ ఏసినం. నేను లవున్ని. మా బావమరిది కుశుడు మా వాకిట్లనే కట్టెలు వాతి పందిరేసి. పౌడర్ పూసుకొని ఆటాడినం. పాట వాడినం. ఇప్పటికి ఆ పాటలు యాదికచ్చి నన్ను అతులం కుతులం జేత్తయి. ఎక్కడ ఆర్మని సప్పుడు అయినా నా కాల్లు అట్లనే ఆగుతయి.



ఇవ్వన్ని ఎందుకు జెప్పుతున్ననంటే మనిషి మనిషికి బతుకుంటది. ఆ బతుకుల ఎతలు, కతలు, దుక్కాలు, సంబురాలు, మంచి చెడు... అన్ని వుంటయి. అవ్వీటిని ఉన్నదున్నట్టు రాసెటోడు గొప్పోడు. ఆ పని మా ఆశోక్ చేసిండు. బందవస్తుగ చేసిండు. నాలికె మీదికెల్లిగాదు నాబి దగ్గరికెల్లి పెకిలేటి తెలంగాణ బాషల రాసిండు. పెద్దింటి అశోక్‌కు బుద్దిగ్యానం పెద్దగుంది. మ్యానమామ కొండయ్య సాలు వడ్డది. ఉశ్శార్ పిల్లగాడు గ్యాపకశక్తి ఎక్కువ. కతలు కైత్యాలు రాసుడేగాదు నాటుకాలు, డ్రామాలు, ఆటలు, పాటలు, దుంకుడు, ఎగురుడు అంటె మస్తు ఇష్టం. ఏ పని జేసినా ఎడ్డిర్కం లేకుంట చేస్తడు. బాగ సదువుకున్నోల్లు "కళాత్మక దృష్టి" అని ఒగ శానిమాట అంటరు సూడుండ్రి అది పెద్దింటికి ఎక్కువ. అందుకే ఇప్పటిగ్గూడ దూలాల మీద ఆర్మని, తబులల్ని చూసి అశోక్ మన్సు కలికలి అయితది.

అస్సలు అశోక్ గొప్పతనమంత బాషలవున్నది. ఆయినె రాసిన మాటల సక్కదనమే ఏరు. అవ్వి తెలంగాణ మాటలు. పల్లె కడుపులకెల్లి ఎల్లిన మాటలు. అవ్వీటితోని ఈ వయ్యికి నిండుదనమచ్చింది. ఈ మాటలల్ల సామెతలు, శాత్రాలు, పరాశికాలు, దుక్కాలు, ఎతలు, కతలు... ఇసోంటియన్ని పానం బోసుకుని మన ముందర నిలవడుతయి. మనం అడ్డమైన మన సదువులన్ని మర్శిపోయి మల్ల తల్లితోని మాట్లాడినట్టు వుంటది. గంతెందుకు పల్లెతల్లితోని మాట్లాడినట్టు వుంటది. మా వూరి బాగోతం మొత్తం జదివినంక మనకు ఓరాయిల్ అయినట్టు వుంటది. ఇప్పటి తంతె అంటె ఈ తరం రాసెటోల్లల్ల ఇంత సక్కగ తెలంగాణ బాషల రాసెటోల్లు ఒక్కలు గూడ లేరు. ఎన్నటికన్న భాషాశాస్త్రవేత్తలు అశోక్ రాతల మీద దుర్బిన్లు ఏశి సూడవలసి వత్తది. ఇవ్వి తేజాబ్‌ల ఏశి తీశిన సొక్కం బంగారం మాటలు. పల్లె తెలంగాణ సక్కని మాటలు. ఇవ్వన్ని ఎందుకు? వయ్యి మీ చేతులల్ల వున్నది. కమ్మలు తిప్పుండ్రి. కమ్ముతది ఆట. కమ్మగుంటది మాట. మోత మోగుతది. దుమ్ము రేగుతది. పేరుకు 'మా వూరి బాగోతం గని అది మీ వూరి బాగోతం మా ఊరిబాగోతం ఇగ నడుమల నేనెందుకు?

-డా॥ నలిమెల భాస్కర్

# ఒక్కమాట

ముందుగా నాటక కళామ తల్లి పాదాలకు వందనం. సరిగ్గా పాతికేళ్ళ కింది మాట. అప్పుడు నాకు పదమూడేండ్లు. రియార్సల్ మా ఇంటికి వచ్చింది. మా కొండయ మామనే మేనేజర్. మాది రెండు సంకల పెద్దిల్లు

అంతవరకు నేను క్లాసు స్టూడెంటును. ఎనిమిదవ తరగతిలో మెరిట్ స్కాలర్‌షిప్ తీసుకున్నాను. రియార్సల్ మా ఇంటికి వచ్చింది మొదలు నా చదువు మూలకువడ్డది. అప్పటినుండి డిగ్రీ దాకా... అంటే దాదాపు ఆరేడు సంవత్సరాలు నాటకాల వెంట తిరిగాను.

ఆ ఆరేడు సంవత్సరాల్లో ఎన్నొ ఒడిదుడుకులు, ఎన్నోమలుపులు. నాకు అనారోగ్యం. కరువు. మా బాపు గల్ఫ్ దేశాలకు వలస. నా చదువు ఆగిపోవడం. ప్రైవేటుగా చదువు కొనసాగడం... మనిషికి తలగాల్సిన దెబ్బలన్నీ అప్పుడే తగిలాయి.

అంతటి సంక్షోభంలోనూ... సంఘర్షణలోనూ నన్నుగుండె చెదరకుండా ధైర్యాన్నిచ్చింది, నా సమగ్రమూర్తిమత్వపు వికాసానికి బీజాలు నాటింది ఈ నాటక కళామతల్లే.

ఏనాటకం మొదలు పెట్టినా రెండు మూడు రియార్సల్‌లలో పాటలు, పద్యాలు కంఠతా వచ్చేవి. పాత్రలు నేనే రాసేవాన్ని. కుదరని చోట కొత్త పద్యాలను పాటలను రాసేవాన్ని.  అట్లా అచ్చుపుస్తకంలేని 'ధర్మకంకణం' నాటకంలో మా మామకు తెలియకుండా రెండు మూడు వాదాలను ఒంటిచ్చిరాసాను. పదవ తరగతిలోనే 'పృధ్వీరాజు విజయం' నాటకాన్ని రాసాను. అట్లా ఆ తల్లి ఒడిలోనే రచయితగా పురుడు పోసుకున్నాను.

ప్రైవేట్లో పది పాసయ్యాను. కాలేజికి అప్లైచేయ్యాలన్న ద్యాసగూడా లేదు. నాటకాల వెంట తిరుగుతున్నాను. చివరికి డిసెంబర్‌లో ఇంటర్‌లో చేరాను. కొత్తకాలేజి కాబట్టి అడ్మిట్‌చేసుకున్నారు. అప్పుడు కాలేజి మొఖం చూసినానంటే మళ్లీ పరీక్షలప్పడే. అయినా ఒక విచిత్ర మేమిటంటే ఆ బ్యాచ్‌లో పాసయిన ఏకైక వ్యక్తిని నేనే. అట్లా ఆతల్లి నాకు చదువును గూడా ప్రసాదించింది.

డిగ్రీలో నాటకాలమీద మోజు మరింత ఎక్కువయింది. నేనే ఒకనాటక మండలికి డైరెక్టర్‌గా ఉన్నాను. 'బ్రహ్మంగారి చరిత్ర' నాటకాన్ని మూడేండ్ల పాటు ఊరూరా తిరిగి వేసాం. ఈ మూడేండ్లు కూడా కాలేజికి వెళ్ళింది లేదు. చదువు చదివిందిలేదు. లాంగ్వేజీల్లో ప్రమోట్ అవుతూ ఫైనల్‌కువచ్చాను.

డిగ్రీ ఫైనల్లో నేను, సురేష్, మరింగంటి శ్రీకాంత్, కిషన్‌రావులం రూమ్‌మెట్స్‌మి. నేను శ్రీకాంత్ కాలేజిమానుకుని కథలు రాస్తుండే వాళ్లం. ప్రచురణకుతీసుకోవడం



లేదని పత్రిక నుంచి చేరో కార్డువచ్చేది. దానికే ఎంతో సంబరపడిపోయి గంగ జమునా స్వీటు తినిపించే వాళ్లం. రూమ్‌లో కూర్చుండే నాటకానికి పాటలు పద్యాలు రాసేవాన్ని.

నాటకం ఉందంటే చాలు. మామ్యాల్లం మనుషులు కాలేజికి వచ్చిచెప్పేవాళ్లు. వాళ్లతో వెళ్లినానంటే వారం దాకా కాలేజికి వెళ్లేవాన్నికాదు. ఎప్పుడూ ఎంట పది మంది జమకూడేవాళ్ళు. కష్టసుఖాలను పంచుకునేవాళ్లం. అట్లా ఊరందరికీ నన్ను పరిచయం చేసింది ఈ తల్లే.

తర్వాత ప్రైవేట్‌గా పి.జీ.లో చేరాను. అప్పటికి చేతికి గడియార మచ్చింది. మూతి మీద మీసం ముదిరింది. చదువుకున్నాననే పొగరచ్చింది. మొఖానికి రంగు పూయలన్నా మూతి మీద మీసం తియ్యాలన్నా నమోషీగా అనిపించడం మొదలయింది.

క్రమక్రమంగా నేను నాటకాలకు దూరమయ్యాను. నాటకాలు ఊరికి దూరమయ్యాయి. మా మ్యాల్లం మనుషులు దేశానికి దూరమయ్యారు.

**ఒక తీరని కోరిక:** రావణ బ్రహ్మ వేశం వెయ్యాలని బలమైన కోరిక ఉండేది. అది కోరికగానే మిగిలి పోయింది. అవకాశమున్ననాడు నాకు పర్సనాలిటీ లేదు. పర్సనాలిటీ ఉన్న నాడు అవకాశం లేదు.

ఇవి కథలు కావు. అనుభవాలు. ఇప్పటికీ తబలాచప్పుడు వినిపించినా, పల్లీల హార్మోనీ పలికినా మనుసు ఆగదు. దరువులెత్తుతూనే వుంటది. ఎప్పుడూ ఏదోనాటకం పాట పెదవుల మీద ఆడుతనే ఉంటది. అన్నం తినేముందు పల్లెం మీద చేతివేళ్ళు ఆడుతనే వుంటయి.

ఈ కథలు చదివినాక మా మామకు మళ్లీ ఊల పుట్టింది. మ్యాల్లాన్ని మొత్తం జమకొట్టిండు. కొందరు ఊర్లోలేరు. కొందరికి ఆరోగ్యం సహకరించలేదు. మ్యాల్లం ఇంకోసారి ఇచ్చుక పోయింది.

మేకప్ వేసింది వి.కే. అశోక్ గారు.

'నవ్య' వేదిక మీద అడించింది శ్రీరమణగారు.

పేరు పెట్టింది లక్ష్మణ్ సారు.

మా మ్యాల్లం మనుషులకు పేరు పేరునా -

మా ఊరికి, మేము ఆడిన ఊర్లకు పేరు పేరునా -

దండాలతో -

— 1/6/05

## మా పార్తన పాట

పరాబ్రమ్మ పరమేశ్వర పురుషోత్తము సదానంద
పరంజ్యోతి పరాత్పర పతిత పవన శూబ్రకాయ
వరదాయక సకలలోక వాంచిత గుణదాప్రమేయ
నీకు వందనములు రామ సాగతో మమ్మేలుకోవా ॥నీ॥
సాగశాసనాథి వినుత పంగ జమన బ్రోవుమిక పరమేశ్వర మొక్కేదను ॥ప॥



# మ్యానమామ సాలు

మా అమ్మమ్మది మాది ఒక్కటే ఊరు. వాళ్లది కింది వాడకట్టు. మాది మీది వాడకట్టు. మీదివాడకట్టు ను 'పల్లెమీద' అని గూడా అంటరు. మా అమ్మను ఊర్లెనే ఇచ్చింద్రు. ఇప్పుడు అమ్మ అంటున్నగనీ మొన్నటిదాకా 'అక్కా' అనే అందుంటిని. ఎందుకంటే నేను ఎప్పుడూ అమ్మమ్మ దగ్గరనే ఉందుంటిని. మాకు ఒక్కడే మ్యానమామ. పేరు కొండయ్య. నేను ఎప్పుడూ మామతోనే ఉందుంటిని.

మా మామ అన్నట్టే అమ్మమ్మ లస్మవ్వను 'అవ్వా' అందుంటిని. తాతను 'నాయినా' అందుంటిని. అమ్మను 'అక్కా' అందుంటిని. 'మా బాపును మాత్రం 'బాపూ' అందుంటిని. కోపమచ్చినప్పుడు మామను 'మొద్దోడా' అందుంటిని. నన్ను మామ 'బక్కోడా' అంటుండె.

మా కొండయ మామ కోతి. ఉన్న జాగలుండడు. నల్లగ తుమ్మమొద్దోలె చెయ్యెత్తుమనిషి. ఇంకా లగ్గం గాలేదు. పిల్లకొరకు చూస్తంద్రు. అచ్చం మా చిన్న తాత లెక్కనే ఉన్నడంటరు. చిన్నతాతంటే కొండయ మామకు మేనమామ. మా లస్మవ్వ అన్న.

నేను ఆ తాతను చూడలేదు. వాళ్లది కొత్తపెల్లి. మా ఊరికి దగ్గరనే. నాటుకాలు ఆడేటోడట. 'నాటుకం' అనేకంటే 'బాగోతం' అనాలె. ఎందుకంటే నాటుకం వేరు. బాగోతం వేరు. బాగోతాలల్ల ఇంకా పచ్చిబాగోతం వేరు. చిన్నతాత కాలంలో అన్నీ పచ్చిబాగోతాలే. 'తకదై' అని తబలా తాళం మీద ఎగురుడు దుంకుడే.

వాళ్ల కొత్తపెల్లి ఊర్లె ఏమంటరో గనీ మాఊర్లె మాత్రం బాగోతం పేరు చెప్పంగనే ముందుగా గుర్తుజేసేది చిన్నతాతనే! ఆయనపేరు గూడా కొండయ్యనే! ఏ వేశం ఏత్తే ఆవేశం దిగచ్చిందా అన్నట్టుండునట. ఆడిఏశమేత్తే అంత సక్కదనముండునట. కొండయతాత ఏశం గట్టిండంటేసాలు. జనం ఇరుగవడుదురట. తెల్లారనీ పొద్దుగూకని గాని, స్టేజిముందు నుంచి కదిలే వాళ్లుగారట.

ఒకసారి 'క్రిష్ణలీలలు' ఆట నేర్చుకుంటుండ్రట. కొండయ తాతది కృష్ణుని వేశం. రాత్రిపూట రియార్సల్. అది కోతల దినమట. పొద్దంతా వరికోత. ఒకనాడు కోతకోసి పగటిపూట చెట్టుకింద పండుకున్నడట కొండయ తాత. పొద్దువంగి మొఖంమీద ఎండపడితే నాగంబాము వచ్చి మొఖానికి పడిగె అడ్డం బట్టిందట.

బాగోతం పేరు చెప్పంగనే కొండయ తాతను యాదిజేత్తరని చెప్పినగదా! దానికో పెద్ద కతుంది. ఒకసారి 'భక్తప్రహలాద' ఆటలో తాత నర్సిమ్మసామి ఏశమేసిండట. హిరన్యకశిపుని ఏశం వేసినోన్ని నిజంగనే చీరినంత పనిచేసిండట. మీదవడి కొరికిండట. గావువట్టిండట. ఉగ్రరూపమయిండట.

ఏశకాల్లంతా దొరుకవట్టిండ్రట. ఇంకో విషయం ఏంటిదంటే వానికి తాతకు వారంపది రోజులనుంచి మాటలు లేవట. ఏదో విషయంలో కొట్లాడుకున్నరట.

తెల్లారి పెద్ద పంచాది. కావాలనే ఆట్లజేసిండని, నమ్మిచ్చి పానం తియ్యాలని చూసిండని, హిరన్యకశిపుడు పంచాది పెట్టిండట. కులానికొక పెద్దమనిషిని కూసుండవెట్టిండట. వాని పెయ్యిమీద గీతలు గాట్లు చూసి ఎవలైనా ఆట్లనే అనుకున్నరట.

తాత జెప్పే సమాధానం ఏంటిదంటే 'నరిసిమ్మసామిని వినరా... నిను నములక మింగెద గనరా'. అన్నపాట పాడినప్పుడే క్యాల్లికుందట. ఆ తర్వాత ఏంజరిగిందో తెలువదట. ఒట్టు వెట్టుకుని చెప్పిండట. కొందరు నమ్మిండ్రట. కొందరు నమ్మలేదట. అందరు కలిసి ఒక నిర్ణయాని కచ్చిండ్రట.

'నర్సిమ్మసామి ఏశమేత్తే శిగమచ్చి క్యాల్లిదప్పినవు సరే! దశరథమారాజు ఏశమేత్తే మూర్చరావలెగదా' అన్నడట ఒకపెద్దమనిషి. అదే తీర్పయింది.

మరునాడే 'శ్రీరామవనవాసం' రియార్సల్ మొదలయింది. కొండయ తాతది దశరథ మారాజు. హిరన్యకశిపుడుది రాములవారు.

రెండువారాల్లోనే ఆట నేర్చిండ్రట. అప్పుడు నాటుకానికి టికెట్లులెవ్వు. వట్టిగనే నాలుగుతొవ్వల దగ్గర శాందిరి ఏద్దురు. నాలుగు కట్టెలు పాతి ఎదురుకు చీరలు గట్టి మీద దోతులు పరుద్దురు. ఆ కొనకొకటి ఈ కొనకొకటి దీటీలు కడుదురట.



ఆట మొదలయిందట. పంచాదిపెద్దలు ముందటనే కూసున్నరట. రాముడు అడివికి పోయే సీను వచ్చిందట. అందరూ అదే సీనుకొరకు చూస్తుండ్రట. రాముడు అందరికీ చెప్పి పాటపాడుకుంట అడివికి పోతండట.

'ఆ..రామా!' అని కొండయతాత ఇరుసుక పడ్డడట. కండ్లు తేలేసిండట. ఊపితే ఊగడట. పిలిస్తే పలుకడట. అట్లనే నోరుతెరిచిండట. డాక్టర్ చెయ్యివట్టి చూసి సచ్చిపోయిండని చెప్పిండట. ఊరు ఊరంత ఒక్కటే ఏడ్సుడట.

ఇది నిజమేనా అని మా లస్మవ్వను అడిగిన. నిజమనలేదు అవద్దమనలేదుగనీ కంటనీరు పెట్టుకుంది. మాతాత సచ్చిపోయిన యాడాదే కొండయ మామ పుట్టిండట. అవ్వ అదేపేరు పెట్టుకున్నదట.

అదేం సాలో గాని కొండయమామకు గూడా నాటుకాల పిచ్చే. చిన్నప్పుడు రాత్రిపూట నాటుకం జూసి పొద్దంతా మా పాతగోడల్ల మొఖానికి సున్నం మసి పూసుకుని ఏశాలేత్తుండె. గూనపెంకలకు కాయిదాలు అతికిచ్చి తబలాలు చేస్తుండె. రాజు ఏశంలో పిలిచినట్టు నన్ను ఎప్పుడూ 'ఓరే సేవకా' అంటుండె. నేనేమో 'ఇంకెందుకున్నవురా సావకా' అందుంటిని.

ఎక్కడన్నా నాటుకం ఏత్తే సాలు. ముందటనే తువ్వాల పరుసుకుని కూసుంటుండె. పోయేటోడు ఒక్కడుపోక ఎంబడ నన్ను తోలుకపోతుండె. నాకుగూడా నాటుకాల పిచ్చే. ఎక్కడ పగటి బాగోతాలాడినా బడికి ఎగనామం బెట్టి స్టేజి ముందు కూసుందుంటిని. యానంగ వచ్చునో... నాపక్కనే కూసుంటుండె మామ.

ఎడ్లకాడ ఇవే పాటలు పాడుతుండెనట. మా తిరుపతి తాత 'ఈ గాడిది కొడుకు బాగోతులల్ల వోతాడే' అని ఎప్పుడూ తిడుతుండె. మా లస్మవ్వ మాత్రం నవ్వుకుంట 'మ్యానమామ సాలువడ్డది' అంటుండె.

అప్పుడప్పుడు నన్నుచూసి 'ఏమోయ్‌పిల్లగా...నువ్వు కొండయమామ తోక ఇదువవు. నీకు గూడా మ్యానమామ సాలే పడ్డట్టుంది'. అంటుండె మురిపెంగా.

అన్నట్టుగనే మాఊర్లెనే గాదు, సుట్టూ ఏఊర్లె నాటుకమాడినా ఇద్దరం పోదుంటిమి. అప్పుడు మా ఇంట్ల కరంటు లేకుండె. తాతోల్ల ఇంట్ల ఉండె. నేను బడినుంచి రాంగనే అన్నం తిని పుస్తకాలు వట్టుకుని సదువుకుంటనని తాతోల్లింటికి పోదుంటిని. రాత్రికిరాత్రి ఏ ఊరికో పోవుడు. తెల్లారేసరికి ఇంటికి చేరుడు.

నేను ఎటుపోతున్ననో మా బాపుకు అమ్మకు తెలువది. మా లస్మవ్వకు తెలుసుగనీ ఎవలకు చెప్పది. మామ యాల్లకు పనిమీద కనవడితే చాలు. ఎటువోయినా తాత

పట్టించుకోదు. అందుకని మాకు ఎదురు బెదురు లేకుండా పోయింది.

మామకూ నాకు మాటలన్నీ సీటి (ఈల) మీదనే నడుత్తుండె. మామ సీటి కీసుమంటది. సీటిమీద పాటవాడితే కుండలల్ల మోతపుడుతది. నాకు సీటి కీసుమనిరాదు. గాలి ఊదినట్టు 'ఉస్సుఉస్సు' మని వస్తది. అయినా మామకు అర్థమైతుండె.

ఎట్ల తెలుసునోగాని సుట్టూ పదిఊర్లపెట్టు ఎక్కడ తబులా తాళం మోగినా మామకు తెలుత్తుండె. ఒకసారి ఊర్లెనే దాసరి బాగోతం.

'శోకులూ...పోదామా' సీటిమీదనే అన్నడుమామ.

'యాడికి...' నేను.

'దాసరి బాగోతం..మంచిగుంటది' మామ.

మా మాటలు ఎవలకూ అర్థంగావు. ఇద్దరం బాగోతం దగ్గరికివోయి కూసున్నం. ఆట దుమ్మురేగుతుంది. మాయ సుభద్ర ఆట. పాటలు మొత్తం దర్వులు ఆట తాళాలె. మామకు అక్షరాలు కూడవలుక్కుని తట్టుకుంట తట్టుకుంట సదువుడు వచ్చుగని రాసుడు రాదు.

'పాటలు మంచిగున్నయి. రాయిరా' అని పెన్ను కాయిదం చేతికిచ్చిండు. ఒక పెట్రమాక్సులైటు స్టేజిముందు కట్టిండ్రు. అది అప్పుడప్పుడు గప్పుమని మండి గుడ్డిగుడ్డిగా వెలుగుతుంది. సరిగ్గా కనవడుతలేదు.

నేను చీకట్లనే గీకుడు గీకిన. దాసరోల్ల మాటనే యాస. ఇంకా పాటవాడుతుంటే మరింత యాస. ఏం రాసిన్నో దేవునికెరుక. నాలుగు కమ్మలు నింపిన.

'అబ్బా..నువ్వురా మనిషివంటె. మస్తు రాసినవు. ఇట్ల ఉషారుండాలె' అంటూ కమ్మలు మలిచి జేబుల వెట్టుకున్నడు మామ. తెల్లారి ఎడ్లకాడ సదువవోతే సదువరాదట. సదువచ్చినోల్లకు ఇత్తే అది రాతనే గాదన్నరట. నాదగ్గరికి తెచ్చి 'నువ్వయినా సదివిపెట్టురా' అన్నడు. రాయంగ ఏదో రాసినగనీ ఒక్కముక్క సదువ రాలేదు.

'నీపోరని పీసునె గొడుదు...రాతరాత్తే తుర్కోని అయ్యకు దెలువది. దూదేకులోని తాతకుదెలువది. ఏడోది సదువుతున్నవు. ఎందుకురా' అని చెంపమీద రెండు గుంజిండు.

నేను ఏడ్సుకుంట ఇంటికి పోయిన. మా బాపుతోని చెప్పిన. మాబాపు కోపానికచ్చిండు. మా బండారం బయటవడ్డది. మామను తిట్టిండు. తిరిగితే నువ్వు తిరుగు. వాన్నిమాత్రం తెల్లందాక బాగోతులల్ల తింపకు' అన్నడు.



రెండురోజులు మామ మా ఇంటికే రాలేదు. కనవడ్డా మాట్లాడలేదు. నా దోస్తి ఉండదేమోనని నాకు భయమయింది. మూడవనాడు మామూలె.

'శోకులూ...వత్తవా' సీటిమీద పిలిచిండు. ఇద్దరం రాత్రికి రాత్రి నడుసుకుంట బండలింగంపెల్లికి పోయినం. చిమ్మని చీకటి. గుండ్ల చెరువుకట్ట మీదినుంచి వరిచేన్ల మధ్యనుంచి నడుక.

మేం వట్టిగనే ఆడుతున్నరనుకున్నం. అక్కడికి పోయినంక టికెట్టు పెట్టిండ్రు. ఇద్దరి దగ్గర పైసలెల్లవ్వు. ఎట్లా...? మామ నాకొక ఉపాయం చెప్పి 'పోరా బక్కోడా' అన్నడు.

సుట్టూ పరుదాలు గట్టిండ్రు. పరుదాల సందుల నుంచి నేను లోపలికి పోయిన. మేన్‌గేటునుంచి పాస్ తీసుకుని బయటకచ్చిన. పాస్‌ను మామకిచ్చిన. మల్లా నేను దొంగతనంగా పరుదా సందులనుంచి, మామ మేన్‌గేటు నుంచి లోపలికి పోయినం.

ఇంటికచ్చేసరికి తెల్లారింది. నాకు మస్తు నిద్ర వత్తుంది. ఎట్లా...? బడికి పోవాలె నాయె. అదీ ఊర్లె బడిగూడా కాదు. లింగన్నపేటకు నడిచిపోవాలె. పోకపోతే మా బాపుకొడుతడు. బడికిపోతనని సద్దిగట్టుకుని వచ్చి మా అవ్వోల్ల ఇంట్ల పండుకున్న. బడి టయానికి ఇంటికిపోయిన.

పొద్దంతా మామ కలపు తియ్యవోయిండు. నిద్రను ఎట్ల ఆపుకున్నడోగనీ రాత్రికివచ్చి నాగంపేటకు గౌండ్లోల్ల ఎల్లమ్మ కత బాగోతానికి పోదామంటడు.

నాకు కాళ్ళు గుంజుతున్నయని చెప్పిన. అయితే సైకిల్‌మీద పోదామని సైకిల్ కిరాయికి తెచ్చిండు. ఇద్దరం సైకిలెక్కినం.

మామసైకిల్ తొక్కుతూ..'ఇట్ల తిరుగుడు కాదురా మన ఊర్లె పదిమందిని కలుపుకుని నేనే ఒకమ్యాల్లం పెడుతా. పదిపన్నెండు ఆటలు నేర్చి ఊరూరు తిరుగుతా. ఫలానా ఊరోల్లంటే ఏరియా మొత్తం తెలువాలె" అన్నడు.

నాకెంతో మురిపెమనిపించింది. మామకు తోడు సైకిల్ పైడీ మీద కాలేసి తొక్కిన. అద్దగంటల నాగంపేటలున్నం. తిరిగివచ్చే సరికి నడిజాము దాటింది. కండ్లుమూసినమో లేదో తెల్లారింది. నేను పొద్దు బారెడెక్కినంక లేచి బడికి పోయిన. మామ మాత్రం కూరుకురాత్రిలే లేచి దొడ్డికాడికి పోయిండు.

# మా బాగోతం మొదలయింది

రథాలపున్నమ. ఎల్లారెడ్డిపేట రథం. మూడురోజుల జాతర. ఈ రథాలు గూడా వరుసగస్తయి. దేవుని లగ్గం కాంగనే మొదలు మొదలు సిరిసిల్ల రథం. తర్వాత క్రొత్తపెల్లి. లింగన్నపేట, మాచారెడ్డి క్రాసింగ్. ఎల్లారెడ్డిపేట, చివరికి గంభీరావుపేట రథం.

జాతర్లు వచ్చినయంటే మాకు పట్ట పగ్గాలుండయి. జాతరనాడు బడికిసెలవు. తెల్లారి హాజిరి తీసుకొని పొమ్మంటరు. జాతర జాతరకు నాటుకాలు ఆడుతరు. ఒక్కొక్క సారైతే మూడుదిక్కుల్ల మూడు మ్యాల్లాలు స్టేజీలేత్తరు. పోటీకొద్ది మూడురోజులు నాటుకాలేత్తరు.

ఎల్లారెడ్డిపేట రథాన్ని ప్యాట్లరథం అని గూడా అంటరు. నేనూ మామా ఇద్దరం జాతరకు పోయినం ఈ జాతర్ల సీజన్‌లో మామదగ్గర మస్తు పైసలుంటయి. ఎందుకంటే అది వరికోతల సీజను. మామ ఎడ్లను మేపుకుంటా మడి కట్లల్ల వడ్లగొలుకల్ని పరిగె ఏరుకుంటడు. వడ్లను నలిచి అమ్ముతడు. ఒక్కొక్కనాడు అద్దెడు వడ్లు అమ్ముతడు.



జాతరకు పోయినమంటే మన ఖర్చు మొత్తం మామదే! జిలేబి తినిపియ్యాలె. కార బుక్కియ్యాలె. నాటుకం చూపియ్యాలె. కండ్లద్దాలు, గడియారం, పుల్లనగొయ్య కొనియ్యాలె. ఇంకా కొన్ని చిల్లరఖర్చులు.

ఇద్దరం కలిసి జాతర్ల తిరిగినం. స్టేజి ఎక్కడవేసింగ్రు, ఏ నాటుకం ఆడుతన్నరు తెలుసుకున్నం. జాతర్లనే మా దాసు చిన్నాయిన కనిపించిండు. మొన్నటిదాకా మా చిన్నాయినకూ మాకూ మాటలు లేకుండె. మా పెద్దనాయిన బిడ్డ పెండ్లీల అందరం కలిసినం. అప్పటినుంచే మాటలు కలిసినయి.

నాకేమో సినిమా చూడాలనుంది. అక్కడ ఒక తడుకల టాకీసుంది. 'మాయామచ్చీంద్ర' సినిమా. మామనేమో నాటుకానికే పోదామంటడు. దాసు చిన్నాయిన కనబడ్డంక నాకు కొద్దిగా పానమచ్చింది.

'చిన్నాయినా సినిమాకు పోదామానే' అన్న. 'చల్..ఏం సినిమా పాడైందిరా. 'మాయాబజార్' ఆడుతున్నరట. నాటుకానికి పోదాం' అన్నడు. నాకు సల్లవడ్డది. చేసేది లేక వాళ్ల వెంటనడిచిన.

తడుకల టాకీసు తొవ్వలనే ఉంది. జనం పలుచగున్నరు. నాటుకం దగ్గర మాత్రం జాతరలెక్కున్నరు. టికెట్ల దగ్గర తన్నుకుంటున్నరు. మూడుటికెట్లు తీసుకుని లోపలికి పోయినం. అప్పటికే పెరడు మొత్తం నిండింగ్రు. మాకు ఎనుక దిక్కున కొద్దిగ జాగ దొరికింది.

నాటుకానికి పోయినంక కొండయమామ ఒక్కతావున కుదురుగా కూసోడు. ఆటమొదలయ్యే దాక స్టేజిచుట్టే తిరుగుతడు. మాల్లెపోల్ల పుట్టుపూర్వాలు, ఏ ఆటలు ఆడింది, ఏమేం నేర్చింది అడుగుతడు. ఎట్లనో సుట్టీర్కం కలుపుతడు. మామకు తబలాకొట్టుడువచ్చు. పోయినప్రతీ చోటా 'తబలాకాడులేకుంటే నన్నుపిలువుండ్రి' అంటడు. ఒకసారి ఇట్లనే దాసరి బాగోతంల రాత్రంతా తబులాకొట్టి రెండురోజులు జరమచ్చిపన్నడు. అలువాటులేని కొట్టుడాయె.

కూసుండేందుకు జాగను ఆపుమని, మామ చిన్నాయిన ఇద్దరు స్టేజిదగ్గరికి పోయింగ్రు. నేను తువ్వాల పరిచికూసున్న. జనం వస్తనేఉన్నరు. ఇది మా జాగ అంటే ఒకలిద్దరు వదిలిపెట్టింగ్రు. ఎంతసేపని ఆపుతం.

జాగ నిండిపోయినంక నేను వద్దంటున్నా తువ్వాల జరిపికూసున్నరు. నేను మగ్రవడితే నెత్తిమీద రెండు టుంగుపోట్లు పొడిచింగ్రు. నేను ఏడ్సుకుంట స్టేజిదగ్గరికిపోయిన. అక్కడ మామలేడు. చిన్నాయిన లేదు. లోపల పరుదా చాటున కూసున్నరట. ఆ విషయం నాకు తెలువది.

నాకు భయమయింది. ఏడ్సుకుంట పెరడంతా తిరిగిన. ఎక్కడాలేరు. జాతరంతా తిరిగిన. కనిపించలేదు. వచ్చి స్టేజిముందటనే కూసున్న. ఆటమొత్తం అయిపోయినంక ఇద్దరూ బయటకచ్చింద్రు. 'ఎటుపోయినవురా' అని నన్నే తిట్టింద్రు. నాకుకోపమచ్చింది. ఈ జన్మల మామతోని నాటుకానికి రావద్దనుకున్న.

అప్పటికి తెల్లారే జామయింది. ముగ్గురం మిటాయిరాజం దుకాణం ముందట కూసున్నం. కొండయమామ చిన్నాయినకు బాగోతపు మ్యాల్లెం గురించి చెబుతండు. దాసు చిన్నాయిన తలుకాయ ఊపుతండు. మొత్తం మీద తనవంతుకు ఐదుగురు మందిని జమ చేస్తనన్నడు చిన్నాయిన. మ్యాల్లెం పెట్టాలన్న నిర్ణయం జరిగిపోయింది. ఇంతకు ముందైతే మామ ఒక్కడే ఉండె. ఇప్పుడు చిన్నాయిన తోడైనంక మామకు బలమచ్చింది.

జాతర్ల పుస్తకాల దుకాణాలుంటయి. అందులో నాటుకాలు, యక్షగానాలు, బాగోతుల పుస్తకాలుంటయి. నేను చిన్నాయిన ఇంటికి వచ్చినం. కొండయమామ మాత్రం నాటుకం పుస్తకం కొనుక్కస్తనని అక్కడనే ఉన్నడు. ఏ పుస్తకం తేవాలెనో రెండుమూడు పేర్లు చెప్పిండు చిన్నాయిన.

ఇంటిదగ్గర ఆరోజు మా తాతలేడు. ఎడ్లు దొడ్లెనే ఉన్నయి. కొండయ మామ ఇగరాడు, అగరాడు. పగటియాల్లదాకా చూసి మా లస్మవ్వనే ఎడ్లను నీళ్లకొరకు ఇడిసిందట. అవి నాలుగు కాళ్ల పల్లలేపి ఒక్కటే ఉరుకుడట. ఎవల చేను మేసినా జురుమాన తప్పదు. లస్మవ్వ ఏడ్సుకుంట ఇంటికచ్చిందట. పొద్దుగూకినంక ఊరికిపోయిన తాత జాతరకు పోయిన మామ ఇద్దరూ చేరుకున్నరు. ఎడ్లు మాత్రం తిరిగిరాలేదు.

తాత మామను కొట్టనిదే పాపం. ఎడ్లను దేవులాడుకత్తెనే ఇంట్లకు అడుగు పెట్టాలన్నడు. ఆ రాత్రంతా పాటలు పాడుకోవచ్చునని రెండు పుస్తకాలు కొనుక్కచ్చిండు మామ. ఒకటి 'గయోపాఖ్యానం'. ఇంకొకటి 'రుక్మాంగద'. ఈరెండూ యక్షగానాలే. పుస్తకాలు తెచ్చుకున్న సంతోషం ఎటువోయిందో! బువ్వగూడా తినలేదు మామ. పుస్తకాలను జేబులపెట్టుకుని రాత్రికిరాత్రే ఎడ్లను వెదుకడానికి పోయిండు.

ఆ ఎడ్లు కొత్తయి. గైసింగారం దొరల దగ్గర కొనుక్కచ్చినయి. అవి సక్కగ అక్కడికి గూడా పోలేదట. జక్కుల చెరువుమీద పెద్దమ్మ జంగల్ ఉందిగదా. ఆ జంగల్ల ఉన్నయట. అక్కడ చెరుకు తోటలున్నయి. తోట్ల పడిమేస్తుంటే ఎడ్లను నాగలి కట్టింద్రట. జాడజాడలు పట్టుకుని తెలుసుకుని రెండు రోజులకు ఎడ్లను కొట్టుకొని వచ్చిండు మామ.

ఎడ్లు దొరికినంక మామ చిన్నాయిన ఇద్దరు కలిసింద్రు. మ్యాల్లం బెట్టి నాటుకాలు వేద్దామని అందరినీ అడుగుతంద్రు. ఈ పని మామ ఒక్కడే చేస్తుండె. కాని మామకు



టైంలేదు. కూరుకు పొద్దుండంగనే లేచి దొడ్డికాడికి పోవాలె. ఆవులది ఎడ్లది పెండ తియ్యాలె.

ఎడ్లకు గడ్డి వేసి దొడ్డిని సదురుకోవాలె. ఆవులను మందల కలుపాలె. అప్పటికే అంబటి యాల్లయితది. వచ్చి తానం జేసి అన్నం తినాలె. మళ్లీ పనికో లేకుంటే ఎడ్లను మేపనో పోవాలె. పొద్దుగూక వచ్చి ఎడ్లకు గడ్డివేసి, ఆవులను దొడ్లె తోలి వచ్చేసరికి కూరుకురాత్రి దాటుతుండె. అందుకని ఈ పనిని చిన్నాయినకు అప్పజెప్పిండు.

అంతవరదాక మాఊర్లె ఎవరూ మ్యాల్లం పెట్టలేదు. అప్పుడప్పుడు దాసరోల్లు, గోత్రాలోల్లు ఆటలు ఆడుదురు. కొత్తగా మాల్లెం పెడుదామంటే ఎవరూ జమకూడుతలేరు. అందరూ నవ్వుతంద్రు. దాసు చిన్నాయిన కొండయమామకంటే పట్టుదల మనిషి. ఎందరు ఏమన్నా వారంరోజుల్లో పదిమందిని జమజేసిండు.

గొల్లకొమురయ్య ఇంట్ల రియార్సల్ మొదలయింది. వాళ్ల ఇల్లు పెద్దగుంటది. ఆటనేర్పే మనిషిని కొండయమామ మాట్లాడిండు. ఆయిన పేరు బాలాగౌడు. 'నాకు ఒక్కటే రుక్మాంగద' ఆట నేర్పత్తది' అన్నడు బాలగౌడు. దాసరోళ్లను తబలా తాళాలు అడుక్కచ్చింద్రు.

అసలు కత అప్పుడు మొదలయింది. ఒక్కరోజుగాదు. రెండురోజులుగాదు. వరుసగా నెలరోజులు రియార్సల్ చెయ్యాలె. మాతాత తిడుతడన్న భయం మొదలయింది మామకు. నేను మామ కావలే కాత్తున్న. ఆయిన తోని బయట పడుదామని చూస్తున్న.

'మామా...రియార్సల్‌కు నేనత్త'. ముందుగనే మూతిముడిచి సీటిమీద చెప్పిన. మామ మనసు పట్టించుకునే స్థితిలలేదు. తన ఆగంల తానున్నడు. తిండిగూడా సరిగ్గా తినలే. గొంగడి కొప్పెరపెట్టుకున్నడు. మూలమూలలీగుతూ బయటకచ్చిండు.

'యాడికిరా...రాత్రిపూట' కోపంగా అడిగిండు తాత.

'దొడ్డికాడ పండుకుంట. గడ్డిని ఎత్తుకపోతంద్రు. నిన్న నాలుగుపంజల గడ్డి మాయమైంది" మామ అన్నడు. మామకు తెలుసు. ఇంట్ల బియ్యం లేకపోయినా బాధపడడుగనీ దొడ్లెగడ్డి లేకుంటే తాత బాధపడుతడని.

తాత మారు మాట్లాడలే. మామ ఇంట్లకు వచ్చి చెప్పులేసుకున్నడు. "మామా...నేనత్తా". మా భాషలో నేను అడిగిన. మామ వినరానట్టే బయటకు నడిచిండు. నేను మాలస్మవ్వ దగ్గరికి పోయి 'అవ్వా..మామను తోలుకపొమ్మనే' అన్న గావురంగా.

"వద్దుపిల్లగా. దొడ్డికాడ సలివెడుతది. పురుగూబుషి..మీ బాపుతోని వశంగాదు." యాష్టపడ్డది అవ్వ.

"మామ దొడ్డికాడికికాదు. గొల్లకొమురయ్య ఇంట్ల నాటుకం నేరుత్తంద్రు" గుసగుసగా చెప్పిన.

"మా తెలుసుతియ్యి. తాతతోని చెప్పకు." నానోరు మూసింది లస్మవ్వ. నాకు విచిత్రమనిపించింది. రాత్రంతా నిద్రవట్టలేదు. పొద్దున్నే మామను కలుసుకున్న. ఏం పాటలు పాడింది. తబలా తాళం ఎట్లాకొట్టింది ఒకటికి రెండు ఊరిచ్చి చెప్పిండు మామ.

ఇంక నాకు ఆగబుద్దిగాలేదు. ఎవరిని అడుగుడు ఎందుకనుకున్న. మరునాడు రాత్రి సక్కగ గొల్ల కొమురయ్య ఇంటికిపోయి అందరికంటే ముందుగనే కూసున్న. నేను ఎప్పుడూ మామతోనే ఉంటగదా! నన్ను ఎవలూ అటకాయించలేదు. మామగూడా నన్ను చూసి నవ్విండు. నాకు ధైర్యమచ్చింది. ఎనుకవరుసల కూసున్నోడిని ముందు వరుసలకచ్చి మామ పక్కన కూసున్న.

దాసుచిన్నాయిన తాళం. కొండయమామ తబులా. బాలాగౌడు పాటలు సదివి వినిపిస్తండు. అది యక్షగానం. అన్నీ బాగోతం పాటలే! కొన్ని ఆటతాళం, కొన్నిదర్వులు, కొన్ని సీసపద్యాలు. పాటలన్నీ చల్తీమీదున్నయి. బాలగౌడు పాడుతుంటే తబులా తాళం దుమ్మురేగుతంది.

"ఇయ్యల్ల వచ్చినవు. రేపటినుండి రాకు. వత్తే మీ బాపుకుచెప్పుత" రియార్సల్ అయినంక మామ అన్నడు బెదిరిస్తూ.

నాకు కోపమొచ్చింది. "నేను గూడా చెప్పుత. మీనాయినకు." మాటకుమాటన్న.

మామనోరు తెరువలేదు. ఇద్దరం దొడ్డికాడికి పోయి పండుకున్నం. కన్ను అంటుకున్నదో లేదో తెల్లారింది.

ఇట్లా నెలరోజులు రియార్సల్‌కు పోయినం. తాతకు మా సంగతి తెలిసింది. ఏమంటడోనని భయపడ్డడు మామ. ముందట ఏమనలేదుగానీ మాలస్మవ్వతో మాత్రం "వానికి నువ్వే అలుసు ఇత్తున్నవు. ఎన్నడన్నా పనికి అందని నాడు చెప్పుత. వానిసంగతి నీ సంగతి" అన్నడట. ఆనాటినుండి ఏ పనికీ ఎనకాముందు కాలేదు మామ.

సరిగ్గా ముప్పయి మూడవ రోజునాడు నాలుగు తొవ్వలకాడ 'రుక్మాంగద' నాటుకం వేసింద్రు. ఆటంటే ఆటగాదు. మోతమోగింది. ఏశగాళ్లకు మంచి పేరచ్చింది. తొవ్వపొంటి పోతుంటే అసలు పేరుగాదని ఏశం పేరుతోనే పిలుసుడు మొదలు పెట్టింద్రు.

కొండయ మామకు కొండంత మురిపెమచ్చింది.



# నేనూ - మామ - దున్నపోతు

గడ్డకింది చేను. దున్నపోతుల నాగలి. యాసంగి దున్నుకాలు. అప్పటికే దున్నుడు లేటయింది. వరినారు ముదిరిపోయింది. మా కొండయ మామ దున్నుతున్నడు. ఈమధ్య మాతాత ఎడ్లను అమ్మి దున్నపోతులను తెచ్చిండు. మామ దున్నుకుంటనే పాటవాడుతండు.

మా లస్మవ్వ సద్దిగట్టి నాతోపంపింది. నేను సొలుక్కుంట సొలుక్కుంట నాగలి దగ్గరికి పోయిన. సద్దిని ఒడ్డుమీద పెట్టిన. కాకులో కుక్కలో చుట్టుకుంటయని సద్దిమీద తట్టను బోర్లేసిన.

మామ సంగతి నాకు బాగా తెలుసుగదా! ఒకపని చేస్తుంటే ఇంకో చూపే ఉండదు. తొవ్వనడుత్తుంటే పక్కన ఎవరు పోతున్నరో చూడడు. ఎప్పుడూ నాటకాల ద్యాసనే! ఎప్పుడు ఏదో ఒక పాట గుయిగుయిమని పాడుతనే ఉంటడు.

"మామా..సద్దితెచ్చిన తిను." గట్టిగా చెప్పి ఎనక్కి మళ్లిన.

నేను బడికి పోయే ఆగంలో ఉన్న. నాపిలుపు విన్నంకనే నారాకను గుర్తించినట్టున్నడు మామ. నాగలి ఆపి కేకవేసి పిలిచిండు. సీటిగొట్టి రమ్మన్నడు.

"నాకు పొద్దువోయింది. బడికిపోవాలె" అనుకుంటూ దగ్గరికి పోయిన. ఇంకోరోజు అయితే పిలిచినా విననట్టు ఉరుకుదుంటిని కానీ ఈరోజు రాత్రి గడీలో 'రుక్మాంగద' ఆట ఉంది.

మామది యమధర్మరాజు వేశం. ఆకారం రాగం పాత్రకు తగ్గట్టుంటయి. ఇవన్నీ చూసే బాలగౌడు పంతులు ఆ వేశాన్ని మామకు ఇచ్చిండు. ఈ ఆట ఆడటం ఇది రెండోసారి.

నేర్వంగనే మొదటిసారి ఆడినవిషయం తెలుసుగదా అప్పుడు రంగులకు మేకప్ సామానుకు పంతులు నేర్పినందుకు కొంతఖర్చయింది. ఆ ఖర్చు మొత్తం కొండయమామనే పెట్టుకున్నడు. ఆ బాకీతీరాలంటే ఇంకొక ఆటను టికెట్టుపెట్టి ఆడాలని మామనే ప్లానేసిండు.

"మొన్ననే ఆడినంగదా! అదేఆటను ఇప్పుడు టికెట్టుపెట్టి ఆడితే ఎవలు సూస్తరు" అని కొందరన్నరు. పైసలే రావాలె ఖర్చులే నిండాలని కాదు మామకు. ఎట్లయినా ఇంకొ ఆట ఆడాలని కోరిక.

'ఎందుకు రారు. మొన్న మంచిగ ఆడినంగదా. మస్తుమంది వస్తరు. ఎందరైనా రాని. వందరూపాయలచ్చినా చాలు ఖర్చులుపోతయి' అని అందరినీ ఒప్పించిండు మామ.

మామ భలే ఇకమాతులోడు. పుస్తకంలో లేకున్నా నాకొక వేశం గూడా పుట్టిచ్చిండు. అదీ ఈ రెండవ ఆటకే. మొన్న ఆట వేసినప్పుడు  నాకు ఈ వేశం లేదు. ఇప్పుడు ఎందుకు ఇచ్చిండంటే మామకు సదువు సక్కగరాదని తెలుసుగదా. పాటలన్నీ నేనే సదివి వినిపియ్యాలె. అట్లా నోటికి యాదిజేసిండు మామ.

మామ పాత్ర పెద్దదిగదా. ఎప్పుడన్నా మధ్యలో పాట రాకుంటే నేనే పాట మొదలును అందియ్యాలె. నాకు ఒక ఏశం ఇస్తెనే వస్తా.! ఏశం లేకుంటే నేను రానని చెప్పిన. నేను లేకుంటే మామపని వట్టిదే! దెబ్బకు దిగివచ్చిండు. నా ఈడుకుతగిన వేశాలు లేకపోవడంతో చిత్రగుప్తునిపాత్రను కొత్తగా పెట్టిండు.

మామ వెంట నేను పెద్ద బుక్కు పట్టుకుని రావాలె. నాకు పాటలు లెవ్వు. రెండే రెండు మాటలు.

కొండయమామ 'చిత్రగుప్తా' అంటడు.

నేను 'మహాప్రభో' అనాలి.

'పాపులలెక్కలు సరిగ్గా రాస్తున్నావా' అంటడు మామ.

నేను 'రాస్తున్నాను ప్రభూ' అనాలి.

మామ 'బ్రహ్మలోకం వెళ్తున్నాను జాగ్రత్త' అంటాడు. నేను 'చిత్తం ప్రభూ' అనాలె.



అంతటితో నా పాత్ర అయిపోయినట్టే.

'ఏందిమామ రమ్మన్నవు". మాపద్దతిలో సీటిగొడుతూనే అడిగిన.

కొండయమామ నాగలి ఆపిండు. ముల్లుకట్టెతో దున్నపోతుల ఈపులమీద టకటక కొడుతూ 'దీనిపేరు అబ్బశెల్లి. దీనిపేరు బొబ్బలీరి' అన్నడు. ఒకటి మామూలుగా నిలబడింది. ఇంకొకటి మాత్రం  కట్టె నడుంమీద పడంగనె చెంగున ఎగిరింది. వాటిపేర్లు ఎందుకు చెప్పిండో అర్థంకాలేదు.

'యమధర్మరాజు వాహనం దున్నపోతు. నేను ఈరోజు పోతును ఎక్కివస్త. నువ్వు పగ్గాలు పట్టుకుని ముందట నడువాలె. అచ్చం యమధర్మరాజు లెక్కనే వచ్చిండని జనంనోరు తెరువాలె." అడుగుదామనుకునే లోపునే తనే చెప్పిండు.

నాకు బలే గమ్మతనిపించింది. నిజంగా మామ ఆలోచనే వేరనుకున్న. నేను ముందుకు నడవబోతుంటే తనే చెప్పిండు. "రాత్రి నేను మేకప్‌మీద కూసుంటగదా! నువ్వే కొట్టంకాడికి పోయి పోతును కొట్టుకరావాలె. మెడకు, కాళ్లకు కొమ్ములకు దండలు కట్టాలె. ఈ అబ్బశెల్లిగాడు సప్పుడైతే వట్టిగనే బెదురుతది. ఈ బొబ్బలీరిగాన్ని యాదికొద్ది కొట్టుకరావాలె." ఇంకోసారి పోతును సూపిస్తూ చెప్పిండు.

గట్లనేనని తలూపి బడికిపోయిన. ఆరోజు పొద్దంతా నాకు ఇవే ఆలోచనలు. పోతును ఎట్లా మేకప్ చెయ్యాలె! దండలు ఎక్కడెక్కడ కట్టాలె అని.

చిత్రగుప్తుని ఏశం నాకు కొత్తగ గదా. వాడు తెల్లగుంటడా నల్లగుంటడా అన్న అనుమానం గూడా వచ్చింది. మా తెలుగు సారును అడిగిన. ఆయిన కోపంగనే చెప్పిండో నిజంగనే చెప్పిండోగని 'నా మొఖం లెక్కుంటడు' అన్నడు.

సారు మొఖం అచ్చం బొగ్గులెక్కుంటది. నేను నిజమే అనుకున్న. బడి ఇడువంగనే ఇంటికి వచ్చిన. పాతది ఒకబొంత, మా బాపుది ఒకదోతి, చీర మడుత పెట్టుకున్న. పెరటి తోటలకు పోయిన. బంతిపూలు తెచ్చిన. నాకొకటి పోతుకొకటి రెండు దండలు గుచ్చిన.

కట్టెది కత్తి అట్టకిరీటం అంతకు ముందురోజే తయారు జేసుకున్న. ఒక డబ్బాలో బండి ఇరుసుకు రాసే కందెనను నింపుకున్న. ఇవన్నీ ముల్లెగట్టుకుని స్టేజిదగ్గరికి పోయిన.

స్టేజి ఈసారి గడీల ఏసింద్రు. ఎందుకంటే చుట్టు గోడలున్నయి. పెద్ద పాటాకున్నది. టికెట్లు పెడుతున్నంగదా. దొంగతనంగా ఎవరికీ లోపలికి పోరాదు. పందిరివేసి పరుదాలు కడుతన్నరు. మా మ్యాల్లం కొత్తకొత్తగ కదా! మా పరుదాలన్నీ చీరలు, దోతులు, కప్పుకునే

దుప్పట్లే. వాళ్లనొకటి వీళ్లనొకటి అడుక్కచ్చినం. పెట్రమాక్సు లైట్లు మాత్రం కిరాయికి తెచ్చినం.

మామ నన్ను చూసి పోతును కొట్టుకురమ్మన్నట్టు సైగచేసిండు. నా ముల్లెను పరుదాల పక్కకు దాచిపెట్టి దొడ్డికాడికి పరుగుతీసిన. అప్పటికి చీకటిపడింది. రెండుపోతులు ఒక్కతీరే ఉన్నయి. ఏది ఏదో తెలుస్తలేదు. ఏదో ఒకటి అనుకుని ఒకదాని కొమ్ముకు పగ్గంబెట్టి గడీలకు తీసుకచ్చిన. స్టేజి వెనుక యాపచెట్టుకు కట్టేసిన. అక్కడ ఎలుతురు సరిగాలేదు. రెండే రెండు పెట్రమాక్స్‌లైట్లున్నయి. అవిగూడా స్టేజిముందటనే.

ఆ పోతు అబ్బశెల్లిగాడని చప్పుడు వింటే బెదిరిపోతదని నాకు తెలువది. ఎప్పుడు చూసినోళ్లకే దున్నపోతులను గుర్తుపట్టడం కష్టమైతది. అటువంటిది చీకట్ల నాకేంతెలుస్తది. ఎవరిమేకప్‌లో వాళ్లున్నరు. నేనేమో పోతును మేకప్ చేస్తున్న.

పోతుకు ఒక దండవేసిన. నేనొక దండవేసుకున్న. దానికి బొంతకప్పిన. నేనుదోతికట్టుకున్న. నాముఖానికి నల్ల రంగుపూసుకున్న. పోతుకొమ్ములకు జాజురుద్దిన. నేను కిరీటం పెట్టుకున్న. పోతుకాళ్లకు నులక తాళ్లుచుట్టిన.

అది అప్పటికే బుస్సుబుస్సు మంటుంది. ఎందుకైనా మంచిదని సందెడు గడ్డిని తెచ్చి ముందటవేసిన. అది గడ్డి పోస ముడుతలేదు.

ఆట మొదలయింది. రుక్మాంగుడనే వాడు రాజు. తన రాజ్యంలో అందరూ యాకాశి నోములు వ్రతాలు చెయ్యాలని రూలు పెడుతడు. ప్రజలంతా నోములు చేస్తరు. ఆ పుణ్యంతో అందరూ స్వర్గమే పోతరు. నరకానికి ఎవలూ పోరు.

యమధర్మరాజుకు నరకం మూతపడేట్టున్నదన్న భయం పట్టుకుంటది. వెంటనే బ్రహ్మదగ్గరకుపోయి మొరపెట్టుకుంటడు. బ్రహ్మ మాయరూపంతో వచ్చి వ్రతాలను నోములను బంగం జేత్తడు. అదీకథ.

ఆట మంచి మూమెంటుకచ్చింది. యముడి ఏశం రానేవచ్చింది. మామ నాకు సైగజేసిండు. నేను యాపచెట్టు దగ్గరినుంచి పోతును గుంజుకచ్చిన. మామ ఎక్కి కూసున్నడు. నేను పగ్గంబట్టుకుని ముందట నిలవడ్డ. పరుదాను పక్కకు జరిపిన. పగ్గంతో పోతును స్టేజిమీదికి గుంజిన. పోతు రెండడుగులు ముందుకేసి స్టేజి నడుమలకచ్చి బెదిరిబెదిరి సూత్తంది.

జనం గడి మొత్తం నిండింద్రు. మమ్ములను విచిత్రంగా చూస్తంద్రు. స్టేజిముందు కూసునోళ్లు 'అరే! నిజంగా యమధర్మరాజేరా' అంటంద్రు సప్పట్లుగొట్టి. కొండయమామ



ఉబ్బిపోయిండు. గదను తిప్పుకుంటా 'దక్షణ దిక్పాలుడా... యమధర్మరాజునాముడా' అని రాకడపాటను అందుకున్నడు.

అప్పుడే తబలా, తాళం మోగినయి. ఇగజూడు పోతుసంగతి. చెంగుమనిఎగిరింది. నాలుగు కాళ్లను లేపి రెండు దుంకులు దుంకింది. మామ కూసున్నోడు కూసున్నట్టె ఎనుకకు ఇరుసుకపడ్డడు. నా చేతుల పగ్గం ఉంది. నేను పోతును బలంగా గుంజిపట్టిన.

పోతు ఆగలేదు. ముందుకు దుంకి పరుగందుకుంది. నేను స్టేజికి పాతిన కట్టెను అందుకున్న. అప్పటిమందం పాతినదాయె. ఇరిగి కిందపడ్డది. నేను ముక్కు మూల్సుకునిపడ్డ. ముక్కూ మొకం కొట్టుకపోయింది. అయినా పగ్గం విడువలేదు. పోతు నన్ను గొర్రగొర్ర గుంజింది అప్పుడు పగ్గం ఇడిసిపెట్టిన.

పోతు మందిలకు ఉరికింది. బొబ్బలు కీకెలు. బెదిరి వెనక్కి తిరిగి స్టేజిమీదికి వచ్చింది. మేన్‌పరుదాల కొమ్ముపెట్టి చెలిపింది. స్టేజిమొత్తం పోతుమీదనే కూలింది. షాందిరికి షాందిరి ఎత్తుకుని ఎనుకవైపు పరుగుదీసింది. ఒకన్నిపట్టక ఒకడు జనం ఒక్కటే ఉరుకుడు.

ఎంతలేదన్నా ఇరువై ముప్పయి మందికి దెబ్బలు తాకినయి. మా అదృష్టం ఏంటిదంటే రెండు దిక్కుల పెట్టిన పెట్రమాక్సులైట్లను స్టేజికిపాతిన కట్టెలకు గాక కొద్ది దూరంగా కట్టెలుపాతి వాటికి కట్టినం. స్టేజి కట్టెలకే కడితే మొత్తం కాలిపోతుండె.

కొండయ మామనైతే వారం పదిరోజులు మంచంలోంచి లెవ్వలేదు. సచ్చిపోయినట్టే చేసిండు. బతుకనే బతుకడనుకున్నరు.

నాకు దెబ్బలేం తాకలేదు. అంత కత చేసింది నేనేగదా. తిడుతరని భయమయింది. నేను గూడా సచ్చిపోయినట్టేజేసిన. మామ లేసినంకనే లేసిన. ఆ వారం పది రోజులు మా రెండు ఇండ్లల్ల ఎసరు పెట్టలేదు. మూటికచ్చిన మాల్లెం ఇచ్చుకపోయింది.

మామ ఏమంటడోనని నాకు పుట్టెడు బయముంది. అందుకే మామకు దూరదూరమే ఉంటున్న.

ఒకనాడు నన్నుదగ్గరికి పిలిచిండు మామ.

"నాకు దెబ్బలు తాకినయనుకున్నావురా... తాకలేదు. యాక్షన్ చేసిన. లేకుంటే దెబ్బ తలిగినోళ్లు పంచాది పెట్టి జురుమాన దీత్తురు." అన్నడు.

'అమ్మ... కొండయమామా నువ్వు దండోనివి' అనుకున్న.

# మా గురువు జంగం పంతులు

ఆ మధ్య మా తాతోల్లయి రెండుబర్లు ఈనినయి. అవి గౌడిబర్లలెక్క పెద్దసనుగు. బుడ్డెడు బుడ్డెడు పాలిత్తుండె. మాలస్మవ్వ పాలను పెరుగుజేసి కుండెడు కుండెడు సల్లజేత్తుండె. కంకెడు కంకెడు ఎన్నదీత్తుండె. తౌడుతెచ్చినోల్లకు గుండెడు గుండెడు సల్ల పోత్తుండె. గిన్నెడు గిన్నెడు పాలగోకును కశికెతో గీకి నాకు పెడుతుండె.

అప్పుడే ఊర్లె రెండు చాయ వోటల్లయినయి. తాత వోటల్లకు పాలవాడిక మాట్లాడిండు. రెండు వోటల్లకు రెండు ముంతలపాలు ఇచ్చివత్తుండె. ముంతకు ఆటానచొప్పున రోజుకు రూపాయి. పాలుపిండుడు ఇచ్చిరావడం తాతవంతు.

ఒకరోజు ఏమైందంటే తాత రెండు చేతుల్లో రెండు పాలముంతలు తీసుకపోతుండట. ఎదురుగా కర్నం పంతులు వత్తుండట. తాతచేతుల పాలచెంబులను చూసి ''కాపుదనపోల్లు పాలను అమ్ముకుంటరా తిరుపతీ.. కరిద్దోల్లు అమ్ముకుంటరుగనీ..పాడిని దానం చేసుకోవాలె" అన్నడట. తాతకు బండెడు బొక్కలిరిగి కిందపడ్డయట.

ఆరోజునుంచి టైంటెబుల్ మారింది. తాతపని మామకు మామపని తాతకచ్చింది. మామకు ఇంతకు ముందటిలెక్క కూరుకురాత్రి నిద్రలేచే పనిలేదు. కొద్దిగా మబ్బుతో లేస్తేసాలు. పాలువిండి రెండు చెంబులు పట్టుకుని వోటల్‌లో ఇయ్యాలె. మళ్లీ తొమ్మిది పదిగొట్టెదాక అంటే ఎడ్లకాడికో పనికో పోయేదాక పనేంలేదు.

అందుకే అదే వోటల్‌లో అడ్డవెట్టిండు మామ. చాయలు తాగుడు, బజ్జీలు తినుడు, బాత్‌కాన్లు గొట్టుడు. ఊర్లె తిరిగే టైం దొరికింది మామకు. అప్పటికి యాసంగి నాట్లు కలుపులు అయిపోయినయి. జనాలకు పనేంలేదు. వట్టిగనే ఉన్నరు.



అగో అప్పుడే మళ్లా మ్యాల్లం గట్టుడు మొదలు పెట్టిండు మామ. కొందరు పాతవాళ్లు కొందరు కొత్తవాళ్లు మొత్తం పదమూడు మంది జమయింద్రు. ఇయ్యల్ల వస్తనన్న మనిషి రేపు అవ్వతిడుతుందనో నాయిన తిడుతుండనో సాకులు జెప్పి తప్పించుకుంటరని మామకు తెలుసు.

అందుకనే ముందుగనే ఖర్చులకోసం పదేసిరూపాయలు ఇయ్యాలని చెప్పిండు. ఒకలిద్దరు జారిపోయింద్రు గనీ మిగిలినవాళ్లు పైసలు ఇచ్చి పేరు రాయించుకున్నరు. పేర్లు రాసుకుని లెక్కరాసుకునుడు నావంతే.

మామకు చెప్పలేని బలంవచ్చింది. సింగారం పోయి పాతయి తబులాలు కొనుక్కచ్చిండు. ఇంతకుముందు నాటుకానికి దాసరోళ్లను అడుక్కచ్చినం. మనతబులాలు మనకు ఉండాలని మామకోరిక. కామారెడ్డికి పోయి తబులాలు ముడిపిచ్చుకచ్చిండు. రెండు తాళంజోళ్లను గూడా కొనుక్కచ్చిండు.

అసలు సంగతి అప్పుడు మొదలయింది. మాకు నాటకం నేర్పే పంతులు గావాలె. ఇంతకుముందు నేర్పిన బాలగౌడునే అడిగిండు మామ. కలువదన్నడు గౌడు. అయినకు ఆ ఒక్క ఆటల పాటలేవచ్చునట. ఎప్పుడో చిన్నప్పుడు నేర్చుకున్నడట. ఇంకా ఒకటిరెండు ఆటలు ఆడిండటగనీ అవి అచ్చుపుస్తకాలుగావట. రాతపుస్తకాలేనట. అవి ఇప్పుడు దొరుకయట.

పంతులు దొరుకకపోతే మా మ్యాల్లెం ఇచ్చుకపోయినట్టె. అందుకే ఊరంతా వడబోత్తండు మామ. ముందుగా కూడనే కూడననుకున్న దాసు చిన్నాయిన గూడా వచ్చిచేరిండు. ఎక్కడనో రెండు నాటకం పుస్తకాలు గూడా తెచ్చి మామకు ఇచ్చిండు. పంతులు దొరికేదాక వట్టిగనే చదువుకుందామని గొల్ల కొమురయ్య ఇంట్లనే రియార్సల్ పెట్టింద్రు.

ఈ ముచ్చట మా తాతకు తెలిసింది. 'లుచ్చగాడిది కొడుకా...కాపుదనపోనికి బాగోతులెందుకురా' అని పుస్తకందీసి పొయ్యిలవెట్టిండు. ఇక మిగిలింది ఒక్కటే పుస్తకం. దాన్ని దాచిపెట్టుమని నాకు ఇచ్చిండు మామ. దాన్ని నేను పుస్తకాల సంచిలపెట్టుకొని బడికి తీసుకపోదుంటిని. రెండుమూడురోజుల్లో మూడు బేంచీలకు తిరిగింది పుస్తకం. క్లాసులనే మ్యాల్లం గట్టినం.

ఈ రెండు మూడురోజులు గొల్ల కొమురయ్య ఇంట్ల రియార్సల్ జరిగింది. తాత తిట్టిండని మామపోలేదు. నేనుగూడా పోలేదు. మామ పోకుంటే అక్కడ మ్యాల్లమే లేదు. ఇగ ఇచ్చుకపోతుందనుకున్న సమయాన మా దాసు చిన్నాయిన మంచివార్త తెచ్చిండు.

మా ఊర్లె జంగం పంతులున్నడు. ఆయిన నాటకం నేర్పిత్తనన్నడట. ఒకటిగాదు రెండుగాదు వరుసగ ఐదు ఆటలు నేర్పిత్తనన్నడట.

చిన్నాయినా మామా ఇద్దరుపోయి జంగం పంతులును కలిసింండ్రు. పంతులుకు ఇద్దరు కొడుకులున్నరుగనీ వాళ్లు పట్నంల నౌకర్ల మీదున్నరు.. ఊరుమీద మంచి ఆదాయమున్నదని పంతులూ పంతులమ్మ ఇద్దరూ ఇక్కడనే ఉన్నరు. ఇల్లు మస్తుపెద్దగుంటది.

“ఇగో… మీరు ఇష్టమున్న నాటకం తెచ్చుకోండ్రి. నేర్పిస్తగని నాటకానికి యాభైరూపాయలియ్యాలె. మా ఇంటికే రావాలె” పంతులన్నడు.

మామ, చిన్నాయిన యాభై అంటే యాభైగాదని ముప్పయిరెండు రూపాయలకు ఖాయంజేసింండ్రు. తబలాలు తాళాలు ఆ రాత్రికే పంతులు ఇంట్లకు మారినయి. పంతులు ఇంట్ల కరంటులేదు. దీపముంది.

రియార్సల్‌కని కందిలి కొనుక్కచ్చిండు మామ. ఒక్కసారి ఐదులీటర్ల గ్యాస్‌నూనె కొనుక్కచ్చిండు. ‘గయోపాఖ్యానం’ ఆట నేర్వాలనుకున్నరు. ఇంత జేసిందుగనీ రాత్రి రియార్సల్‌కు పోలేదు మామ. తాత తిడుతడని భయం.

మామ ఎప్పుడు వెళ్తడా ఎప్పుడు వెంటపడదామా అని నేను చూత్తున్న. అందుకనే తొందరగా తినివచ్చి కూసున్న. మామ ఎంతకూ వెళ్లకపోయేసరికి నాకు యాష్టకచ్చింది.

‘మామా..రియార్సల్ పోవద్దా’ అడిగిన సీటిమీదనే.

‘తాత తిడుతడు’ మామ అన్నడు.

‘తిట్టకుంట ఉపాయం చెప్పుత’ మామతోని సీటిమీదనే అన్న. అప్పుడు మా తాత ఇంట్లనే ఉన్నడు. కల్లుతాగుతున్నడు.

నేను మా లస్మవ్వతోని ‘అవ్వా.. మాబాపు ఊరికిపోయిండు. మామను పండుకునేతందుకు రమ్మన్నది మామ్మ’ అన్న.

అవ్వకు మా సంగతంతా తెలిసే ఉంటది. అందుకని వెంటనే ‘కొండా..జెట్టన తినిపోరా. ఇద్దరు ఇక్కడనేఉంటే ఆ దొర్సాని బయపడుతది. చిన్నప్పటి నుండి గదే! చీకటివడితే భయమంటది’. అన్నది.

మామకు సందు దొరికింది. జెట్టన తిని చెప్పులేసుకున్నడు.. నడుత్తూనడుత్తూ ‘అరేయ్ బక్కోడా! నువ్వెందుకు. నువ్వు ఇక్కడనే పండుకో’ అని నాకే ఎసరు వెట్టిండు.



నేను. ‘హమ్మ మామా..నాకే ఎసరు వెడుతవా’ అనుకున్న. పుస్తకాలు గూట్లెపెట్టిన. ‘నేనుండ, పోతున్న’ అనుకుంట ఒక్కటే లెంకందుకున్న. సక్కగ జంగం పంతులు ఇంటిముందు ఆగిన.

పంతులు ఇల్లు సందిలుంది. అటువరుస ఇటువరుస అన్నీకోమటిండ్లే. నడుమల జంగం పంతులు ఇల్లు. బజారు లైట్లున్నయిగనీ సందిలకు ఎలుగురాదు. బయట రెండు అరుగులున్నయి. వచ్చి నోళ్లు వచ్చినట్టు అరుగుమీద కూసుంటండ్రు. ఇద్దరు కోమట్ల ఇండ్లల్ల కరంటుందిగనీ వాళ్లు బయట లైట్లు వెయ్యలేదు. సందిల చీకటి చీకటుంది

అందరు జమయినంక రియార్సల్ మొదలయింది. నేను ఏమో అనుకున్నగనీ జంగం పంతులు రాగం మోతమోగింది. పాటను ఎట్లా ఎత్తాలె ఎట్లాదించాలె బాగా తెలుసు. సీసపద్యాలు బలేగుంజుతండు. దర్వును బలే ఎత్తుతండు. మామ తబలా బాగా కొడుతున్నడా లేక పంతులేపాట బాగాపాడుతున్నడా తెల్సుకోవడం కష్టమైంది.

‘గయోపాఖ్యానం’ గూడా బాగోతమే. అక్కడక్కడా కొన్నిపాటలు సదివి వినిపించిండు పంతులు. ఆరోజు పాత్రలు పంచుకున్నరు. మేటివేశాలు రెండూ మామకు చిన్నాయినకు ఇచ్చింండ్రు. ఐదురూపాయలిత్తే పారట్లు (పాత్రలు) తనే రాసిస్తనన్నడు పంతులు. అందరు ఒప్పుకున్నరు. జమాఖర్చులెక్కగూడా మామ అందరికీ చెప్పిండు.

మరునాటి నుండి మామ భయంపోయింది. అది ఎట్లా జరిగిందంటే మా జంగం పంతులే తాతను పిలిచి ‘తిరుపతీ… నీ కొడుకు మంచి ఉషారున్నడోయ్. రెండు నాటకాలు నేర్పిత్త తోలియ్యి. కొండడు లేకుంటే నాటకమే నడువది. వాళ్లు ఎవ్వలూ జమకూడరు’ అని తాతను ఒప్పించిండట.

మిగిలింది నాసంగతే! మామ నన్ను మాటమాటకు బెదిరిత్తండు. నేనేం తక్కువ తిన్ననా… మా పంతులుకే సూటివెట్టిన. దీపం ఎలుగులో పంతులుకు అక్షరాలు సరిగ్గా కనిపించయి. అది గమనించి మొదటి రోజునే పుస్తకం చేతులపట్టుకుని పాటలు అందిచ్చిన.

వారంరోజుల్లో నా లెవలే మారిపోయింది. మా మాల్లెంల సగం మందికి సదువేరాదు. మిగిలిన సగంమందికి వానకాలం సదువులె. పాత్రలు చూస్తూ పాటలు అందించేపని నామీదనే పడింది.

రెండువారాల్లో ఆపాటలు మొత్తం నాకు నోటికచ్చినయి. పుస్తకం పట్టకనే పాటలను నోటికి అందిచ్చుడు మొదలువెట్టిన. ఒకరోజు జంగంపంతులు లేకున్నా రియార్సల్ జరుగుతదేమోకానీ నేను లేకుంటే మాత్రం రియార్సల్ జరగని స్థితి ఏర్పడింది. అట్లా ఒకటి రెండుసార్లు పంతులు లేకున్నా రియార్సల్ ఎల్లదీసిన.

ఇది తెలిసినంక ఒకటిరెండు సార్లు కావాలనే రియార్సల్‌కు పోలేదు. మా కొండయ మామ తిరిగి తిరిగి నన్ను బతిలాడి పట్టుకపోయిండు. నేను లేనిది రియార్సల్ జరుగదని తెలిసినంక నేను ఊకుంటనా..? నాకొక ఏశం గావాలని అడిగిన. వెంటనే ఒక చిన్న ఏశమిచ్చింౘ్రు.

నెలరోజుల తర్వాత ఆటను గడీల ఏసినం. అంతకుముందే ఒకరోజు మేకప్ సామన్లకు పోయినం. రూపాయి టికెట్టు పెట్టినం. మొదటి ఆటమంచిగనే ఆడినంగదా! ఇది ఎట్లాడుతరో నని జనం బాగానే వచ్చింౘ్రు. అంతవరకూ ఆ నాటకాన్ని మాఊర్లె ఎవలూ ఆడలేదు. అందరు 'సరేరా' అన్నరు.

వేశం మీద మా అమ్మనైతే నన్ను గుర్తుపట్టలేదట. ఈ పోరడు ఎవలోగని వేశం మంచిగ కుదిరిందని ఎవ్వలతోనో అన్నదట గూడా. ఎంత తిడుతరో అనుకున్నగనీ మెచ్చుకునేసరికి నాభయం పోయింది.

జమాఖర్చులు లెక్కజూసుకున్నం అక్కడికక్కడికే అయినయి. బాకిలేదు, నిలువలేదు. అదే ఊపులో ఇంకో నాటకం నేర్వాలనుకున్నం. యాసంగి కోతలు వడితే పని తీరదిగదా. అందుకని మల్లా రియార్సల్ మోగిచ్చినం.

వరుసగ నాలుగు రోజులు రియార్సల్ చేసినం. ఐదో నాడు అగ్గిపిడుగు వడ్డది. బాల్‌రాజు మామ్యాల్లంల మనిషి. మేటి ఏశకాడు. గలుమకాడికి పోతన్ననని రియార్సల్ కత్తుండట. రెండు కొనమడ్లు ఎండి పోయినయట. వాళ్ల అవ్వ వచ్చింది. పొట్టు పొట్టు తిట్టింది.

అట్ల ఏదో పనిమీద పోతున్నాని రియార్సల్‌కు వత్తున్న వాళ్లు సగం మందిని పేరుపేరున బయటేసింది వాళ్లఅవ్వ.

అంతే! తెల్లారి రియార్సల్ బంద్.



# కోతి మూతి ఎల్లయ్య

మాఊర్లె ఇటికెల ఎల్లయ్య అని ఇంటిపేరు చెప్పినా ఎవలకు తెలువది. మంగలి ఎల్లయ్య అని కులంపేరు చెప్పినా ఎవలకు తెలువది. కానీ కోతిమూతి ఎల్లయ్య అంటే లాగుతొడుగని పిల్లగాడిక్కూడా తెలుసు.

ఎల్లయ్య మూతి కోతిలెక్కఉంటదనికాదు. కోతికి ఎల్లయ్యకు సంబంధమేలేదు.అసలు ఆపేరు ఎట్లా వచ్చిందో కూడా ఊర్లె సగం మందికి ఇప్పుడు తెలువది గానీ ఆపేరు అట్లా బండగుర్తు లెక్క నిలిచిపోయింది.

ఎల్లయ్య కొద్దిగా మందారం మనిషి. తండ్రిలేడు. తల్లి ఒక్కతే ఉంది. ఎల్లయ్య ఒక్కడే కొడుకు. ఎడ్డెక్కిరోడు. ఆగుమంటే ఆరునెల్లు. ఎవ్వలు ఏంచెప్పినా నమ్ముతడు. చిన్నప్పుడు పటేండ్ల దగ్గర జీతముంటుండె. అడివిల కుందేలు కనవడితే మోకాలును రాయితో కొట్టుకోవాలని ఎవరో చెప్పింౘ్రట. ఒకనాడు అట్లనే చేసి మోకాలు పలుగ్గొట్టుకున్నడట.

ఎల్లయ్యకు చిన్నప్పుడే పెళ్లయింది. భార్య పెద్దమనిషి అయిన్నాడు చేతుల రెండు కుడుకలు పెట్టి చెంపలు కొరుకాలని ఎవరో చెప్పింౘ్రట. నిజమే అనుకుని రెండుచెంపలు కొరికిండట. ఆపిల్ల భయపడి తల్లిగారింటికి పోయిందట. యాడాదిదాకా రాలేదట. ఎవలో ఏదో మోటుసామెత చెప్పి 'కోడలు దొర్సానిని అడుగురా చెప్పుతది' అన్నరట. నిజమే అనుకుని ఎల్లయ్య దొర్సానిని అడిగితే చీపిరికట్ట మర్రేసిందట.

ఇంతకీ ఎల్లయ్యకు ఇంటిపేరు కాదని, కులంపేరు కాదని, ఈ కొత్తపేరు ఎట్లావచ్చిందో చెప్పాలెకదూ! మేము 'వాలి సుగ్రీవులు' నాటుకం ఇదే జంగం పంతులు ఇంట్ల నేరుస్తున్నం. నాకూ ఒక వేషం కావాలని వచ్చిండు ఎల్లయ్య. మా కొండయ మామ సన్నపోడుగాదు. ఎవరితో ఏ పని అయితుందో బాగాతెలుసు. ఒకరకంగా ఎల్లయ్యను మాల్లెంలకు రమ్మని పిలిచింది గూడా మామనె.

"ఎల్లన్నా... నీకుమంచివేశం ఇత్త. రోజూరావాలె. ఏదన్నా పని చెప్పితే చెయ్యాలె". అన్నడు మామ. ఎల్లయ్య నవ్వుతూ తలూపిండు.

ఎల్లయ్య పటేండ్ల శాతల జీతం. చేసినంతపని. మబ్బుతోనే పోవాలె. ఆవుల ఎడ్లపెండ తియ్యాలె, గడ్డివెయ్యాలె. నాట్లప్పుడు నాట్లపని కోతలప్పుడు కోతలపని. పొద్దంతా

ఎక్కడ కూరుపట్లు గుక్కినా, నిద్రమొఖం బెట్టినా తిట్లు తప్పయి. మళ్లీ కూరుకు రాత్రిదాక ఎడ్లకొట్టందగ్గరనే ఉండాలె.

కొత్తమురిపానికి నాలుగురోజులు రియార్సల్‌కు వస్తడులే అనుకున్నరు అందరు. కానీ ఎల్లయ్య ఎప్పుడూ తప్పలేదు. ఎంతపని ఉన్నా రియార్సల్‌కు వచ్చిండు.

ఎల్లయ్య ఎడ్లుగాయబోతే కొండయ మామ తన పోతులను అప్పజేప్పుతుండె. కలుపు నాట్లమీద ఎల్లయ్యను గడ్డికోసుకుని రమ్మంటుండె. చిప్పలకాయలు, కంకులు, తేనె, బబ్బెర, పెసర, ఏసీజన్‌లో వాటిని తెమ్మంటుండే. ఏపని చెప్పినా కాదనకపోతుండే ఎల్లయ్య.

మామను చూసి దాసుచిన్నాయిన గూడా అలువాటయిండు. ఎప్పుడూ ఏదో ఒకటి తెమ్మంటుండె. మా మ్యాల్లంల వాళ్లమాటనే మాట. ఆటలకు రానియ్యరని చెప్పినపని చేస్తుండె ఎల్లయ్య.

'వాలి సుగ్రీవులు' యక్షగానం. పచ్చిబాగోతం. 'తయ్యక తప్పక తకదై' అని ఎగురుదు దుంకుడు. పాటలన్నీ చల్తీమీదనడుస్తయి. స్పీడుగా పాడాలె. ఎల్లయ్యకు ముందుగా పెద్ద ఏశమే ఇచ్చింగ్రు. పాటలు పాడరాలేదు. వచనం చెప్పరాలేదు. తబలా తాళం అందుకుంటలేదు.

చెప్పిచెప్పి పంతులుకు యాష్టకచ్చింది గనీ ఎల్లయ్యకు పాట రాలేదు. పద్యంరాలేదు. ఏశానికి పనికిరావని సూటిగా చెప్పరాదాయే. చెప్పితే అలిగిపోతడేమోనన్న భయం.

ఒకనాడు మా పంతులు "ఎల్లయ్యా! నువ్వు హనుమంతుని ఏశానికి మంచిగుంటవు. ఏశమేత్తే హనుమండ్ల సామి దిగివచ్చినట్టుంటవోయ్" అన్నడు. ఎల్లయ్య నోరు తిరుగుతలేదని ప్లానుప్రకారమే ఆమాటన్నడు మా పంతులు.

అది గ్రహించిన మామ, దాసు చిన్నాయిన 'అరే నిజమే పంతులు..ఎల్లయ్యకు ఆ ఏశం మంచిగ కుదురుతది' అన్నరు. ఆ మాటలు విన్నంక 'నాకు అనుమంతుని ఏశమే ఇయ్యింగ్రి' అన్నడు ఎల్లయ్య.

చివరికి అదే ఏశం కాయమయింది. హనుమంతుని వేశానికి పాటలు లెవ్వు పద్యాలు లెవ్వు. నాలుగంటే నాలుగే ముచ్చట్లు. పాటలు లేకుంటే అలిగిపోతడని పంతులే రెండు రామకీర్తనలు నేర్పిండు.

ఆ నాలుగు మాటలు నేర్వడానికే ఎల్లయ్యకు వారం పట్టింది. నాదేమో అంగదుని పాత్ర. నాకు సుగ్రీవునితో రెండుమాటల వచనమే! అదీ పంతులును బతిలాడితే ఇచ్చిండు.



ఎల్లయ్యను చూసినంక నాకు నేనే రెండు రామకీర్తనలు నేర్చుకున్న.

అది చలికాలం దినం. వానలు తగ్గిపోయినయి. మూలమంచు మొదలై ఎన్నీల గాత్తుంది. పొద్దంతా వరినాట్లు. రాత్రి రియార్సల్. ఒక్కొక్కలకైతే కాళ్లు నడువరాకుండా పెచ్చినయి. దేక్కుంటనైనా రియార్సల్‌కు వత్తురు. ఆ నాలుగు మాటలకు నేను, ఎల్లయ్య రాత్రంతా కూచుందుము.

మాగమాస జాతరనాడు ఖచ్చితంగా నాటకం వెయ్యాలనుకున్నం. ఎందుకంటే మా ఊర్లె జాతర పెద్దగ జరుగుతది. సుట్టు పదూర్ల మంది వస్తరు. చుట్టాలు వస్తరు. గిరాకి ఎక్కువైతది. పొత్తుల పైసలు లెవ్వు గనుక ఎవరి మేకప్ సామను వారే తయారు చేసుకోవాలనుకున్నం. అంత పనిలో గూడా మా మ్యాల్లపోల్లు కత్తులు, గదలు చెక్కుకున్నరు. బాణాలను కట్టుకుని రంగుకాయిదాలు అంటేసుకున్నరు.

ఎల్లయ్యకు పక్కీరు కాశీంకు చాలాదోస్తు. పక్కీరు కాశీం మాటకారి. చిన్నగ సైకిల్ టెక్స్ ఉన్నది. ఎల్లయ్య ఏశానికి కావలసిన అన్ని సామాన్లు...గద, కిరీటం, భుజకీర్తులు చేసి ఇచ్చిండు. ఇస్తూ ఇస్తూ ఒక సలహా కూడా ఇచ్చిండు ఎల్లయ్యకు.

'ఎల్లన్నా. అనుమండ్ల సామిని చూసినవా..మూతిఎర్రగా ఎత్తుగా ఉంటది. ఆటవేసేనా డు నిన్ను అచ్చం సామిలెక్కనే మేకప్ జేస్త. నాటకానికి వచ్చినోళ్ళు సామే దిగి వచ్చిండనుకోవాలె' అన్నడు. నిజమే అనుకుని ఎల్లయ్య తలూపిండు. అన్నట్టుగనే మేకప్ వేయడానికి వచ్చిండు కాశీం.

"ఈ కాశీంగాడు మామూలు మనిషిగాదు. ఎద్దుకు ఎగేత్తడు బర్రెకు దిగేత్తడు.. ఏదో ఒకటి చేత్తడుసూడు. వీన్ని ఎందుకు రానిచ్చింగ్రు" అని దాసు చిన్నాయిన అంటనే ఉన్నడు.

కాశీం సైకిల్ ట్యూబును అతుకువెట్టే సులీషన్‌ను, దూదిని తెచ్చిండు. ఎల్లయ్య మీసం గడ్డం తీసుకుంటనంటే వద్దని చెప్పి మూతిచుట్టూ దూదిని సులీషన్‌తోని అతుకపెట్టిండు. దూదికి ఎర్రటిరంగు పూసిండు. అచ్చం అనుమంతుడి మూతిని చేసిండు.

అదిచూసి వానరులు, వాలి, సుగ్రీవుని వేషం వేసేటోల్లుగూడా అట్లాగే మేకప్ చెయ్యమని బతిలాడింగ్రు. సులీషన్ లేదని చెప్పి ఎవలకూ మేకప్ చెయ్యలేదు కాశీం.

జాతర కాబట్టి జనం బాగానే వచ్చింగ్రు. హనుమంతుని వేశాన్ని అందరూ మెచ్చుకున్నరు. అదిచూసి ఎల్లయ్య అవసరం ఉన్నా లేకున్నా కోతి దుంకుడు దుంకిండు. ఉన్న నాలుగు మాటలు గూడా సరిగ్గా చెప్పలేదు. రామకీర్తన పాట మరిచే పోయిండు.

ఆట పూర్తయింది. అందరం మేకప్‌లు ఇప్పేసుకున్నం. ఎల్లయ్యగూడా మేకప్ ఇప్పేసిండు. మూతిమీది దూదిమాత్రం రావడంలేదు. గట్టిగా మీసాలకు, తోలుకు అంటుకున్నది. నానబెట్టినా రాలేదు. బలంగా గుంజితే మీసాలు ఊడి వస్తున్నయి. ఎల్లయ్య మొత్తుకుంటండు.

మనిషికో దిక్కు గుంజుడు. మూతినొప్పిపెట్టిందిగనీ దూది మాత్రం పూర్తిగా రాలేదు. సోలీషన్‌తో గట్టిగా అతుక్కున్నది. అప్పటికే మేకప్‌లు ఇప్పేయడంతో ఎవలదారిన వాళ్లు ఇంటికి పోయింద్రు. మూతిని దాచుకొని ఎల్లయ్య కూడా ఇంటికి పోయిండు.

ఇంటి దగ్గర తల్లి భార్య ఏడ్సుడే గాదట. రాత్రంతా మూతిమీది దూదిని ఊడపీకాలని, కత్తిరియ్యాలని చూసింద్రట. ఎంతో కొంత వదిలినా ఇంకా దూది అంటుకునే ఉంది. వాళ్లు పీక వీళ్లు పీకా మూతికి నొప్పిపుట్టి నిజంగా కోతిమూతి లెక్క వాచిపోయింది.

తెల్లారే పటేండ్ల పొలంనాటు. ఇంట్లోకూసుంటే నడువది. పనికి రానంటే జీతంలోంచి తీసేస్తనంటడు పటేలు. బాకీకట్టుమంటడు ఎట్ల? ఎల్లయ్య భయం ఎల్లయ్యకుంది. అక్కడికి ఎల్లయ్య తల్లి పటేలుకు చెప్పి బతిలాడిందట. పటేలు ఒప్పుకోలేదట. నాగటికి వచ్చుడు వచ్చుడే అన్నడట.

మూతికి అడ్డబట్టకట్టుకుని నాగటికి పోయిండు ఎల్లయ్య. అది చూసి అందరు నవ్వుడే. అట్లో ఇట్లో పొద్దుగూకే వరకు దూది మొత్తం పీక్కున్నడు గనీ మంటలు పోట్లతో జరం అందుకుంది. మూతిమొత్తం పుండయి ఎర్రగా ఉబ్బిపైకిలేచింది. రక్తాలు కారుతున్నయి. నాలుగు రోజులు మంచంలోంచి లెవ్వలేదు ఎల్లయ్య.

ఎల్లయ్య మూతిని చూసేందుకు జనం దారలు కట్టింద్రు. పోరగాండ్లయితే ఇంటిసుట్టే మూగింద్రు. ఈ నాలుగు రోజులు పక్కీరు కాశీం ఊర్లె కనిపించలేదు. మిగిలిన వాళ్లకు ఎందుకు మేకప్ చెయ్యలేదో అప్పుడు అర్థమైంది మాకు. అట్లా చేయకపోవుడే నయమైందనుకున్నం.

ఎల్లయ్య వాళ్ల అవ్వ మామూలు మనిషిగాదు. మామాల్లైంను, పక్కీరు కాశీంను కడిగిపోసింది. కాశీం వాళ్ల అవ్వగూడా తక్కువేంగాదు మాటకు మాటన్నది. తిట్టుకుతిట్టు తిట్టింది. ఇద్దరూ కచీరుకాడ శికెలు శికెలు పట్టుకుని కొట్టుకున్నరు.

నాలుగురోజుల తర్వాత ఎల్లయ్య మూతి కొద్దికొద్దిగా తగ్గిందిగనీ పేరు మాత్రం అట్లనే ఉండిపోయింది. ఈ దెబ్బతో ఎల్లయ్య మా మాల్లెం దిక్కురాడనుకున్న. కానీ ఇంకో ఆటవరకు రానేవచ్చిండు. కాశీంతో మాట్లాడదనుకున్న. మళ్లీ పాణాపాణం దోస్తయింద్రు.



# రియార్సల్ మా ఇంట్లకచ్చింది

హరిశ్చంద్ర నాటుకం ఆడాలని మా పంతులు చెప్పినప్పటి నుండి నా మనసు లోహితుని పాత్రమీద వడ్డది. ఎట్లయినా ఆ పాత్రను దక్కించుకోవాలనుకున్న. ఈమధ్య ఇద్దరు ముగ్గురు చదువుకున్నోళ్లు రావడం, పాటలు అభ్యాసం కావడంతో నా అవసరం చాలా తగ్గింది. పుస్తకం నాచేతికి అందనిస్తలేరు. నేను కావాలని తీసుకుంటే కసురుకుంటున్నరు. మా కొండయ్య మామ గాలివాటం మనిషి. ఇప్పుడు నేను వచ్చినా రాకున్నా ఒక్కటేనని తెలుసు. ఎప్పుడో ఒకప్పుడు నన్ను రావద్దని బెదిరిచ్చెతట్టున్నడు.

అందుకని నేను రూటుమార్చిన. మా పంతులుకు చాలా దగ్గరైపోయిన. అందరికంటే ముందే రా వడం, చాపలు పరువడం బిందెలల్ల మంచినీళ్లు పెట్టడం ఇంకా చిన్న చిన్న పనులు చేత్తున్న. పంతులు ఏదైనా పని చెపితే క్షణాలమీద చేత్తున్న. జంగమమ్మకు పూలు తెచ్చి ఇత్తున్న. నీళ్లు మోత్తున్న. మా ఇంట్లోంచి కాయనో పండో కూరగాయలో తీసుకపోయి ఇత్తున్న.

మా మాల్లెంలో లోహితుని పాత్రకొరకు నాకు పోటీగా ఇద్దరున్నరు. ఒకడు గడ్డమీది బాల్‌రాజు. వీళ్ల అన్న గడ్డమీది రాములు మా మాల్లెంలో మేటివేశకాడు. అంతకుముందు బాల్‌రాజు రియార్సల్‌కు వచ్చేటోడుగాదు. ఈ మధ్య వస్తున్నడు. వచ్చినోడు వట్టిగనే కూసుంటడా..? ఏశంగావాలంటున్నడు.

ఇంకొకడు ఆకుల తిరుపతి. వాడు నాతోనే చదువు కుంటుండు. వానికి మా మాల్లేనికి ఏ సంబందం లేదు. కాకపోతే వానికి డ్యాన్స్‌వచ్చు. 'సరిలేరు నీకెవ్వరు'. 'ఇదిగో నేనున్నాను అదిగోనువ్వున్నావు', 'రారా నాసామిరంగ', 'చంగు చంగురే బంగారు రాజా'... ఇసొంటి పాటలమీద డ్యాన్స్ చేస్తడు.

మధ్యమధ్యలో మేకప్ పూర్తిగానప్పుడు ఒక డ్యాన్స్ పాటవేస్తే ఎట్లుంటదని మా జంగం పంతులు బొంబు పేల్చిండు. అప్పుడే ఆకుల తిరుపతి నాకు పోటీగా మారిండు. మా పంతులు ముందే పాటవాడి డ్యాన్స్‌చేసి చూపిండు. అందరూ మెచ్చుకున్నరు. 'వారీ నువ్వు మా నాటుకంల ఉండాలెరా' అన్నరు. మా కొండయమామ గూడా అదేమాట అన్నడు. వాడు తలుకాయ ఊపుతూ రాజుకొడుకు ఏశం కావాలన్నడు. వాడు అడుగంగనే లోహితుని పాత్రను ఇచ్చేసింండ్రు. అట్లా ఆ పాత్ర నాకు కాకుండా పోయింది.

వాళ్లదృష్టిలో నేను మ్యాల్లంల మనిషినేగాదు. 'పోరడు వాళ్ల మామ సోపతికి వస్తండు' అనుకుంటండ్రు. ఒక్కలకు గూడా పోరనికి మంచి వేశం ఇయ్యాలన్న ద్యాసలేదు. బీడీలకో, అగ్గిపెట్టెకో, మంచినీళ్లకో అయితే నన్ను పిలుస్తరు. ఎవలన్నా వేశకాళ్లు రాకుంటే తీసుకరమ్మని తోలిస్తరు. ఇంతెందుకు? మా మామ గూడా అంతే! ఏ చిన్నపనికైనా నన్నే తోలిస్తడు. పనివినకపోతే మాత్రం 'ఇంటికాడ ఉండి సదువుకోక ఎందుకత్తున్నవు'. మీ బాపుకు చెప్పుత ఉండు' అని బెదిరిత్తడు. ఒక మంచి వేశం ఇయ్యిమంటే మాత్రం ఇయ్యడు.

నాకు ఇష్టమైన వేశం నాకండ్లముందే తిరుపతికి పోయింది. అందరూ పాత్రలు పంచుకున్నరు. నాకు, బాల్‌రాజు గానికి లోహితుని దోస్తులవేశం ఇచ్చింండ్రు. పాటలేదు, పద్యంలేదు. పేరులేదు. లోహితుడు అడవికి ఆకులకు వెళ్తుంటే వెంట మేము వెళ్లాలె. అది పుస్తకంల లేనేలేదు. చేతికింద పోరగాండ్లు ఉంటే చెప్పినపని వింటరని మా ఇద్దరిని తీసుకున్నరు. నేను పంతులుకు మ్యాల్లానికి చేసిన సేవ వట్టిదైపోయింది.

పారట్లు (పాత్రలు) రాయించిండ్రు. ఎవరిపారట్లు వాళ్లు తీసుకున్నరు. నా మాటలు సగం కమ్మగూడా నిండలేదు. రెండుసార్లు చదువంగనే వచ్చినయి.

అది ఎండాకాలం దినం. కోతలు మోతలు అన్నీ అయినయి. పనేంలేదు.



ఆయిటిమూనే లోపు ఆటవెయ్యాలని అందరిప్లాను. ఆయిటి మూనితే పనులమీద వడి ఒకలకొకలు దొరుకరు.

ఈసారి లెక్కలు చూసుకున్నరు. ఇంకా వందరూపాయలు మామకే ఇచ్చేది తేలింండ్రు. మాల్లెంలకు ఎప్పుడూ ఒకలిద్దరు కొత్తవాళ్లు వస్తనే ఉన్నరు. పాతవాళ్లు వెళ్లిపోతనే ఉన్నరు. నిలకడలేకుండా ఉంది. మనిషికి ఐదురూపాయలు వేసి మామ బాకి సగం ఇచ్చేయ్యాలని ఇంకో సగం ఆట ఆడితీరాలని, పంతులుకు పైసలివ్వకుండా మనిషికి తవ్వెడు బియ్యం ఇయ్యాలని నిర్ణయించుకున్నరు.

అందరికో ఆలోచనుంటే నా ఆలోచన నాకుంది. నా ప్రయత్నాలు నేను చేత్తనే ఉన్న. పాత్ర మాత్రం నా చేతికి వత్తలేదు. తిరుపతికి ఎప్పుడో వంక తీత్తున్న. నీకు సదువనేరాదని తప్పులు తీత్తున్న. వాని పాటలను అట్లగాదు ఇట్లని సదివి చూపిత్తన్న. అయినా నా వేశం మారలేదు.

రియార్సల్ మొదలయింది. మా రియార్సల్ ఎట్ల నడుత్తందంటే మొదట వారం రోజులు ఎవరిపాత్ర వాళ్లు కూచుండే సదువాలె. వారం తరువాత పారటును చూసుకుంట నిలవడి చదువాలె. మూడవ వారంల నోటికి యాక్షన్ చేస్తూ పాడాలె. నాలుగవ వారంల ప్రాక్టీసు. ఆ తర్వాత ఆట.

మొదటివారంలో ఒకనాడు సగం ఇంకోనాడు సగం చొప్పున ఆటపూర్తి కావడానికి రెండురోజులు పడుతుంది. రెండవ వారం ఏరోజుకు ఆరోజు ఆటను పూర్తి చెయ్యాలె. పంతులుకు ఈ రెండు వారాలే పని. పాటలు ఎట్లా పాడాలో వచనం ఎట్లా చెప్పాలో పద్యాలు ఎట్లా రాగం తియ్యాలో యాక్షన్ ఎట్లా చెయ్యాలో చూపిస్తడు. తర్వాత ఎవరికి వారు నోటికి పాడటమే!

మా రియార్సల్ రెండు వారాలకు వచ్చింది. పనేంలేదు గదా! పొద్దుమాపు యాదిజేసుడేనాయె. అప్పటికే అందరికీ పాటలు నోటికచ్చినయి. నా మనసు కుతకుత ఉడుకుతనే ఉంది. ఆశ ఇంకా చావలేదు. కోపం వచ్చి రెండుమూడురోజులు రియార్సల్ మానేసిన.

నన్ను అడిగినోళ్లులేరు. ఎందుకురావడం లేదని తెలుసుకున్నోళ్లు లేరు. కనీసం కొండయమామ, దాసు చిన్నాయిన గూడా పలుకరియ్యలేదు. పంతులు గూడా వస్తలేదని ఎవ్వలను తోలలేదు. పంతులమ్మ మాత్రం ఇంట్ల కట్టెలు లేకుంటే నన్ను రెండుసార్లు యాదిజేసిందట. ఆ విషయం తిరుపతి గాడే చెప్పిండు.

నాకు కోపం వచ్చింది. మా ఇంట్ల తెల్ల తీటేర్ల పొడివుంది. ఎప్పుడన్నా బైలుసాపు

లేకుంటే మా అమ్మ తినిపిస్తది. పొట్లంగట్టి జేబులో వేసుకుని మూడవనాడు కోపంగా రియార్సల్‌కు పోయిన.

ఎండాకాలం దినంగదా! చుట్టుపక్కల ఇండ్లవాళ్లంతా రియార్సల్ చూడడానికి వత్తురు. ఆటపూర్తయ్యే దాక లెవ్వకపోదురు. మేం తెచ్చిన నీళ్లే తాగుదురు. వేశం లేదుగనీ నీళ్లమోత మనదే గదా. మొదట నేనే ఈ పనిని చెప్పకపోయినా చేసిన. అది నాకు పర్మినెంటు అయిపోయింది. వాకిట్లనే బాయి. బాయిలోంచి బిందెతో నీళ్లు తేవాలె.

నేను పొట్లంలోని పొడిని నీళ్లల్ల కలుపుకుని తాగిన. తాగినంక వెనుక వరుసల కూసున్న. ఆ పొడి సంగతి నాకు బాగా తెలుసు. ఎప్పుడన్న నాలుకకు రాసుకుంటేనే కడుపుల గడగడ మొదలైతది.

అనుకున్నట్టు అరగంట కాంగనే కడుపుల గుడగుడ మొదలైంది. వట్టిగపోతే ఎక్కడికి పోయినవంటరు. ఇప్పుడు కాకపోయినా తెల్లారైనా బయటవడుతది. అందుకని బిందెవట్టుకుని నీళ్లు తెస్తనని బయటకు పోయిన.

బయట అమాసచీకటి. అడుగుముందు ఏముందో కనిపించదు. బిందెను బాయి దగ్గర పెట్టిన. ఎదురుగా ఉన్న కోమట్ల ఇంటికడుప దగ్గరకిపోయి లాగు ఇడిసి కూసున్న. అప్పటికే రాత్రయింది గదా. అందరూ నిదురవోతున్నరు. ఆ కోమట్లకు మా పంతులోళ్లకు అగ్గిపగ. ఎవలకూ అనుమానం రాకుండా అట్ల ఆరాత్రి నాలుగు బిందెల నీళ్లు మోసిన.

తెల్లారి కోమట్లకు పంతులోల్లకు పెద్దపంచాది. బాగోతపు మాల్లెంబెట్టి పంతులు వాకిళ్లు పాడు జేత్తండని పిరాదయింద్రు. పెద్దలొల్లి పుట్టింది. కోమట్లమ్మ జంగమమ్మ కొట్లాట పెట్టుకున్నరు. కోమట్లమ్మ జంగమమ్మను కొట్టింది. తిట్టరాని తిట్లు తిట్టింది. ఈరోజు వాళ్లకయింది. రేపు మాకైతదని వాడకట్టుమొత్తం ఒక్కటయింది.

రియార్సల్ పెట్టనే వద్దని పెడితే మర్యాద దక్కదని చెప్పింద్రు. పంతులమ్మ ఏడ్సుడేగాదు. పొద్దున కత ఎట్ల జరుగుతదోనని నేను బడికిపోక పంతులు ఇంట్లనే ఉన్న. పంతులమ్మ మన ఇంట్ల రియార్సల్ వద్దని పంతులుకు వార్నింగ్ ఇచ్చేసింది.

అంతటితో రియార్సలు ఆగిపోతదనుకున్న. మా కొండయ మామ విడిచిపెడుతడా! "సగం నేర్చి ఎట్లా వదిలేద్దాం. మా అక్కోల్ల ఇంట్ల మస్తు జాగుంది పోదాం" అని మ్యాల్లం మొత్తంను మా ఇంటికి తెచ్చిండు. మాది రెండు సంకలపెద్దిల్లు. వందమంది బంతి కూసోవచ్చు. ఇంటిముందు వెనుకా మస్తు జాగుంది.

ఇకనేను ఊరుకుంటనా నాకు ఏశంగావాలని మా అమ్మతోని చెప్పిన. 'ఒరేకొండా..వీనికి రాజుకొడుకు ఏశమట ఇయ్యి' అని చెప్పింది అమ్మ. కొండయ మామకు



నాలిక సందుల ముల్లు ఇరిగినట్టయింది. నన్ను బుదురకియ్యాలని చూసిండు. నేను వినలేదు. ఇంక ఇయ్యక సత్తడా మామ.

అట్లా పారటు నాచేతికి వచ్చింది. ఆకుల తిరుపతి అలిగిపోయిండు. రియార్సల్‌కు రాలేదు. ఇదేం పద్ధతి అని మామను అడిగే దమ్ము ఎవ్వలకు లేదు. రాకపోతే రాకపోనీ అన్నరు అందరు.

నేను వానికంటే పాటలు మంచిగ చదివిన. రెండు వచనాలు ఎక్కువనే చెప్పిన. నేను చేసిన పని ఇంతదూరం తెత్తదని అనుకోలేదు. ఏదో కోపంతో అట్లా చేసినగనీ ఇట్లా జరుగుతుందనుకుంటే ఈ పని ఎప్పుడో చేద్దును.

ఇక జంగం పంతులు ఇంటికి మా ఇంటికి మస్తు దూరం. మ్యాల్లం మాఇంటికి వచ్చినంక 'నాకు చాతగాదు అంతదూరం రాను'. అన్నడు పంతులు. అప్పటికే పాటల తీరు మాకు నోటికి వచ్చింది కాబట్టి కష్టమేమీ కాలేదు. బుక్కు చేతవట్టుకుని అందరికీ నేనే పాటలు అందిచ్చిన. అనుకున్న రోజునే ఆట వేసినం ఈసారి టికెట్టు పెట్టి గడీల ఏద్దామనుకున్నంగానీ మామనే వద్దన్నడు.

గరిశెలగడ్డకువేస్తే ఊరంతా చూస్తరని అక్కడవేసినం. రెండే రెండు పెట్రమాక్సులైట్లు. అందరూ మెచ్చుకున్నరు. చంద్రమతి పాత్ర వేసిన గడ్డమీది రాములు జనాలకు కంటతడిపెట్టిచ్చిండు. కొండయమామ విశ్వామిత్రుని వేషం వేసి స్టేజి మొత్తం గడగడ వణికిచ్చిండు. దాసు చిన్నాయిన హరిశ్చంద్ర మారాజు ఏశమేసి ఒకదమ్ము ఏడిపిచ్చిండు.

మా కోతిమూతి ఎల్లయ్య తెలుసుగదా! ఇందులో నక్షత్రకుని ఏశం. రెండే రెండు మాటలు. "అరిశ్చంద్రా...ఆకలి, దూప...రూపాయలు" అని రాజు వెంటతిరుగాలె. ఈ మాటలు అన్నప్పుడల్లా జనం ఇరుగవడినవ్వింద్రు. ఇంత దాక బాగనే ఉంది.

మా ఎల్లయ్య సంగతి తెలుసుగదా ఎడ్డిమూర్కుడని. తన డైలాగులకు జనమంతా నవ్వింద్రని కండ్లు నెత్తికెక్కినయి. తెల్లారో మరునాడో జీతమున్న దొర కోడలు ముందు ఆ రెండు మాటలు మర్చిపోయి 'దూప... దూప...' అన్నడట నవ్వియ్యాలని.

'నీ తలపండు వలుగ ఎవర్రాదూప' అని కోడలు దొర్సాని పొయిల కొర్రాయితోని కొంకుల మీద పెట్టిందట.

# మాయ పాము

జంగం పంతులు మాకు నేర్పిన ఆఖరు ఆట హరిశ్చంద్రనే! ఈ ఆటతో మేము నాలుగు ఆటలు నేర్చినట్టయింది. కానీ ఒక ఆటల ఉన్నవాళ్లు ఇంకో ఆటలలేరు. ఈ నాలుగు ఆటల్లో ఎక్కువ రమ్యంగా కమ్మిన ఆటంటే హరిశ్చంద్రనే!

అంతకుముందు జంగం పంతులు ఎవరికీ అంతగా తెలువది. మాకు ఆటలు నేర్పిననుండి ఊరిలో ముఖ్యమైన వ్యక్తి అయిండు. పంతులుకు కట్టెలు పిడుకలు ఇల్లు నిండినయి. ఎప్పుడూ చేతిల పదిమంది. ఏపని చెప్పినా క్షణాలమీద చేద్దుము. ఆవునూర్ల పంతులు మనుమరాలు పెండ్లయితే మ్యాల్లం మొత్తంవోయి నిలబడ్డం. కట్టెలు, బియ్యం, తీసుకపోయినం. నాలుగు సంచుల కాయగూరలు తీసుకపోయినం. పందిర్లువేసినం. వంటలు చేసినం. ఇస్తార్లు ఎత్తిపోసినం.

ఇట్లా మూటిమీదున్న మ్యాల్లెం చేతులనుంచి జారిపోయే సరికి మాకంటే ఎక్కువ మా పంతులుకే ఆరాటం మొదలయింది. మల్లా రియార్సల్ మొదలుపెట్టి నాటుకాలు నేర్పిద్దామని పంతులు పంతులమ్మతో అన్నడట. పంతులమ్మ వద్దే వద్దన్నదట. మ్యాల్లం మూటిమీద ఉండాలంటే ఏదో ఒకటి చెయ్యాలిగదా!

'హరిశ్చంద్ర మళ్లా వేద్దాం. ఈసారి కొన్ని కొత్త టెక్నిక్‌లు జేద్దాం" అన్నడు పంతులు. ఆయిటి మూనితే పనులమీదపడి ఎవరూదొరుకరని తెలుసు. అప్పటికే కాలం నెత్తిమీదికచ్చింది.

ఆ నాటుకం ఆడి రెండువారాలన్న దాటలేదు. జనం మళ్లీ చూస్తరా అన్నభయం మొదలయింది మాకు. అదే విషయం పంతులును అడిగితే 'ఎందుకు చూడరు. ఈసారి స్టేజీమీద కరెంటు బుగ్గలు పెడుదాం. మైకుపెడుదాం. పల్లీలహార్మాని తెద్దాం. పాటలు నాటకం స్టైల్లో పాడుదాం. గడీల స్టేజివేద్దాం. రూపాయి టికెట్ పెడుదాం' అన్నడు.

వేసిన నాటుకాన్నే వెయ్యడం అదీ టికెట్టు పెట్టి ఆడడం అందరికీ ఇష్టంలేకపోయినా కొండయమామకు మాత్రం సంతోషంగా ఉంది. "పంతులు చెప్పినప్పుడు తప్పకుండా వెయ్యాలె ఎండకాలమేనాయె. ఏంపనుంది..? ఇంక నాలుగురోజులైతే మనిషికి మనిషి దొరుకడు". అని అందరికి ఆడర్ పాస్ జేసిండు.



అంతే! ఎక్కడోల్లు అక్కడ నోరుమూసింద్రు. అట్లే ఏ రోజున ఆడాలెనో కూడా నిర్ణయం జేసింద్రు. ఎవరికి వాళ్లు సామాన్లు సదురుకోవడంలో మునిగిపోయినం.

మాకు బట్టలకేం కొదువలేదు. ఎవలను అడిగినా కాదనరు. నాలుగు మంచి చీరెలు చూపించి ఇష్టమున్న చీర మమ్ములనే ఏరుకొమ్మంటరు. ఎటచ్చీ ఆడివేశకాళ్ళకు జాకిట్లకే ఇబ్బంది. అందుకని వాటిని ఎవరికి వాళ్లే కుట్టించుకుంటరు.

నెత్తికి సౌరాలు, కాటుక, బొట్టు, ఇట్లా వీలైనంత సామాను ఊరిమీదనే అడుక్కస్తం. మాకు జడవిగ్గులు, కొప్పువిగ్గులు ఎక్కువలేవు. కొందరు జుట్టును పెంచుకున్నరు. రెండుమూడు పెద్దకిరీటాలు పంతులే తయారు చేసిండు. వాటినే అందరం పెట్టుకుంటం.

అనుకున్నట్టే గడీలస్టేజి వేసినం. పంతులు చెప్పిన టెక్నిక్‌లు ఏవీ సాధ్యం గాలేదు గానీ కరెంటు మాత్రం పెట్టుకున్నం. ఊర్లెనే ఉన్న హెల్పర్ బాల్‌రాజు సాయం జేసిండు. స్టేజీని బలే తమాషాగా వేసిండు మా పంతులు. నాలుగు గుంజలు పాతిండు. ఎనుక రెండు గుంజలకు మేన్‌పరుదా గట్టిండు. ఈ మేన్ పరుదా గూడ మొన్నటిదాక లేదు. రెండు పూల పూల దుప్పట్లను కలిపి కదుదుంటిమి. మొన్నమొన్ననే పది గజాల సైనుబట్ట తెల్లది కొన్నం. ముందటి రెండు గుంజలకు వైరుగట్టిండు. వైరుకు రెండు పూల పూల చెద్దర్లతో సూపు పరుదా కట్టిండు. వాటికి తాడుగట్టిండు.

ఎనకనుండి తాడును లాగితే చెద్దర్లు రెండూ అటొకటి, ఇటొకటి పక్కకు జరుగుతున్నయి. ఇంకోతాడు లాగితే చెద్దర్లు రెండూ మూసుకుంటున్నయి. ఎప్పుడు పరుదా వెయ్యాలో ఎప్పుడు తియ్యాలో తానే చూసుకుంటానన్నడు పంతులు. ఎవరిదగ్గరనో నాలుగు తెల్లదుప్పట్లు అడుక్కచ్చి సైడు పరుదాలు గట్టిండు.

కాలకర్మానికి ఆరోజే సాయంత్రం మా పంతులు ఇంటి వెనుక బెస్తలచ్చవ్వ ఇంట్ల పామును సంపింద్రట. పామంటే పాముగాదు. శాతాదు పొడువుంది. ముసలి నాగుంబాము. గోదుమరంగులో మెరుత్తుంది. రాగిపైస నోట్లోబెట్టి కాలవెడతానంటే వద్దని చెప్పి పామును తీసుకున్నడట మా పంతులు. దానిని గంపలో ఎత్తుకుని స్టేజి వద్దకు తెచ్చిండు. మా దాసుచిన్నాయినకు చెప్పి పెద్దది మోతుకు చెట్టు కొమ్మను తెప్పించిండు. ఏంచేస్తడో చెప్పలేదుగనీ మేమే తెలుసుకున్నం.

ఎండాకాలం దినంగదా! చూసిన ఆటనే అయినా జనం ఎక్కువనే వచ్చింద్రు. మేము ఫ్రీగా ఆడితే బజార్లో, టికెట్లు పెడితే గడీలో వేస్తం. ఈ ఆట గడీల వేసినం. ఈసారి లైట్లు వేసినం కాబట్టి స్టేజి ఎలిగిపోతుంది. తెల్లటి పరుదాలు ఇంకింత తెల్లగ కనవడుతున్నయి. ఏశకాళ్లు ఎలుతురులో మెరిసిపోతున్నరు.

వేశ వేశానికి పరదా వెయ్యడం, తియ్యడం జనాలకొక వింతయింది. ఎట్ల మూసుకుంటందో, ఎట్లా తెరుసుకుంటందో ఎవలకు అర్థం గాలేదు. పంతులు గూడా ఎవలకూ కనిపించకుండా ఆపని చేస్తుండు.

తెలుసుగదా నాది లోహితుని ఏశమని. నావేశం రానేవచ్చింది. అంతదాకా ఆట రమ్యంగా కమ్మింది. హరిశ్చంద్ర మారాజు కట్టాలు జూసి జనం ఏడుత్తండ్రు. నక్షత్రకుని మాటలతో నవ్వుతండ్రు. విశ్వామిత్రుని మీదికి కోపానికత్తండ్రు. లోహితున్ని బాపనమ్మ ఆకులకు అడవికి తోలిత్తుంటే కలకలాంటండ్రు. బాపనమ్మను తిడుతండ్రు.

నేను అడవికిపోతున్న. పాటను అందుకున్న. పరదా మూసుకుంది. పంతులు మోతుకుకొమ్మను స్టేజిమీద పాతి కొమ్మమీద పామును ఉంచిండు. పరదా తెరుచుకుంది. జనం విచిత్రంగా చూస్తున్నరు. లైటు వెలుతురులో పాము మెరుత్తంది. నిజంగనే పాణమున్న పాము చెట్టుమీద ఉన్నట్టుంది.

“లోహితా పాము...పాము...” “నావెంటనున్న దోస్తులు చెప్పింద్రు. పామును చూపిస్తూ.

అది మాయపాము. నాకు కనవడది. పిల్లలకే కనవడుతది. ఏది ఏదని నేను అడిగిన. వాళ్లు ‘అగో అదేంది చెట్టుమీద’ అన్నరు.

“పాములేదు ఏంలేదు. నేను ఆకులు తెంపద్దని చెప్పుతండ్రు. ఆకులు తేకుంటే బాపనమ్మ కొడుతది” అంటూ చెట్టుదగ్గరికి పోయిన. చెట్టు చుట్టూ రెండు చుట్లు తిరిగిన. పాటను అందుకున్న.

స్టేజి ముందు వరుసలనే కూసున్నడు గొల్లబీరయ్య తాత. అంతదాక పండుకున్నట్టున్నడు. అప్పుడే లేచిండు. లేత్తలేత్తనే కట్టెను అందుకున్నడు. నేను ఆయినను సూత్తనే ఉన్న. రెండడుగులు ముందుకేసి స్టేజిమీదికచ్చిండు.

“ఓ...పోడా...కండ్లు దొబ్బినాయిరా...నీయక్క...ఇదేందిరా పాము. పాంలేదు ఏంలేదంటవు. సత్తావురా” అంటూ చేతికట్టెతో పామును ఎత్తి ఇసిరికొట్టిండు.

ఆ పాము సక్కగపోయి నట్టనడుమల కూసున్న బెస్త లచ్చవ్వ మీదనే పడ్డది. బెస్తలచ్చవ్వ అబ్బమనిషి. ముగ్గురి దొడ్డుంటది. వట్టి పిరికిది. ఎప్పుడూ పైసలు పెట్టి ఆటను చూడనే చూడది. సచ్చిపోయిన పాము ఇచ్చినందుకు ఉత్తగనే రమ్మన్నడట మా పంతులు. ఎప్పుడైతే పాముమీద వడ్డదో అప్పుడే కెవ్వున కేకవెట్టి ఇరుసుకపడ్డది. క్యాల్లిదప్పింది. జనంలో కీకెలు బొబ్బలు.



ఆట ఆగిపోయింది. మంది మొత్తం లచ్చవ్వ చుట్టూ చుట్టుకున్నరు. మా పంతులుకు భయం పట్టుకుంది. ఆగమాగాన గోసి సదురుకుంట లచ్చవ్వ దగ్గరికిపోయిండు. ‘లచ్చవ్వా....ఇది పాణమున్న పాము గాదు. మీ ఇంట్ల సంపినపాము. నిన్ను ముట్టలేదు, కుట్టలేదు” అని చెవిదగ్గర అరిచిండు. ఎంతమొత్తుకున్నా లచ్చవ్వ కుయ్యిలేదు కయ్యిలేదు. కండ్లు తెరువలేదు. మాటలేదు, ముచ్చటలేదు.

పామును చూసైనా లేత్తదని పాము కొరకు వెదికిండు పంతులు. ఎవరు ఎటు విసిరికొట్టింద్రోగని పాము మాయమైపోయింది. ఎప్పుడైతే పాము కనవడలేదో అప్పుడే “అది మాయ పాము. సచ్చినంక గూడా లచ్చవ్వ దగ్గరికే వచ్చిందంటే కచ్చితంగా పగబట్టి కరిచిందన్నట్టె. కరిచినంక మాయమైంది. మాయ పాములు ఇట్లనే జేస్తయి” ఎవరో అన్నరు. మరుక్షణం భయంతో అందరు మాయ మయింద్రు. మేము, క్యాల్లిదప్పిన లచ్చవ్వ మాత్రమే మిగిలినం.

కేసు మా పంతులు మెడకు చుట్టుకుంది. లచ్చవ్వకు ఒక్కతేబిడ్డ. లగ్గమైన యాడాదికే ముండ మోసి ఇల్లు చేరింది. ఎవరు నిద్రలేపి చెప్పింద్రోగని “అవ్వ నిన్ను జంగమోడు మింగెనే అవ్వా.. అవ్వ నీమీదికి మాయపామును పంపెనే అవ్వా. అవ్వవానిల్లు సత్తెనాశినంగానే అవ్వ. అవ్వమనకు దిక్కెవలున్నరే అవ్వ”. అని ఏడ్సుకుంట వచ్చింది లచ్చవ్వ బిడ్డ.

అవ్వ బిడ్డలిద్దరూ నోటి దురుసు మనుషులు. వాళ్లనోటికి భయపడనివాళ్లు ఎవలూ లేరు ఊర్లె. నోరు తెరిచింద్రంటే ఊరు ఊరంతా ఒక్కటిజేస్తరు.

పాముమంత్రం ఏపియ్యాలని ఎవరో అన్నరు. మా పంతులు మంత్రగాడి దగ్గరికి పోయిండు. ఆ మంత్రగానికి లచ్చవ్వకు అగ్గిపగ. వాడు రానేరానన్నడు. కాళ్లవేళ్ల బతిలాడితే ఇంటికి తీసుకరమ్మన్నడు. లచ్చవ్వ ఒకరిద్దరికి లేచేమనిషిగాదు. రాత్రికిరాత్రే ఎడ్లబండి కట్టి బండిమీద మంత్రకాని ఇంటికి తీసుకపోయినం. వాడు ఏం మంత్రమేసిండోగని పాత చెప్పుతో మాత్రం కట్టకట్ట కొట్టిండు. తుప్పతుప్ప మీద ఊంచిండు. యాపాకు దంచి రసం నోట్లెపోసిండు. కంటికి ఉల్లిపాయరసం పూసిండు.

మా నాటుకం ఎటుపోయిందో..ఏశాలమీదనే తెల్లారేదాక లచ్చవ్వ దగ్గర కూసున్నం. తెల్లారినంక కండ్లుతెరిచింది లచ్చవ్వ. అవ్వ బిడ్డలిద్దరూ పొంటెజాము ఒగలమీద ఒగలువడి ఏడ్సింద్రు. మంత్రగాడు వాళ్లను ఉరిమి చూసి “ఏడ్చినకాడికి సాలు, ఇంటికిపోతరా లేదా” అన్నడు.

అవ్వబిడ్డలిద్దరూ సరిగ్గా వారంరోజులు మా పంతులును తిట్టరాని తిట్లు తిట్టింద్రు. ఆ తిట్లు వినలేకనే వారం పది రోజులు బిడ్డదగ్గరికి పోయింద్రు పంతులు పంతులమ్మ.

# ఆటమంచిదే మోతకోర్వాలె

మా మాల్లెం మల్లా ఇచ్చుకపోయేటట్టుంది. జంగం పంతులు ఊర్లెలేడు. వచ్చినా నాటుకం పేరెత్తడు. ఇప్పటికే రెండు దెబ్బలుతాకినయి. తబులాలు తాళాలు, మేకప్ సామాన్లు, పరుదాలు, షాందిరి, బొంగుకట్టెలు అన్నీ మా ఇంట్ల దులాలమీద ఎక్కిచ్చినం.

మూటీ ఇచ్చుకపోతే మల్లా కుదరదని కొండయ మామ భయం. అందుకని ఎవరినీ జారిపోనిత్తలేడు. ఒకసారి లెక్కలని, మరోసారి ఇంకా ఏదోనని అందరినీ జమచేస్తండు. మా ఇంట్లనే మీటింగ్ పెడుతుండు. ఎవరు చచ్చిపోయినా, పెద్దకర్మలయినా పుణ్యముంటదని బజన చేయిస్తండు. ఒకవైపు మ్యాల్లాన్ని మూటీగా ఉంచుతూనే మరోవైపు పంతులు కొరకు దేవులాడుతుండు.

నాటకంలో అందరు ఒకెత్తయితే తబలాకాడు ఒక్కడు ఒకెత్తు. తనపాత్ర వచ్చినప్పుడు నటించాలె. అయిపోంగనే తబలాపట్టాలె. పల్లెం ఎత్తుకోవాలె. పల్లెం అంటే కోరస్. నాటకాల్లో ప్రతీపాటకు, పాటలోని ప్రతీ చరణానికి కోరస్ ఇయ్యాలె. ఇంకా తబలాకాడు ఏ పాటకు ఏ రకంగా తబలాకొట్టాలో నిర్ణయించుకోవాలె. ఏ తాళం మీద ఎట్లా ఎత్తుకోవాలే...ఆట తాళం మీద, జులువతాళం మీద, ఆదితాళం మీద, రూపకంమీద, ఏకతాళం మీద, దర్వుమీద ఎట్లా తబలా దించాలో తెలుసుండాలె.

అన్నింటికి మించి ప్రార్థన మొదలుకొని మంగళారతి పాటదాకా రెండుచేతులు ఆడాలె. పొద్దంతా పనిచేసిరావడం ఒకెత్తు అయితే రాత్రంతా తబలాకొట్టడం మరో ఎత్తు. ఐదు నిమిషాలు బయటకు పోదామన్నా పోరాదు. అందుకే తబలాకాడికి నవనాడులు పనిచెయ్యాలంటడు కొండయమామ. ఒక్కరాత్రి తబలా కొట్టుడు కంటే ఎకరం పొలం ఒడ్లు పెట్టుడు, దున్నిరొప్పుడు నయమంటడు మామ.

మా మ్యాల్లెంల తబలాకాడంటే కొండయమామనే! దుమ్ములేపుతడు. మామ పాత్రవచ్చినప్పుడు మాత్రం కుమ్మరి నర్సింలు కొడుతడు. నర్సింలుకు ఇంకా చెయ్యితిరుగలేదు. వేళ్లతో ఆడియ్యడు. అరిచేతులతో దప్పదప్పకొడుతడు. 'బబ్బన్నక పప్పన్నక'...శబ్దంమీదనే పాటకు కలుపుతడు.



నర్సింలు తబలాపట్టినప్పుడు పాట తాళం రెండే కలుస్తయి. తబలా వాటిని కలుపుకొనిపోతది. మామ తబలాపడితే పాట తాళం రెండూ తబలావెంట పరుగెత్తాలె. వాళ్ళిద్దరి పాత్రలు ఒకటే సారి రాకుండా చూసుకుంటరు. ఇక తాళాలంటరా! సగం మందికి కొట్టచ్చు. రెండు తాళంజోల్లు అందరిదగ్గరా తిరుగుతయి.

మామ నర్సింలుకు తబలా పూర్తిగా నేర్పాలని చూసిండు. ఎందుకంటే తను వచ్చినా రాకపోయినా ఇంకొకరున్నారంటే ఎంతో ధీము. రోజుకొక్కలు కొట్టినాకొట్టొచ్చు. వాడే నేర్చుకోలేదు. నేర్చుకుంటే రాత్రంతా కొట్టు మంటరని భయం. మామ అట్లగాదు. ఎంతపనిచేసినా, జరం వచ్చినా, చేతులు గుంజినా వచ్చుడు వచ్చుడే! కొట్టుడు కొట్టుడే! ఏ పనికి ఎనకా ముందుకాడు.

ఒకసారి కొండయ మామకు మస్తు జరమచ్చింది. పొద్దంతా మంచంలోంచి లెవ్వలేదు. పక్కబొర్రియ్యలేదు. రెండు గ్లూకోజులు ఎక్కినయి. అయినా రాత్రికి రియార్సల్‌కు వచ్చిండు. తబలా పట్టిండు. ఈ విషయం తెలిసి మా తాతకు కోపమొచ్చింది. 'వీని సంగతి చెప్పుత ఉండు' అని రియార్సల్ దగ్గరికి వచ్చిండు.

తాత వచ్చేవరకే మామ పాత్ర వచ్చింది. తబలా మీదినుంచి లేచి పాట పాడుతండు. తాత ఏమనుకున్నడోగాని కొద్దిసేపు కూసుండి వెళ్లిపోయిండు. నోరుగూడా తెరువలేదు. మా లస్మవ్వతో మాత్రం 'ఎమో అనుకున్న గనీ మన కొండనిది కిన్నెర రాగమేనే! పాటను ఎంత మజుబూతుగ పాడుతడనుకున్నవు. మా నాయిన లెక్కనే!' అన్నడట.

అవ్వ నవ్వుతూ "ఆ..మీనాయిన..కొంచెమా...పాటపాడితే దబ్బలరాళ్లువోసినట్టే. వాడు మా అన్నసాలు" అన్నదట.

ఆటలు నేర్పే పంతులు దొరుకక కొండయమామ పక్కఊర్ల కూడా వెదుకుతండు. ఎవరింట్ల ఏ పండుగైనా అందరం నిలబడాలంటడు. అవసరానికి ఆదుకోవాలంటడు. మా మ్యాల్లెంలో మంచి మూటీ వచ్చింది. అప్పుడే సాకలి మల్లయ్య చెల్లె పెండ్లి కుదిరింది.

అప్పటికి ఇంకా ఆయిటి మూనలేదు. మల్లయ్య మాత్రం చింతపువ్వు కార్తికి రెండెకురాలు దున్నిండు. రెండురోజుల్లో నాట్లు. చెరువుకొనకు లేటుగా నాటువేసిన సాంబమసూరి కోతకచ్చింది. "ఈ యేడు పెండ్లి చెయ్య. పనితీరది" అన్నడు మల్లయ్య. అతడు మా మాల్లెం మనిషే!

'ఓరిపిచ్చోడా..ఆడివిల్లపెండ్లి ఎత్తగొట్టుకుంటార్రా వద్దు' అన్నడు మామ. అందరినీ జమకొట్టిండు. ఒక్క రాత్రికిరాత్రే కల్లం లేపుకచ్చిండు. రెండురోజులల్ల నాటు వేసిండు. ఒకనాడు కట్టెలు కొట్టింర్రు. ఇంకోనాడు బియ్యం పట్టుకచ్చింర్రు. లగ్గం అవలీలగ ఎల్లదీసింర్రు.

మా మాల్లెంల కులానికొక్కలు ఉన్నరు. వాళ్లు ఎంతమూటి మీద ఉన్నరంటే..మా లస్మవ్వ ఎప్పుడో బుద్ధివుట్టి 'కొండా..నాలుగు చిప్పలకాయలు తేకపోతివిరా' అన్నది. తెల్లారే సరికి నాలుగు సంచులు దిగినయి. మా బాపుకు బర్రె పాకకు రెండు గుంజలు తక్కువ పడ్డయి. కొండయ మామకు చెబితే పొద్దుగూకే వరకు నాలుగు గుంజలు దిగినయి. మా ఇంట్ల సత్యనారాయణ రతమైతే రెండు సంచుల బంతిపూలు దిగినయి.

ఎవలింట్ల పండుగైనా బొట్టు పంపుతండ్రు. బోజినానికి రమ్మంటండ్రు. ఎటుపోయినా మామాల్లెపోల్లు మూటీమీద పోతండ్రు. ఎక్కడన్నా పక్క ఊర్లె నాటుకాలేత్తే కలిసిపోయి చూసివత్తండ్రు.

రియార్సల్ ఉంటెనే మంది మూటిమీద ఉంటరని మామ నమ్మకం. రియార్సల్ ఉండాలంటే నాటకం నేర్వాలె గదా! నాటకం నేర్వాలంటే పంతులు కావాలె. మాఊర్లె పంతులు దొరుకడని తెలిసిపోయింది. నాటకం నేర్వకుంటే మూటీ ఉండదని తెలిసిన మామ పంతులు కొరకు ప్రయత్నం చేత్తనే ఉన్నడు.

నాగంపేటల పంతులున్నడని ఎవలో చెప్పిండ్రట మామకు. అంతే! తెల్లారేసరికి సైకిల్‌మీద నాగంపేటలున్నడు. పంతులు ఊరికి పోయిండంటే వరుసగ రెండు రోజులు పొద్దుమాపు పోయిండు మామ. మూడవనాడు పంతులును కలిసి మాట్లాడిండు. ఒప్పించి సైకిల్‌మీద తీసుకచ్చిండు. రియార్సల్ మా ఇంట్లోనేగదా!

మొదటినాడు పంతులు మనిషికొక పాటపాడిచ్చిండు. పాటలు అట్లా పాడద్దని వేరే తరీకన పాడిసూపిచ్చిండు. ఒక్కపాటనే ఆటతాళం మీద ఎట్లాపాడచ్చునో, రూపకం మీద ఎట్లా పాడచ్చునో పాడిసూపిచ్చిండు. పంతులు మంచి తబలాకాడు. కొండయ మామనే అంటె అంతకంటే తాత. 'గుణసుందరి' నాటకం నేర్పిత్తానన్నడు. అదియక్షగానం గాదు. నాటుకం. పాటలన్నీ రూపకం, ఆదితాళాలే! మంచి మంచి కంద పద్యాలు సీసపద్యాలున్నయి. పల్లీల హర్మానీగాని ఉంటే..సామిరంగా మోత మోగుతుండె.

పంతులు దొరికినంక అందరికీ పానమచ్చింది. మల్లీ రియార్సల్ మొదలయింది. ఆటమంచిదేగనీ మోతకు ఓర్వాలన్నట్టు బరువంతా మామమీదనే పడింది. సూదు సూదు మన్నట్టు అప్పుడే వానమీద వాన రెండు వానలుకొట్టినయి. అందరూ పునాస దున్నుకాలకు సాగిండ్రు.

నిజంగనైతే అది నాటుకాలు నేర్చేకాలమేగాదు. పనిఉన్న దినమేనాయె. పొద్దంతా దున్నిదున్ని అలసటగా ఉంటది. కొండయమామ నైతే మాపటేల పొలంనుంచి ఇంటికి రాంగనే సైకిల్ అందుకుని నాగంపేట పోవాలె. పంతులును ఎక్కించుకుని రియార్సల్‌కు



రావాలె. మల్లీ మబ్బుతోనే సైకిల్‌మీద పంతులును ఊర్లెదించి రావాలె. ఎంత లేదన్నా నాగంపేట నాలుగు కిలోమీటర్లు.

అంతదూరం నుంచి వచ్చుడు పోవుడుకు పంతులుకే యాష్టకచ్చిందిగనీ మామకు మాత్రం యాష్టకు రాలేదు. అక్కడ పంతులు కులానికి పెద్ద మనిషట. ఏవేవో పనులుంటయి. అంత దూరం పోతే ఒకనాడు పని ఉందని, ఇంకోనాడు చుట్టాలచ్చిండ్రని, ఒకనాడు కల్లుతాగిన్నని మర్రగొడుతుండె. సైకిలందుకుని మామ వట్టిగనే తిరిగివత్తుండె.

ఒకటి రెండుసార్లు మా దాసు చిన్నాయిన సైకిలందుకుని నాగంపేట పోయిండు. పోయేటప్పుడు ఏమీలేదుగని వచ్చేటప్పుడు ముసురు మొదలయింది. పంతులును సైకిలిమీద ఎక్కించుకు వత్తూ వత్తూ గుడిగడ్డకు సైకిల్ మీది నుంచి జారిపడ్డరట. పంతులైతే గుమ్మడి పండు కూలినట్టు కూలిండట. పెయ్యంతా బురదనే. బట్టలంతా బురదనే.

పనులన్నీ తీరేదాక రియార్సల్ ఆపెద్దాం అన్నడు పంతులు. వచ్చినయి మరిచిపోతం. ఆటాడేసి బందుపెడదాం అన్నడు కొండయమామ. పంతులు కొరకు పోవడం రావడం తప్పుతుందని మామకు కూడా అనిపించింది.

"ఆటపూర్తిగా నేర్వలేదు. రెండువారాలన్నా రియార్సల్ చేయలేదు. ఎట్ల ఆడుతం" ఒకలిద్దరు మేటివేశకాల్లు అనుమానంగా అడిగిండ్రు మామను.

'ఆ....ఏముందిలే మొదలు పెట్టినందుకు ఎట్లనో ఎల్లదియ్యాలె. కచీరు ముందు వట్టిగనే ఆడుదాం' అన్నడు కొండయ మామ. ఓ పనైపోతుందనుకుని మా పంతులుగూడా 'ఏ..ఆడుండ్రి నేను పరుద సాటుకు నిలబడి పాటలు అందిత్తతియ్యండ్రి. సగం నేర్పి ఎట్ల వదిలేత్తరు. పలానా పంతులు సగమే నేర్పిండని పేరా..?' అన్నడు.

అందరం సరేననుకున్నం. మనిషికి ఐదురూపాయలు జమచేసి సామాన్లు, మేకప్ రంగులు తెచ్చుకున్నం. అంతవరకు సగం నేర్చిన ఆట ఎప్పుడూ ఆడలేదు. అందరికీ మా పంతులు మీదనే నమ్మకం.

మా పంతులుగూడా అందరికీ ధైర్యం చెప్పుతుండు. మీకెందుకు నేనులేనా అంటుండు. అప్పుడే రెండుమూడురోజులు గెరువయింది. మొగులుమీద మచ్చలేకుండా ఎండగొట్టింది.

అందరం ఏశాలు ఏసుకున్నం. ఆట మొదలువెట్టినం. అంతే! ఉరుములు, మొరుపులు పెద్దగాలివాన. షాందిరికి షాందిరి బతకమ్మలేసినట్టు లేచింది. ఏశాల మీదనే ఎక్కడోల్లక్కడ ఉరుకుడే ఉరుకుడు.

# అచ్చు పుస్తకం పోయిందోయ్...!

రోనికార్తి దాటింది. ముర్గశిర సగం పాదం. కాలం కలుపుకోలేదు. ఎండలు కొడుతున్నయి. సగం పాదంల కాలం కలుపుకోలేదంటే కార్తి మొత్తం వానలు పడయన్నట్టె. పునాసపంటలేసి వానలకొరకు ఎదురుచూస్తంద్రు జనం. చేతులమీద పనిలేదు. మొలిచిన మొక్కలు మొలిచినట్టు మాడిపోతన్నయి.

అందరికి వానలు, పంటలు యాదికత్తే మామకు బాగోతం యాదికచ్చింది. మేము గుణసుందరి సగం నేర్చి ఆడకుండానే విడిచిపెట్టినంగదా! ఇక్కడ ఏశకాల్లకు చెప్పితే వింటరో వినరోనని కొండయమామ సక్కగ నాగంపేటకు పోయిండు. అక్కడ పంతులుతోని 'పంతులూ మీకు నేర్పిచ్చిన పేరు లేకపాయె, మాకు ఆడిన పేరు లేకపాయె. ఊర్లె అందరు ఎక్కిరిత్తంద్రు' అన్నడట.

ఏమనుకున్నడో పంతులు. తెల్లారే సరికి ఊర్లెకచ్చిండు. రెండు రోజులు రియార్సల్ చెయ్యింద్రి నాటకం ఎత్తామని చెప్పిపోయిండు. మాకు పనేం లేదు గదా! రియార్సల్ మొదలు వెట్టినం.



"కొండా...ఏందిరా ఇది? నాకు లేనిపని వెట్టినవు. ఇల్లంత దుక్కిలి దుక్కిలి అయితంది. రోజు తట్టెడు కరుకు బీడీలు ఎత్తిపొయ్యలేక సత్తన్న. ఈ మ్యాల్లం మా ఇంట్ల తగది ఎక్కడన్నా పెట్టుకో" అని మా అమ్మ యాష్టపడ్డది.

పైకి అట్లా అన్నదిగనీ మ్యాల్లం మా ఇంట్లకు వచ్చిన నుండి వాళ్లంతా ఇంట్ల మనుషులే అయిపోయింద్రు. ఏ పని ఎవలకు చెప్పినా కాదనరు. ఎప్పుడూ ఇంటికి ఎవలో ఒకలు వత్తనే ఉన్నరు. ఆపతికి సంపతికి నిలవడతనే ఉన్నరు. కోతలు మోతల మీదనైతే కైకిల్లు లేకుండా పని నడుత్తంది.

"ఆ...ఇసొంటి బంగుల మాకు దొరకదని కాదు. ఏదో..అందరికి దగ్గరుంటది గదా అని వత్తున్నం. రేపటెల్లుండి ఈ ఆటవేత్తున్నం. తర్వాత నువ్వు రమ్మన్నా రాము. మనుసులే మనుసులు బీడీలు తాగరా తియ్యి". కొండయ మామ అన్నడు.

మామ గూడా పైకి అట్లా అన్నడు గనీ ఇంత సవులతు బయట ఎక్కడా దొరుకది. అర్ధరాత్రి దాకా తలుపులు తెరవెట్టాలె. అందరు పోయినంక మూసుకోవాలె. మంచోల్లస్తరు. చెడ్డోల్లస్తరు. ఎవలను వద్దనరాదు. వీళ్లు రియార్సల్‌కు వస్తరని ముందుగనే తిని కూసోవాలె. చప్పుడుకు అర్దరాత్రి దాకా నిద్ర పట్టదు.మళ్లా మబ్బుతోనే నిద్రలేవాలె. మట్టినేల కాబట్టి వట్టిగనే పొక్కిలయితది. మూడురోజుల కొకసారైనా ఇల్లుఅలుకాలె. ఇట్లా ఏ ఇంట్లా కుదరదని ఎవ్వలూ ఓర్వరని మామకు తెలుసు.

"ఎవల బంగుల ఎందుకు...? నీకుందిగదా లంకంత ఇల్లు. నీ ఇంట్ల పెట్టుకో. నా ఇంటికి రాకు. నన్ను బదునాం చెయ్యకు. ఈ తబులా తాళాలను తీసి బజార్ల పారేత్తె" కోపంగా అన్నది అమ్మ.

అన్నంతపని జేస్తదనుకున్నడు మామ. మా అమ్మ సంగతి మామకు తెలుసుగదా. మాట మాట్లాడితే కట్టెపుల్ల ఇరిసినట్టె. అందుకే సముదాయిస్తున్నట్టుగా "ఏదో తియ్యక్కా. ఈ ఆటాడితే మాల్లెమే ఇచ్చిపోతది. ఆట నేర్పే పంతులే లేకపాయె. రోజు కష్టపడి నాగంపేట నుంచి పంతులును పట్టుకస్తే ఒకనాడు వచ్చే ఇంకోనాడు రాకపాయె. మొన్న ఆటవేస్తే పనైపోతదనుకుంటే వానగొట్టె. ఇగ ఇప్పుడన్నా కొనముడుతదోలేదో. రేపో ఎల్లుండో..రెండుమూడు రోజులే...' అన్నడు మామ.

అనుకున్నట్టు అందరికీ తొందరనే ఉంది. కాలం ఎనుకకు పట్టుట్లగనీ లేకుంటే పనిఉన్న దినమాయె. ఏదో కతకతోలె ఎల్లదీస్తే అయిపాయె అనుకుంటుంద్రు. అనుకున్నట్టుగానే కచీరు దగ్గర స్టేజి వేసినం. పంతులు పరుదాసాటుకు ఉండి పాటలు అందిస్తనన్నడు.

మొదట నాగంపేట పంతులుకు ఎంతో ఉత్సాహముండె. "హార్మోని తేవాలె. పల్లీలు వెయ్యాలె. మైకుతేవాలె". ఇట్లాఏవేవో చెప్పినోడు నాలుగు రోజులనాడే సల్లవడ్డడు. రోజువచ్చుడు పోవుడు ఎవలకైనా యాష్టనేగదా! అక్కడికి కొండయమామ అంటనే ఉన్నడు 'మీకెందుకు పంతులూ...మీరు ఊ అనుండ్రి రోజూ సైకిల్ మీద తీసుకత్త తీసుకపోత.' అని. పంతులే ఒప్పుకుంటలేడు.

రియార్సల్ మా ఇంట్లనే కాబట్టి అచ్చు పుస్తకం, తబలా, తాళాలు, పరుదాలు, బొంగులు అన్నీ మా ఇంట్లనే ఉంటయి. నేనే వాటిని తీసి దాచిపెట్టాలె. అడిగినప్పుడు ఇయ్యాలె. 'గుణసుందరి' నాటకం పుస్తకమైతే నా బ్యాగులోనే ఉంటుండె. నాటకంలో నాకో చిన్న పాత్ర గూడా ఇచ్చిండ్రు. స్కూల్లో పిల్లలు పుస్తకాన్ని తీసుకుని పాటలు రాసుకుందురు.

అట్లా ఆరోజు గూడా అచ్చు పుస్తకాన్ని స్కూలుకు తీసుకపోయిన. డెకోలం రవిగానికి నాకూ బాగా దోస్తు. వాళ్ల నాయినకు నెత్తిమీద ఒక్క ఎంటిక లేదు. మొత్తం బట్టగుండే ఉన్నది. అందరూ డెకోలం బాల్నర్సు అంటరు. మేము అదేపేరును వీడికి పెట్టినం.

వాడు పుస్తకం తీసుకపోయిండు. పగటి పూట బడికి రాలేదు. తాతవచ్చి పట్నం తోలుకపోయిండట. పోతూ పోతూ పుస్తకం ఎక్కడనో పెట్టిపోయిండు. వాళ్ల అవ్వను అడిగితే ఇల్లంత వడబోసి లేదని చెప్పింది.

నాగుండెలో రాయి వడ్డట్టయింది. ఎందుకంటే అదేరోజు ఆట. పాటలు ఎవలకూ నోటికిరావు. నేర్చుకునేటప్పుడే సగం నేర్చి విడిచిపెడితిమి. ఈ రెండు రోజులు రియార్సల్ జేస్తే ఏమస్తది. పుస్తకం పట్టుకుని పాటల మొదటి చరణం అందియ్యాలె. మా పంతులు గూడా అట్లనే అందిస్తనని చెప్పె. అట్ల అందియ్యాలంటే చేతులపుస్తకం ఉండాలెగదా. ఎట్లా...? నాకు భయం పట్టుకుంది.

పొద్దు గూకింది. రవిగాని ఇల్లంతా ఇంకోసారి వెదికిన. దొరుకలేదు. స్టేజిదగ్గరికి వచ్చిన. రెండుదిక్కుల రెండు పెట్రమాక్స్‌లైట్లు పెట్టిండ్రు. వెనకొకటుంది. బజారులైటు వెలుతురే మస్తుగుంది. వేశకాళ్లు వేశాలు వేస్తండ్రు. పంతులు నన్ను చూసి పుస్తకం తెమ్మన్నడు. నేను దొరుకుత లేదని చెప్పిన.

పంతులు నోరు తెరిచిండు. దబదబా మా ఇంటికి వచ్చిండు. ఇల్లంతా చూసిండు. సల్లచెమటలు పుట్టినయి. తీరా సమయానికి ఆట వద్దనరాదు. అందుకని నాదొక పుస్తకాన్ని మలచి చేతుల పట్టుకుని గులుక్కుంట పోయిండు.

సూపుకు పుస్తకం లెక్కుంది గనీ పాటనా పద్యమా..? వట్టి పుస్తకమే నాయె.



ఎవరికీ పాటలు నోటికి రావు కాబట్టి ఆట అసలే సాగదని నాకు తెలుసు. అందుకే భయపడుతూనే స్టేజి దగ్గరికిపోయిన. అసలు విషయం పంతులు గూడా ఎవలకూ చెప్పుతలేదు. నేను గూడా నోరుదెరుత్తలేను.

ఆట మొదలయింది. పంతులు పరుదసాటుకు నిలబడ్డడు. తనకు నోటికి వచ్చిన పాటలు అందిచ్చిండు. నోటికి రానియి నోరు తెరిచిండు. వేశకాళ్లకు తెలువదిగదా. పంతులు కావాలనే అందిస్తలేదని కన్నెర్రజేస్తండ్రు.

'ఈ పంతులు మొదటినుంచీ ఇంతే మనలను పేల్ జెయ్యాలని చూస్తండు. పుస్తకం తెరుత్తలేడు పాట అందిత్తలేడు చూసినవా' అని కొండయ మామ మొకం ముందే అన్నడు. పంతులు విననట్టె ఉన్నడు.

ఎవలూ సరిగ్గా పాటలు పాడుతలేరు. ఆట మొదలే ఫేలయింది. వచ్చినోళ్లు తిట్టుడే గాదు. కొందరు "థూ నీ ఆటవ్వను...." మొకం ముందే ఊంచి లేచిపోయిండ్రు. మా కొండయ మామకు కోపమచ్చింది. పంతులు చేతుల్లోంచి పుస్తకం గుంజి నాచేతుల పెట్టి "నువ్వన్నా చెప్పురా" అన్నడు. ఏం చెప్పాలె అది నా తెలుగుపుస్తకం. నేనుగూడా నోరు తెరిచి నిలవడ్డ.

'నీకేం బుట్టిందిరా..పాట మొదలేంటిదో చెప్పు". గుణసుందరి వేశకాడు తిడుతూ అన్నడు.

"ఏదో ఒకటిపాడు రాకపోతే వచనం చెప్పు. బీరిపోకు, ఆట నడువని". నేను గట్టిగనే అన్న.

వాడు అర్థం జేసుకుంటేనా..? "పాట....పాట ఏందిరో చెప్పురా" అంటూ నా దిక్కే చూస్తండు. నేను నెత్తిగోక్కుంట వాని దిక్కే చూస్తన్న. ఆట ఆగిపోయింది.

మందిలోంచి ఎవరో లేచి "ఓ బోషిడికే...పాటలు రానిది ఎందుకు ఆడుతుండ్రురా నీ బాగోతం....." బూతుమాట అన్నడు గట్టిగా. అప్పటికి పావుల మందం ఆట గూడా సాగలేదు.

"తన్నుండ్రి లంబిడి కొడుకులను. నిద్ర పాడుజేసిండ్రు" ఇంకెవరో అన్నరు. సగం మంది లేచి తిట్టుకుంట ఇంటికి నడిచిండ్రు.

మా దాసు చిన్నాయినకు కోపమచ్చి నా చేతులనుంచి పుస్తకం గుంజుకుని తెరిచిండు. ఏముంటది. పద్యాలు, ప్రశ్నలు, జవాబులు, సందులు, సమాసాలు. అది నాతెలుగు పుస్తకమేనాయె.

“ఛీ నీయవ్వ. ఇది పుస్తకమేకాదు.” ఇసిరికొడుతూ అన్నడు చిన్నాయిన. మా దగ్గర పుస్తకమే లేదన్న విషయం వేశకాళ్లకు తెలిసిపోయింది. పంతులు నేనూ మొఖాలు చూసుకున్నం. అక్కడనే ఉంటె తిడుతరని భయమయింది. మెల్లెగ తప్పించుకుని బయటకచ్చినం.

ఎప్పుడైతే అసలు విషయం తెలిసిపోయిందో వేశకాళ్లు ఎవరికివారే సర్దుకున్నరు. వచ్చిందొొకటి, రానిదొొకటి, ఇదికాకపోతే ఇంకో ఆటలది., ఏది యాదికత్తే అది చదివి దుమ్ములేపింద్రు. అక్కడి నుండి ఆటగాకుంటే ఆట నడిచింది. పోయినోళ్లు పోయింద్రుగనీ ఉన్నోళ్లు మాత్రం తెల్లారెదాకా లెవ్వలేదు జనం.

“ఏమో అనుకున్నం గనీ ఎంత పసందుగా ఆడిండ్రు. ఏంబుట్టిందోగని ఆటమొదలే పడగొట్టింద్రు. మొదటినుంచి ఇట్ల ఆడితెనా…మోతమోగుతుండె ఆ కర్రె పంతులు స్టేజి మీదున్నంత సేపు ఆట కమ్మనేలేదు” అన్నరు.

ఇది మేము ఊహించలేదు. మొదలే పుస్తకంలేదంటే బయపడి పాటలు మరిచిపోతరనుకున్నం గనీ ఇట్ల దుమ్ములేపుతరని తెలువది. అసలు సంగతి ముందే చెప్పితే ఎంత బాగుండునని తర్వాత అనిపించింది.

ఇదంత జరిగినంక రవిగాని నాయిన …అదే…డెకోలం బాల్‌నర్సు పొద్దున్నే మా ఇంటికివచ్చి కలిసి ‘మావోడు బుక్కులమీద పెట్టిండు. నేనే బాయికాడికి తీసుకపోయిన. రాత్రి దేవులాడింద్రట కదా” అని పుస్తకం చేతులపెట్టిండు.

నాకు అరికాలి మంట నెత్తికంటింది. ఏమన్నాలాభంలేదు. నోరు మూసుకున్న. ఇట్లా జరిగిన విషయం గూడా ఎవలకు తెలువగూడదాయె. తెలిస్తే నన్ను మ్యాల్లంలకు రానియ్యరు. కొండయ మామనైతే తన్ననే తంతడు. అందుకే ఎవలకూ చెప్పకుమని రవిగాని నాయినకు బతిమిలాడి చెప్పిన.

అదే నేను చేసిన తప్పు. గుర్రం మూతికి బట్ట గట్టినట్టయింది. ఒక్కటే రోజుల అందరికీ తెలిసిపోయింది. ఎంతతిడుతరో అనుకున్న. ఎవలు తిట్టలేదు. నవ్వుడే నవ్వుడు.



# కొత్త పంతులు వచ్చిండు

యాసంగి నాట్లు పూర్తయినయి. దున్నుకాలప్పుడు బురదకు పెచ్చినకాళ్లు తడారిపోయినయి. పనేంలేదు. కొండయమామ మల్లా మా నాటకపు మ్యాల్లాన్ని ఏకం చేసిండు. ఒక్కసారి పిలుపు ఇచ్చిండోలేదో అందరూ మా ఇంటిలో జమయింద్రు.

మాఘమాస దాటింది. శివరాత్రి వస్తుంది. నాటకాలు నేర్వడానికైనా, ఆడడానికైనా మంచికాలం అదే. చలి ఉండది. వానలుండయి. పనేంఉండది. అందుకని అందరూ జమయింద్రు. ముగ్గురు కొత్తవాళ్లు గూడా వచ్చింద్రు. కొత్తవాళ్లు ఎవరు వచ్చినా ముందుగా కొండయ మామనే కలువాలె. మామ రాంద్రి అంటెనే రావాలె. ఎన్నిపైసలు గట్టుమంటే అన్నిపైసలు గట్టాలె.

మాకున్న అసలు సమస్య ఏమిటో తెలుసుగదా! ఆట నేర్పే పంతులు లేడని. ఆ సమస్య ఇప్పుడు తీరింది. శాల గంగరాములు మా ఊరికి ఇలిటెమచ్చిండు. ఇప్పుడుగాదు. పదేండ్లకిందనే. ఇప్పుడు ఇద్దరు పిల్లలతండ్రి. వాళ్ల ఊరిలో గంగరాములుకు తండ్రి ఉన్నడు. అన్నదమ్ములు ఏరువడ్డంక తండ్రికి మనిషికి యాడాది తిండిపెట్టే ఒప్పందం కుదిరింది. నా దగ్గరొక యాడాది ఉంటడని గంగరాములు తండ్రిని రమ్మన్నడు.

'పంతుళ్ల ఎతుకులాటలో కొండయమామ గంగరాములు తండ్రి గురించి ఇంతకుముందే విన్నడు. అందుకని రాంగనే పట్టుకున్నడు. పేరు పున్నయ్య. మనిషి పొట్టిగా నల్లగా కట్టెపుల్ల లెక్కుంటడు. కంఠం మాత్రం కంగుమంటది. వయసుమీద నాటకాలు వేసిండట. ఊరూరు తిరిగిండట.

ఇంటి దగ్గర భార్యుండంగనే ఇంకోమనిషిని కూడుకున్నడట. ఆడివేషం గట్టిడ్యాన్స్ అందుకున్నడంటే భూమిమీద కాలు నిలవకపోవునట. కూడుకున్న మనిషి కొడుకేనట గంగరాములు. ఎంతవరకు నిజమోగని నాటుకాలాడేప్పుడు ఊరికో భార్య ఉండెనంటరు. ఏశమేత్తే ఓర్వకపోదురట.

మామ అడగడం అతడు కాదనకపోవడం కొత్తపుస్తకాలు తెప్పించడం ఒకటెనుక ఒకటి జరిగిపోయినయి. 'మాయసుభద్ర' నాటకం వెయ్యాలన్న నిర్ణయం గూడా జరిగిపోయింది. అది స్వదేశీ నాటకం. కడియాలపల్లి పంతులు రాసింది. అచ్చుకాలేదు. చేతి రాత పుస్తకమే! అది పున్నయ్య పంతులే తెచ్చిండు.

పుస్తకం మొత్తం గొలుసు రాతలుంది. ఆరాత పంతులుకు తప్ప ఎవలకూ రాదు. పంతులు రాతగూడా గొలుసు రాతనే.

ఆ రాత మాకు రాదు. అందుకని రెండు రాతలు వచ్చిన కోమటి రాజయ్యకు పాత్రలు రాయిమని ఇచ్చినము. అట్లనే ఒక గ్రంథము గూడా రాయిమన్నము. వారం రోజుల్లో పారట్లు, గ్రంథం రాసుడు పూర్తయింది.

పున్నయ్య పంతులు వచ్చినంక మా మాల్లెపు రూపురేఖలే మారినయి. ఒక చెలికత్తె పాత్ర బుడ్డెనుకాని పాత్ర (జోకర్) పెట్టిండు. బుడ్డెనుకాని పాత్రకు కొన్ని జోకులు నేర్పిండు. సభ్యులందరి పేర్లు రాసుకున్నడు. కొన్ని కండీషన్లు పెట్టిండు.

తొమ్మిది లోపునే అందరు రావాలె. అందరు పల్లెం (కొరస్) అందుకోవాలె. ఒక్కనాడు గైరాజర్ కావద్దు. వచ్చినిద్రపోవద్దు. ముచ్చట్లు పెట్టద్దు. క్రమశిక్షణతో ఉండాలె. ముందుగల్లనే మనిషికి ఐదురూపాయలు తేవాలె. రాత్రి రెండుగంటల దాకా రియార్సల్ నడువాలె. రియార్సల్ నడువంగ బీడీలు తాగద్దు. బయటకు పోవద్దు. పాటలు సరిగ్గా యాదిజెయ్యాలె.



పున్నయ పంతులు ఇట్లా సవాలక్ష కండీషన్లు పెట్టిండు. మామాల్లెంలో కొందరు జీతగాల్లున్నరు. వాళ్లకు దొడ్డికాడనే ఏ రాత్రయితదో తెలువది. కొందరు కైకిలి చేసుకునేటోళ్లున్నరు. వాళ్లు ఎప్పుడు ఇల్లు చేరుతరో తెలువది. కొందరు రైతులున్నరు. వాళ్లకు ఎప్పుడు ఏంపని పడుతదో తెలువది. నాలెక్కన సదువుకునే పిల్లలు ముగ్గురున్నరు. వాళ్ల అయ్యవ్వలు ఎప్పుడు తిడుతరో తెలువది.

ఈ కండీషన్లకు ఎవ్వలూ రారనుకున్న. ఎందుకంటే అప్పుడొకలు ఇప్పుడొకలు అందరు వచ్చేసరికి ఇంతకు ముందు పదిగంటలు దాటుతుండె. ఎవలపాత్ర అయిపోంగనే వాళ్లు జారుకుందురు. ఒక్కొక్కలు రెండుమూడు రోజులు రియార్సల్‌కు రాకపోదురు. మధ్య మధ్య ముచ్చట్లు పెడుదురు. బీడీలు తాగుదురు. అరుగు అంచులమీద గొంగడి పరుచుకుని పండుకుందురు. రియార్సల్‌కు కచ్చితమైన టైం లేకుండె. ఎప్పుడు యాష్టకస్తే అప్పుడు బందు వెడుదురు. పల్లెం గూడా అందుకోకపోదురు.

నేను అనుకున్నది తప్పే అయింది. మరునాడు తొమ్మిదిలోపే అందరు వచ్చింద్రు. సగం మంది పైసలు గూడా తెచ్చింద్రు. మాటలేదు ముచ్చటలేదు. మనుషులు మెసులుతలేరు. మా పెద్ద సారు ముందు మేమెట్లా కుక్కిన పేనులెక్క ఉంటమో అట్లున్నరు. ఎవరో బీడీ ముట్టియ్యబోతే చేతులతోనే సైగ చేసిండు పంతులు. వాడు జెట్టన బీడి జేబుల పెట్టుకున్నడు. నాకు విచిత్రమనిపించింది.

మ్యాల్లానికి ఒక మేనింజర్ ఉండాలని మమ్మల్నే ఎన్నుకొమ్మన్నడు పంతులు. అందరు కొండయమామ పేరునే చెప్పింద్రు. పైసలు కొండయ మామకిచ్చి తెల్లారే ఒకపెట్రమాక్స్‌లైటు తెప్పించిండు పంతులు. లెక్కలన్ని రాసిపెట్టుమన్నడు.

అందరికీ ఇది కొత్తగా వింతగా ఉంది. అంతకుముందు ఏదో భక్తి పాటతో రియార్సల్ మొదలు పెడుదుంటిమి ఈసారి 'పరాబ్రహ్మ పరమేశ్వర..పురుషోత్తమ సదానంద' పాటను నేర్పిండు. మంగళారతి పాటను గూడా నేర్పిండు. పంతులు ఈసారి కొత్తగా నారిగాని పాత్రను పెట్టిండు. అది కుంటి బాలయ్యకిచ్చిండు. వాడు కుంటుకుంట స్టేజిమీద మూడు సుట్లు తిరుగుతే జనం పడిపడి నవ్వాలె.

నారిగాడు ప్రతీ పాత్రను ఏఊరు ఏంపేరని అడిగి పరిచయం చెయ్యాలె. 'అనంత సత్య వీర వెంకట దేవ రామ సుబ్బ రాజ్యలక్ష్మి' పాత్రను గూడా పెట్టిండు. అపేరును చెప్పడమే ఒక పెద్దజోకు. ఎప్పుడైనా ఏశకాళ్లకు మేకప్‌కు లేటయినప్పుడు జనాలను ఎట్లా నవ్వించాలో నారిగానికి, అనంతలక్ష్మికి నేర్పిండు పంతులు. వాళ్లిద్దరు కలిసింద్రంటే నవ్వనోళ్లు లేరు. నాలుగైదు పిట్టకతలు గూడా నేర్పిండు పంతులు.

ప్రతీసారి పంతులును చూస్తుంటె నాకు మా మొండయ సారే యాదికస్తుండు. మాకు హిందీ చెప్పుతడు. ఆసారు గూడా ఇట్లనే కుర్చీ ఏసుకుని కూసుంటడు. పుస్తకం గూడా పట్టడు పాటాలన్నీ నోటికే చదువుతడు. పంతులు గూడా అంతే. పుస్తకం పట్టకుంటనే పాటలు మొత్తం నోటికి సదువుతడు. మా పంతులు మమ్ముల్ని ఇట్లా కట్టడి జేస్తుంటే బయట కొందరు యాష్టపడ్డరట.

'పోరగండ్లకు కొత్తగ లగ్గాలాయె. అటు నాటుకం ఆడాలని బుద్దాయె. ఇటు పెండ్లాంతోని ఉండాలని బుద్దాయె. వరుసగ రమ్మంటే ఎట్లత్తరు. చూసి చూడనట్టు పోవాలె' అన్నరట. కానీ పద్దతులు ఏమీ మార్చలేదు పంతులు. అందరూ వరుసగా వచ్చుడు వచ్చుడే! బుద్దుంటెనే రాండ్రి. లేకుంటె లేదు అన్నడట. అప్పటికంటే ఇప్పుడే చక్కగా నడుస్తుంది రియార్సల్.

ఇంకో విషయం ఏమిటంటే మాల్లెంల ఇద్దరు ముగ్గురు మాట్లాడుకోరు. వాళ్ల తండ్రులు గెట్ల పంచాదులు పెట్టుకున్నరట. చాలా ఏండ్లయిందట మాట్లాడుకోక. ఆవిషయం పంతులు పసిగట్టిండు. పంతులు నాటకం ఆడినప్పుడు గూడా ఇట్లేనట. ఇద్దరు మాట్లాడుకోనోళ్లు కంసుడు. కృష్ణుడి వేశాలు వేసింద్రట. స్టేజిమీద యుద్దం చేసేప్పుడు నిజంగనే కత్తితోని పొడుసుకున్నరట. అది కట్టెకత్తి కాబట్టి బతికిపోయింద్రట. ఈ విషయం చెప్పి అందరు మాట్లాడుకోవాలన్నడు పంతులు. తెల్లారే వాళ్లకు మాటలు కలిసినయి. తర్వాత తండ్రులు కూడా కలిసిపోయింద్రట. అది వేరే విషయం.

ఇన్ని కండిషన్ల మధ్య రోజువచ్చి కట్టడిగా నేర్పిస్తే మేము మూడు వారాలు నిండకముందే నాటకం పూర్తిగా నేర్చినం. ఈ మూడు వారాల్లో అవసరమైన కిరీటాలు, ఆయుధాలు పంతులే చేసిండు. బూరుగు కట్టెతో రెండు గదలు చేయించి రంగులద్దిండు.

వసూలైన పైసలున్నయి కాబట్టి కొంత సామాను, పూసలదండలు, విగ్గులు కొన్నడు. మనిషికొక ఇనుప సందూక (పెట్టె) కొనుక్కోమన్నడు పంతులు. ఎవలబట్టలు సామాన్లు వాళ్ల సందూకలనే పెట్టుకోవాలె. తాళంవేసుకోవాలె. నాటుకం వేసేనాడు ఎవల సందూక వాళ్లు తెచ్చుకోవాలె. ఇదేదో మంచిగున్నదని మనిషికొక సందూక కొనుక్కున్నం.

మేకప్ కొరకు జింక్‌పౌడర్, కొబ్బరినూనె, లిఫ్‌స్టిక్ వాడాలని పంతులే చెప్పిండు. అంతకు ముందు వట్టి మేకప్ పౌడరు, నీలిరంగునే పూసుకుందుము. మేకప్ విషయంలో కూడా మంచి జాగ్రత్త తీసుకున్నడు పంతులు. అడ్డమైన రంగులు వాడితే కండ్లు కరాబైతయని చెప్పిండు. కామారెడ్డిల ఒక దుకాణం మనిషిని పరిచయం జేసిండు. నాటుకపు సామాన్లన్ని అక్కడనే కాతా పెట్టిచ్చిండు.



పంతులే సిరిసిల్లకు పోయి గోరేమియ్య దగ్గర మైకును కిరాయికి తెచ్చిండు. పల్లీల ఆర్మోని పెట్టెను పట్టుకొచ్చిండు. మైకులో ఊరంతా చాటింపు వేయించిండు. స్టేజి నేలమీద కాకుండా పెద్ద పీటలమీద వేయించిండు. రూపాయి టికెట్టు పెట్టించిండు.

ఇట్లా చెయ్యడం ఇదే మొదటిసారి. మేముగాదు. ఇంతకుముందు మా ఊర్లె ఎవలు గూడా ఇట్లా పీటలేసి మైకువెట్టి ఆడలేదు. ఒక్క సురభి నాటకపోల్లు నిజామాబాదుల ఇట్ల జేసింద్రట. అదీ మా కొండయ మామనే అందరికి చెప్పిండు. అంత ఇంత అనిపేరున్న గోత్రాలోల్లు గూడా నాటుకాన్ని ఇట్లా ఆడాలేదు. కరంటు బుగ్గలు పెట్టి రంగు కాయిదాలు బుగ్గలకు కదుదురు. అంతే!

మాకు అన్నీ కొత్తగా గమ్మతిగా ఉన్నయి. చెప్పింది చేయడమే తరువాయి. ఇదేంటిది అదేంటిదని అడుగుతలేము. చెప్పినా మాకేం తెలువదిగదా! ఊరువాళ్లకు గూడా ఇదో ఇచ్చంత్రమయింది. ఎక్కడ చూసినా మా గురించే చర్చ. సగం ఊరు మా స్టేజి చుట్టే ఉన్నరు. పంతులును మెచ్చుకుంటంద్రు.

ఇన్ని మెరుగులు చేసినంక జనం చూడకుండా ఉంటరా...? ఊరుకు ఊరు కదిలింద్రు. గడీల పట్టనేలేదు. ఆట పూర్తయ్యేదాక నిలబడి చూసింద్రు. వారం రోజులు ఆగి మళ్లీ అదే ఆటను ఆడినం మొదటికంటే ఎక్కువే వచ్చింద్రు జనం. ఖర్చులు పోను రెండు వందలు మిగిలినయి. నాటకమంటే ఇట్లా ఉండాలన్నరు.

మాకంటే పంతులుకే ఎక్కువపేరచ్చింది. ఇప్పుడు పున్నయ్య పంతులంటే తెలువనోల్లులేరు. 'అరె...మనిషి సూత్తే అంత రుబాబేం లేదు గనీ ఏం జేసిండయ్యా! ఇందరు వచ్చింద్రు పోయింద్రుగనీ ఇట్ల ఎవలకు కుదురలేదు' అన్నరు.

గాలి వచ్చినప్పుడే ఎగవొయ్యాలె గదా! నాలుగు రోజులాగి టికెట్లు వెట్టి మల్లా మాయసుభద్రనే ఆడినం. మా మొఖం మీద కొట్టినట్టు ఒక్కపురుగు రాలేదు.

# తెల్లారెదాక ఉంటేగదా

శాలపున్నయ్య పంతులు ఎప్పుడైతే మాకు 'మాయ సుభద్ర' నాటకం నేర్పిండో అప్పుడే మామాల్లెంకు ఒక గుర్తింపు నిలుకడ వచ్చింది. మూటి ఇంకా పెరిగింది. మేము ఆడిన ఆటల్లో బాగా వచ్చింది కూడా ఇదే! ఊరు ఊరంతా మమ్ముల్ని పొగుడుతంద్రు. తొవ్వపొంటి పోతుంటే బీడీలు జేసే ఆడోళ్లు మర్రిమర్రి చూస్తంద్రు. గోజలగాసే పొల్లగాండ్లయితే మాపాటలే పాడుతున్నరు. ఎప్పుడన్నా చేనుదిక్కో చెలకదిక్కో పోతే మా పాటలే వినిపిస్తన్నయి.

మాయ సుభద్రలో అందరి ఏశాలు ఒక ఎత్తయితే అర్జునుని ఏశమేసిన పెంటయ్యది ఒక ఎత్తు. ఇద్దరు ముగ్గురు ఆడోళ్లు ఎంబడే పడ్డరట. లోపల లోపల ఏం జరిగిందో గనీ పెంటయ్య పెండ్లాం అలిగి అవ్వగారింటికి పోయిందట. మా కొండయమామను ఎవలో ఆడిమనిషి అటకాయించిందట. మామ నాలెకు మొఖమేసుకుని వత్తుంటే తమ్మలపాకు ఏసుకుని మీద ఊంచిందట.



'ఎవతిరా ముండ...దానిపేరు జెప్పు బూరెంటికెలు కొరిగిత్త' అని మా లస్మవ్వ అన్నది. మామనే నోరు ఇప్పలేదు.

ఇంకోసారి ఇదే ఆటను ఆడాలని అందరికీ ఉంది. 'ఆడిన ఆటనే ఇంకోసారి వద్దు' అని మా పంతులు చెప్పిండు. మాకు గూడా నిజమే అనిపించింది. ఇక్కడగాక పోయినా ఎక్కడైనా ఇంకో ఆట వెయ్యాలనే పట్టుదలతో ఉన్నం.

"అయితే ఈసారి రాజన్నపేటల నాటకమేద్దాం. అక్కడ ఇంతవరకు నాటుకమే ఎయ్యలేదట. మస్తుపైసలస్తయి. ఇంకోనాలుగు రోజులైతే కోతలు వడుతం. అప్పుడు తీరికదొరుకది". మా దాసు చిన్నాయిన రెండురోజుల్లోనే ఒకవార్త తెచ్చిండు.

అందరూ సరేనంటే సరే అనుకున్నరు.మేము ఇంతవరకు మాఊర్లో తప్ప వేరే ఊర్లో నాటకం వెయ్యలేదు. అందుకే అందరికీ సంబూరంగా ఉంది. పంతులు గూడా సరేనన్నడు. ముందుగా ఎక్కడవేస్తే బాగుంటదో చూసి రావాలన్నడు.

పంతులు చెప్పినట్టుగనే మా కొండయ మామ, చిన్నాయిన రాజన్నపేటకు పోయి ఆడేందుకు అనువైన స్థలాన్ని చూసి వచ్చింద్రు. వస్తూ వస్తూ పటేలును, పట్వారిని కలిసి పర్మీషను గూడా అడిగివచ్చింద్రు. అక్కడ గూడా మాఊర్లె గడిలెక్కనే ఒకపెద్ద గడి ఉందట. సుట్టూ గోడలుండి ముందట పెద్దపాటాకు ఉందట. అక్కడ వేస్తే మంచిగుంటదన్నరట. నిజంగా ఎప్పుడో ఒకటి రెండు తప్ప ఆ ఊర్లె నాటుకమే వెయ్యలేదట.

అక్కడ గనుక ఖర్చుల మందం పైసలు వస్తె అట్లనే గొల్లపెల్లి, బొప్పాపూర్, కిష్టంపల్లి, కోరుట్లపేట, గుండారంల గూడా నాటకం వేద్దామనుకున్నం. మా పంతులు గూడా సరే అన్నడు. అందరం తయారయినం.

'మాయ సుభద్ర'ను మూడురోజుల రియార్సల్ చేసినం. స్టేజివేయడానికి పదిపన్నెండు ఎలిత బొంగులు పొడువైనవి జమచేసినం. మైకును కిరాయికి తెచ్చినం. ఎవరిపెట్టెను వాళ్లు సదురుకున్నం. తబలాలు, పరుదాలు ముల్లెగట్టుకున్నం. సైకిండ్ల మీద బయిలెల్లినం.

సైకిండ్లు లేనోళ్లు పెట్టెలను నెత్తిమీద ఎత్తుకుని "ఎంతసేపు నడుత్తం ఆమెడ తొవ్వ. గొల్లపెల్లిదాటితే అయిపాయె" అనుకుంటా కాలినడకన ముందే బయలు దేరింద్రు.

ఆరోజు ఆదివారం. నాకు బడిలేదు. అందుకని పొద్దున్నే మా మామతోని సైకిల్మీద బయిలెల్లిన. అవసరం లేకపోయినా నేనుగూడా ఒక పెట్టెను కొనుక్కున్న. అందులో సగంకంటే ఎక్కువ మామ సామాన్లే ఉన్నయి. ఎవల పెట్టెల సామాన్లు పట్టకపోయినా దాచిపెట్టుమని నాకే ఇత్తురు.

రాజన్నపేటకు చేరుకునే వరకు పగటియాల్ల దాటింది. గడీల యాపచెట్టుకింద సామాన్లు దింపినం. అప్పుడే కనిపించింర్రు మా మనుషులు. చుట్టాల ఇంటికి పోయివస్తమని ఎక్కడోళ్లు అక్కడ మాయమయింర్రు. మామ, చిన్నాయిన, నేను ఇంకో ఇద్దరు ముగ్గురం మిగిలినం అంతే!

గడి పెద్దగనే ఉంది. మా ఊర్లె ఉన్నట్టే నాలుగు గోడలు, పాటాకు. స్టేజివేయడం మొదలు పెట్టినం. పీటలు అడుక్కచ్చినం. ఎలితె బొంగుకట్టెలు పాతి పరదాలు కట్టినం. పక్కనే ఉన్న ఇంట్లోంచి కరంటు తెచ్చినం. మైకును మోగిద్దామంటే మాకు ఎవ్వలకూ దానిసంగతి తెలువదు. మాపంతులే రావాలె. మైకుమోగాలె. పంతులేమో పొద్దుగూకేటప్పుడు వస్తానన్నడు.

అటో ఇటో పొద్దుగూకింది. పంతులు ఇంకా రాలేదు. మేము నాటకం ఆడుతున్నట్టు ఊర్లె తెలువాలెగదా! మైకుంటే అందులో చెప్పుదుంటిమి. ఎట్లా తెలువాలె..? మామ చిన్నాయిన ఏదో బదులుకున్నరు.

దాసు చిన్నాయిన రెండు తబులాలను తాడుకు కట్టి నా మెడకు వేసిండు. తాను పుంగీ పట్టుకున్నడు. తప్పడ తప్పడ కొట్టుకుంట ఊరంతా తిరిగినం. నాటకం ఆడుతున్నమని చిన్నాయిన పుంగీలో చెప్పిండు. ఊరంతా తిరిగి వచ్చేసరికి పంతులు వచ్చిండు. మైకు వెట్టిండు. గాజుల కిష్టయ్య 'గాజులు గాజులు' పాటల రికాడు వేసిండు. అప్పటికి చుట్టాల ఇండ్లల్లకు పోయిన మామనుషులు రానేలేదు.

చీకటి పడుతుంది. ఏశాలు వెయ్యాలెగదా! పంతులు మైకులో 'మల్లారెడ్డిపేట నాట్యమండలి సభ్యులు ఎక్కడున్న రావాలి. భీముని మల్లారెడ్డిపేట నాట్యమండలి సభ్యుల....అని' చెబుతండు మైకు గర్‌గర్‌మంటుంది. ఒకమాటను మింగి ఇంకోమాట వస్తంది.

ఇక మాసంగతి. ఆ ఊర్లె మాకు ఎవలూ చుట్టాలు లేరు. పొద్దున తిన్నతిండి. ఆకలయితుంది. మా దాసు చిన్నాయిన తెలివైన మనిషి ఎవరినో ఒక గిన్నె అడుక్కచ్చిండు. ఎవరినో బియ్యం అడుక్కచ్చిండు. స్టేజివెనుకనే పొయ్యిపెట్టిండు. అద్దగంటల అన్నం వండిండు. ఒకరిని మామిడికాయ తొక్కు, ఒకరిని ఇస్తార్లు అడుక్కచ్చిండు. నాకు పంతులుకు మామకు అన్నంబెట్టిండు. తానుగూడాతిన్నడు. అప్పుడు ఒక్కొక్కలు దిగింర్రు మా మనుషులు. పెట్టెలతాళాలు తెరిచి సామన్లు తీసింర్రు. అందరు మేకప్ మీద కూసున్నరు.

నాటకం ఉన్నదని రూపాయి టికెట్టని మైకులో చెప్తున్నం. టికెట్లు పట్టుకుని పంతులు, నేను గేటుముందు నిలబడ్డం. ఏశాలు ఏసేటోళ్లు ఏస్తనేఉన్నరు. మైకుల పాటలు



నడుస్తనే ఉన్నయి. ఒక్కపురుగు రావడంలేదు. ఏడు...ఎనిమిది...తొమ్మిది దాటింది. ఏశకాళ్ళు ఏశాలమీదనే లోపలికి బయిటకు తిరుగుతుంర్రు. మేము టికెట్లు పట్టుకుని అటూ ఇటూ తిరుగుతున్నం.

చూడడానికి ఎవ్వరూలేరు. మేమంతా పరేషాన్ అయితన్నం. "ఆట త్వరలో ప్రారంభంకాబోతుంది. తొందరగా రావాలి ఆలోచించితే ఆశాభంగం. రండి.. చూడండి... చూసి ఆనందించండి. మంచి తరుణం మించిన దొరుకదు. బ్రహ్మాండమైన నాటకం మాయా సుభద్ర" అని పదేపదే మైకులో చెబుతున్నం.

చూస్తుండంగ, చూస్తుండంగ ఒక నలుగురు వచ్చింర్రు. మాకు కొద్దిగా ధైర్యమచ్చింది. 'జనం వస్తంర్రురా! ఇగ ఆగరు' అనుకున్నం. వచ్చినోళ్లు టికెట్టు కొనకుండానే చూస్తమంటరు. ఎందుకంటే స్టేజికి వేసిన పీటలు వాళ్లు ఇచ్చినవేనట. టికెట్టు కొనుమంటే మా పీటలు మాకియ్యిమంటరు. సరేననుకుని వాళ్లను టికెటు లేకుండనే పంపినం.

తర్వాత నలుగురు పటేండ్ల జీతగాళ్లట. పటేలు తర్వాత వచ్చి పైసలిస్తనన్నడట. వారిని గూడా పంపినం. తర్వాత నాలుగైదు టికెట్లు అమ్ముడయినయి. అంతే! ఒకలు బియ్యమిచ్చినమని, ఒకలు కరెంటు మాదేనని, ఒకలు గడీల కావలి ఉంటనని, ఒకలు పట్వారీ పంపిండని, కొందరు మా సుట్టాలు ఉన్నరని, ఒకలు తొక్కుపెట్టినమని ఒకలు గిన్నెలిచ్చినమని... ఇట్లా సగం పెరడు నిండింర్రు.

కలెక్షన్ మాత్రం పన్నెండు రూపాయలే! పంతులు నేనూ నోరు తెరిచినం. లోపలున్న ఏశకాళ్లకు ఏం తెలుసు. 'అరే...మస్తుమంది నిండుతున్నరురా' అని మురుత్తంర్రట.

అసలు విషయం తెలిసినంక ఆటను ఆడాలా వద్దా అన్న డైలమాలో పడినం. అటువంటి ఆపద సమయాల్లో మంచి సలహాలిచ్చేది మా కొండయమామనే! 'ఇప్పుడు ఆట ఆడకుంటే బాగుండది. ఎట్లాగో వచ్చినం. ఏశాలుగూడా వేసినం. గేటుతెరిచి ఫ్రీగా ఆడుదాం. రేపు ఇంకొకటి ఆడుదాం. ఈరోజు మంచిగున్నదని రేపైనా టికెట్టు కొంటరు' అన్నడు మామ.

అందరికీ నిజమేననిపించింది. ఏంజేద్దాం. ఆడక తప్పదిగదా అనుకున్నం. వెంటనే మైకులో వట్టిగనే ఆడుతున్నమని రెండు మూడుసార్లు చెప్పినం. గేటు మొత్తం తెరిచినం. ఫ్రీగా అనేసరికి పదినిమిషాల్లో గడి మొత్తం నిండింది. మాకు విచిత్రమనిపించింది. ఇంతమంది ఇంతసేపు ఎక్కడ దాక్కున్నరా అనిపించింది.

మేము ఫ్రీగా ఆడుతున్నమన్న విషయం తెలిసినంక మొదలు టికెట్టు కొన్నవాళ్లు మా పైసలు మాకిత్తరా లేదా అని వచ్చింర్రు. ఇలా వస్తరని మేము ఊహించలేదు.

మొదట ఇయ్యనే ఇయ్యమన్నం. వాళ్లు లొల్లి మొదలువెట్టిండ్రు. 'పన్నెండు రూపాయలతోని ఎందుకులొల్లి, ఇచ్చివేద్దాం' అనుకున్నం. కానీ అమ్ముడైనయి పన్నెండు టికెట్లు. వచ్చింది ముప్పయి ఎనిమిది మంది.

ఎవలు కొన్నరో ఎవలు కొనలేదో తెలువలేదు. మేము కొన్నవాళ్లకు పాసులు గూడా ఇయ్యలేదు. అందరం టికెట్లు కొన్నమని వాళ్ళు. పన్నెండుమందే కొన్నరని మేము. చెప్పింది అసలే వినరు. అందరికీ పైసలియ్యాలంటరు. కల్లు తాగినట్టున్నరు. ఏదేదో వదురుతున్నరు. పెద్దకొట్లాట జరిగింది. కొండయ మామకు తిక్కలేసింది. ఒకన్ని గల్లవట్టి కొట్టిండు. వాడు మామ ఇద్దరు కలెవడ్డరు.

పెద్దబొబ్బ. ఆట క్యాన్సలయింది. మేము పైసలు ఎవ్వలకియ్యమని తెగేసి చెప్పినం. ఎట్ల ఇయ్యరో రేపు పొద్దున చూస్తం మీ సంగతి అన్నరు. పొద్దున దాక మేము ఉంటే గదా చూసేది అని మేము అనుకున్నం. ఆట ఈ రోజు ఆడం. రేపు ఆడుతమని మైకుల చెప్పినం.

అందరు ఎక్కడోళ్లు అక్కడ పండుకున్నంక పరుదాలు ఇప్పుకుని సైకిండ్లు ఎక్కినం. మంటరమంట బలబల తెల్లారంగ ఊరికివచ్చినం. వట్టిగనే ఆడుదామని సలహా ఇచ్చినందుకు కొండయ మామను పంతులు కోప్పడ్డడు.

తెల్లారి అక్కడుంటే మాత్రం మమ్ముల్ని బొక్కలిరుగ తందురట. ఎందుకంటే మామ గల్లవట్టి కొట్టింది పటేండ్ల జీతగాన్నెనట. 'నా జీతగాని మీద చెయ్యివేసినోడు ఎవడు. వాన్ని కొడితే నన్ను కొట్టినట్టే' అని పటేలు మీసాలు వడివెట్టిండట. తెల్లారకముందే పదిరువై మందిని ఎంటేసుకుని మా కొరకు గడీలకచ్చిండట.

ఈ విషయం సుట్టాల ద్వారా మాకు తెలిసింది. మల్లా రాజన్నపేట అని యాది చెయ్యకుంట అయింది. అంతట్లకే కోతలు మొదలయినయి. మనిషికి మనిషి దొరుకకుంటయిండ్రు ఎవలంతల వాళ్లు పనులమీద పడ్డరు.



# అల్లీరాణికి మీసాలున్నయి

ఉమాపతిరావు పంతులు తండ్రిది యడాది దినం. పంతులుకు ఒక్కడే కొడుకు. పట్నంల పెద్దకొలువు మీదున్నడు. తండ్రి చచ్చిపోతే ఊర్లెనే కర్మకాండ చేసిండు. యాడాది దినం కూడా ఊర్లెనే చేస్తండు. సావు, కర్మ అన్నీ ఊర్లెనే చెయ్యాలెనని తండ్రి ముందే చెప్పిండట.

ఉమాపతిరావు మా పంతులును పిలిపిచ్చి 'మానాయిన పేరు మీద ఆట ఆడుండ్రి' అన్నడట. అది ఆయిటిమూనిన దినం. వానమీద వాన మూడు వానలు పడ్డయి. ఎద్దుకో నాగలి కట్టిండ్రు. తిందామన్నా తీరనిదినం. పునాసలు దున్నుతున్నరు. మనిషికి మనిషి దొరుకుతలేదు.

మేము అంతకు ముందే 'అల్లీరాణి' ఆట నేర్చుకుని ఎండకాలంలో రెండుసార్లు వేసినం. ఆట మంచిగ కమ్మింది. నాలుగు వందలపైనే రూపాయలచ్చినయి. అంతవరదాక మాకు సూపు పరుదాలేదు. సైడు పరుదాలు లెవ్వు. ఒక్కటె పెద్దది తెల్లబట్ట ఉన్నది అంతే!.

ఈ పైసలను మనిషికిన్ని పంచుకుందామని కొందరన్నరు. పంచుకొని బంగ్లా కడుతమా! వద్దు. పొత్తులది పొత్తులనే సామాన్లు కొందామన్నడు మామ. నూటయాభై ఇచ్చి సూపు పరుదా మీద రామ పట్టాభిషేకం బొమ్మను అద్దిచ్చినం. తబులాలు ముడిపిచ్చినం. రెండుకొత్తయి తాళాల జోళ్లు కొన్నం. రాజు ఏశానికి రెండు షేర్వాన్లు కుట్టిచ్చినం. విగ్గులు గడ్డాలు కొంతమేకప్ సామాను కొన్నం. సైడు పరుదాలు కొన్నం. రూపాయలు మొత్తం ఖర్చుయిపోయినయి.

అన్ని ఖర్చుయినంక యాదికచ్చింది మాకు. ఈ పైసలకు ఇంకకొన్ని కలేసి మైకు కొంటే మంచిగుండునని. కాని ఏంలాభం. చెరువుల నీళ్లు చెరువెనుకపడ్డట్టయింది. మేము ఇట్లా బాధ పడుతుండంగనే చల్లటి ఈ వార్త తెచ్చిండు మా పంతులు.

“పట్నం పంతులు ఆటాడుమంటున్నడు. వాళ్ల నాయినది యాడాది దినమట. మైకు కొనిస్తడట. ఇంత మంచిమోకా దొరుకది” అన్నడు మాపంతులు.

“ఎట్లాడుతం. పుట్టెడు పనుంది. ఎంత నోటికచ్చినా రెండు రియార్సల్లయినా ఎల్లదియ్యాలె. ఎవలు రమ్మన్నా రారు” చిన్నాయిన అన్నడు.

ఆట ఆడితే నలుగురు మెచ్చేటట్టు మంచిగనే ఆడాలెగనీ ఆగమాగం వద్దంటడు చిన్నాయిన. మా చిన్నాయిన మాటగూడా నిజమే! అల్లీరాణి ఏశం ఏసే తెనుగుమైసయ్య పటేండ్ల శాతల జీతమున్నడు. పగడసేన గోజలకాడ జీతం. అర్జునుడు దుక్కి దున్నుతుండు. శ్రీకృష్ణుడి ఏశమేసే నారాయణ గూడా జీతమే ఉన్నడు. నాటుకం ఆడుకుంట ఉంటే జీతముంచుకున్నోళ్లు ఓర్వరు. పనిలనుంచి తీసేత్తమంటరు. ఎట్లా..?

“ఎట్లన్న చెయ్యిండ్రి. ఆటమాత్రం ఆడాలె. యాడాది దినం. వారంరోజులుంది. అందరు కలుపుకోండ్రి. మైకు కొనిత్తన్నడంటే మాటలా” పంతులు మా దాసు చిన్నాయిన్నకు కొండయ మామకు చెప్పిండు.

రెండురోజులు తిండి లేకున్నా సరేగనీ ఆట ఉండాలంటడు మా మామ. కొత్త మైకు వత్తదని అందరిని ఊరిచ్చిండు. ఎట్లనన్న రెండురోజులు కష్టపడితే మైకుకొనడం తప్పుతుందని అందరికి నచ్చజెప్పిండు.

ముందుగా కొందరు వద్దన్నా చివరకు అందరం ఒప్పుకున్నం. తెనుగు మైసయ్యకు ఒక్కనికి మాత్రం కలువకుంట వచ్చింది. వాళ్ల పటేలు బిడ్డ అమ్మగారింటికాడ పెద్దమనిషి అయిందట. ఆరోజే కచ్చురం గట్టుకుని పలారాలు కొండబోవాలెనట. అసలు మేటి ఏశం అల్లీరాణి ఆయినదే! మైసయ్య అల్లీరాణి ఏశమేసిండంటే టేటర్ గడగడ వణుకాలె. ఆ యాక్షన్ ఇంకొకరికి కుదురది. మైసయ్య ఊరికిపోక తప్పదు. ఆయనకు పటేలంటే



సచ్చేంత భయం. ఎట్లా..? మాకు మనుసున వట్టలేదు. ‘రెండు ఒక్కటే సారి రావాలెనా’ అనుకున్నం.

మా కొండయమామ పటేలును కలిసి బతిలాడిండు. ‘పటేలా! మైసన్ని ఎట్లన్నా ఒక్కరోజు ఇడిసిపెట్టుండ్రని’ చెప్పిండు. ‘ఊరికి చేరంగనే పంపిస్త ఎయ్యిండ్రి’ అని పటేలన్నడు. మా మురిపెం చెప్పరాదు. రియార్సల్ మొదలు పెట్టినం. మేకప్ సామాన్లు రెడీ చేసుకున్నం.

మాకు ఇంకొక భయంగూడా పట్టుకుంది. ‘ఒకవేళ ఆరోజు వానగట్లా కొడితే ఎట్లా!’ అని. ‘కొడితే కొట్టని మనమేం జేద్దాం. మైకు పైసలైతే వస్తయి. వానకొడితే మా తప్పు కాదు గదా!’ అనుకున్నం.

అనుకున్న రోజు రానేవచ్చింది. ఒకదిక్కు దున్నుడుపని. మరోదిక్కు రియార్సల్. రెండు దినాలు నిద్రవోకుండా ప్రాక్టీస్ చేసినం. జీతగాళ్లకయితే అది అగ్గిపరీక్ష. కూరుకురాత్రి దాకా దొడ్డికాడనే. మళ్లీ కూరుకుపొద్దుకు దొడ్డికాడికే. నిద్రవోను టయిమే లేదు.

అక్కడికి ఊర్లె మమ్ముల్ని “కాలం నడినెత్తి మీదికచ్చింది. పని ఉన్నది. బాగోతం ఇప్పుడు ఆడుతార్రా” అని తిడుతున్నరు.

‘మనకు పనిలేనినాడు యాడాది దినం చెయ్యిమంటే చేత్తడా పంతులు” అని మేముగూడా సదిరి చెప్పుతున్నం.

మా అందరి ఆగం ఒక్కటే. ఊర్లె ఉన్న మేము ఎట్లనో యాల్లకువస్తం. వేరే ఊరుపోతున్న మైసయ్య ఎట్లరావాలె అని! మైసయ్యకు పోయేటప్పుడు పదేపదే చెప్పినం. వెంట పటేలుగూడా ఉన్నడు. పటేలుకు గూడా చెప్పినం. ఇద్దరూ సరేనని తలుకాయ ఊపిండ్రు. వాళ్లు పోయేది మద్దికుంటకు. ముస్తాబాదు దాటిపోవాలె. ఏంలేదన్న పదిమైళ్లు.

పొద్దుగూకే జాముల బైలెల్లినా ఆటకు అందుతడు. మొదటి ఏశం ఆయనదే. పటేలు నమ్మకంగా తోలిత్తనన్నడు. మైసయ్య నమ్మకంగా వత్తనన్నడు. పొద్దున్నే సవారు కచ్చురం కట్టుకుని పలారాలు తీసుకొని పిల్లాజెల్లా అందరు పోయిండ్రు.

మేము ఉమాపతిరావు పంతులు ఇంటిముంగట స్టేజి వేసినం. ఇంట్లనుంచి కరెంటు గుంజినం. ఏశాలేసుకుని రెడీ అయినం. మైసయ్య కొరకు ఎదురుసూత్తున్నం. మైసయ్య జాడలేదు పత్తలేదు. అటు జూడ ఇడు జూడ కూరుకు రాత్రి దాటింది.

“ఏమాయె ఇంకా ఆడరా. నడిజాము రాత్రి మొదలు వెడుతరా” అని జనం బొబ్బవెడుతండ్రు.

నిజానికి మైసయ్య యాల్లపొద్దున్నే ఎల్లిండట. వస్తూ వస్తూ పటేలుకు చెప్పిపోదామని ఇంట్లకు పోయిండట. పటేలు "అరే మైసా జల్దిన పోతవు. మా బామ్మర్దిది సైకిలు తీసుకపోరా" అని సైకిలు ఇచ్చిండట.

మైసయ్యకు సైకిలు ముట్టరాదు. పట్టరాదు. తొక్కరాదు. ఆ ముచ్చట అక్కడనే చెప్పితే అయిపోయేది గదా! పటేలు ఏమంటడో అని భయపడ్డడట. సైకిలు మెల్లె మెల్లెగా నూక్కుంట ఊరు దాటిండట. అప్పటికే మూడుసార్ల బొక్కబోర్ల వడ్డడట. కాళ్లకు సైకిల్ పైడితట్టి కాళ్లు కొట్టుక పోయినయట. సైకిలిని నూక్కుంట నడువత్తలేదట.

ఇగ ఇట్లగాదు అట్లగాదు అని తువ్వాల సుట్టబట్ట చేసుకుని సైకిలిని నెత్తిమీద ఎత్తుకున్నడట. మెల్లె మెల్లగ తొవ్వవట్టిండట. నెత్తిమీద సైకిలాయె. ఎట్ల నడువత్తది. ఊర్లెకు వచ్చేవరకు నాన్లు సల్లవడ్డయి సల్ల చెమటలు పుట్టినయి. దెబ్బతలిగి కాళ్లు నొప్పి వెట్టినయి. రెండు గంటలు నడిచే తొవ్వ నాలుగు గంటలు పట్టింది.

ఇగ ఇక్కడ మైసయ్య కొరకు చూసి చూసి ఆశ సాలిచ్చుకున్నం. వాడు రాడనుకున్నం. అల్లీరాణి పాటలు పద్యాలు వచ్చేది మా పంతులుకు ఒక్కనికే! ఈ ఆట మాట్లాడింది కూడా ఆయన్నే. అందుకే ఎట్లా పంతులు మాకు ఇప్పుడు నువ్వేదిక్కు. ఎట్లయినా అల్లీరాణి ఏశం నువ్వే ఎయ్యాలె. ఎట్లనో ఎల్లదియ్యాలె'. అని ఆటనేర్పిన పున్నయ్య పంతులును బతిలాడినం.

ఆయన ఒప్పుకున్నడుగనీ మీసాల దగ్గర తకురారచ్చింది. ఆయన మీసాలు గుబురుగా పెద్దగుంటయి. వేసేది ఆడివేశమాయె. మీసాలతోనే ఏశమేత్తనంటడు పంతులు. ఎంత చెప్పినా వినడు. మీ ఇష్టం. 'ఎయ్యిమంటే ఏత్త. వద్దంటే ఊకుంట. అంతేగనీ మీసాలు మాత్రం తియ్య. నన్ను సతాయించకుండ్రి" ఖచ్చితంగా అన్నడు పంతులు. చేసేదిలేక మేము సరేనన్నం.

పంతులు అల్లీరాణి ఏశంగట్టిండు. అల్లీరాణిని చూసి జనాలంతా ఒకటే నవ్వుడు. 'అల్లీరాణికి మీసాలెందుకురో' అని ఒక్కటే కీకెలు. బొబ్బలు.

నిజంగా అల్లీరాణికి మగవాళ్లంటే కోపం. అసలు పెండ్లే చేసుకోనంటది. కృష్ణుడు మాయజేస్తడు. చివరికి ఆమెను లొంగదీసుకుని అర్జునుడు పెండ్లి చేసుకుంటడు.

మాపంతులు బలే ఉషారు మనిషి. 'నేను పురుషద్వేషిని. పురుషునిలా నాకుమీసాలు ఎందుకు ఉండకూడదు? అందుకేపెట్టుకున్న. పురుషుడి కంటే నాకేం తక్కువ' అని ఎగురుకుంట అన్నడు.

జనం తక్కువ తిన్నరా..? అంతకుముందే మా ఆటను చూసిన వాళ్లయిరి.



"మొన్నలేని మీసం ఇయ్యాల్ల ఎక్కడిదిరా ఆడిదానికి మీసాలుంటాయిరా... నీ భాగోతమవ్వని...." బూతుమాటలన్నరు.

"నీ ఆటింట్ల పీనుగెల్ల. అల్లిరాణికి మీసాలుంటాయిరా" అని ఆడోళ్లు తిడుతున్నరు.

పంతులు ఎవలమాట ఇంటలేడు. పాడేది పాడుతుండు. 'ఏ..పగడసేనా ఎక్కడున్నావే' అంటూ దుంకేది దుంకుతున్నడు. జనం మాత్రం తిట్టెది తిడుతున్నరు.

అట్లనే ఉంటే తర్వాత ఏం జరిగేదో గనీ అప్పుడే సైకిలు మైసయ్య దిగిండు. మాకు పాణమచ్చింది. పరుదాసాటుకు తోలుక పోయినం. వాడు సైకిలు కతంతా చెప్పిండు. కొట్టుకపోయిన కాళ్లను చూపిండు. రక్తాలు కారుతున్నయి. నడువత్తలేదు పాపం.

"నీ కతలు రేపు చెప్పుదువుగనీ ముందుగల్ల ఏశం గట్టు" అని గద్దిరిచ్చిండు మామ.

ఒకడు రంగు పూసిండు. ఒకడు విగ్గుపెట్టిండు. అత్తరో బుత్తరో ఒకడు చీర చుట్టిండు. అట్లనో ఇట్లనో ఏశం గట్టుకుని వచ్చిండు మైసయ్య. కాళ్లు నొప్పి వెట్టినయిగదా! కుంటుకుంటా నడుత్తండు మైసయ్య.

"అరేయ్..అల్లీరాణి కుంటుతున్నదేందిరో.. పయ్యబెండయిందా. సక్కగ నడువుమనురో" మల్లా కీకెలు, బొబ్బలు. సక్కగ నడువుమంటే ఏం నడుత్తడు. మన్నా మషాడమా!.. కాళ్లన్ని కొట్టుకపోయి మంటలు పుడుతున్నయి. రక్తాలు కారుతున్నయి. వానవత్తే ఆట బందయితదని వాన రావాలెనని మొక్కినం. కానీ సుక్కలు పొడిచి ఎన్నీల గాశింది. మొదలు మొదలే ఆట పేలయింది.

అంతకు ముందు మంచిగ ఆడితిమి. ఈ కుంటుడు మెంటుడు ఆట చూసి అందరూ ముక్కు ఇరిసింద్రు. అందరితో పాటు పట్నం పంతులు గూడా ముక్కిరిసిండు. మీరు మంచిగ ఆడలేదని నూటపదార్లిచ్చి చేతులు దులుపుకున్నడు. దొరలకాందానాయె. నోరెత్తి అడిగి బతుకుతమా! ఆ మంట ఈ మంట మైసయ్యను తిట్టినం.

# వానగొట్టింది

మగకు మక్కకు పగ. ఎందుకంటే మగకార్తిల వానలు కొడితే బాగనే కొడుతయి. లేదంటే కార్తిమొత్తం వాన చినుకురాలది. అప్పటికి మక్కచేన్లు తలజుట్లు ముదిరి పీసులు ఎల్లుతుంటయి. ఒక్కొక్క కంకి జొన్న ఇత్తులోలే పాలువోసుకుంటది. ఆ టయముల వాన ఎక్కువైతే జౌకు గొట్టి కర్రలు బీరిపోతయి. పీసులు సువ్వవోతయి. అందుకే అంటరు. మగకు మక్కకు పగ అని.

మగకార్తి వచ్చింది. అంతదాకా రోజూ ముసురు వెట్టిన కాలం గుంజుకుంది. ఎండలు కొడుతున్నయి. పునాస భూములు గెరువయినయి. బబ్బెర, పెసర మక్క వాడిపోతున్నయి. కార్తి సగంపాదం దాకా ఎదురు చూసింద్రు. చినుకు పడలేదు. జనం పునాస పంటల మీద ఆశ వదులుకున్నరు.

వాన కొరకు శివుని గుడిల నీళ్ళు వోసింద్రు, కప్పతల్లి ఆడింద్రు. జడకొప్పులేసింద్రు. అయినా మొగులు మీద మచ్చుమైల లేదు. అంతకు ముందు మేము 'గంగ గౌరివ్రతం' యక్ష గానాన్ని సగం నేర్చినం. కాలం కలుపుకుని వాన మీద వాన రెండు వానలు కొడితే రియార్సల్ ఆపేసి పనుల మీద పడ్డం.

ఎప్పడైతే కాలం ఎనుక వడ్డదో అప్పడే మా మామ ముందట వడ్డడు. రియార్సల్ వున్నాలేకున్నా మేము రోజూ పంతులు ఇంట్ల పొద్దున్నో మాపునో కలుస్తం. ఒక్కనాడు పంతులు ఇంటికి పోకుంటే మనుసున వట్టది. ఏదో మరిచి పోయినట్టుంటది.

'వానలు పడుతలెవ్వు గదా! 'గంగా గౌరివ్రతం' ఆడుదాం. వానలు పడుతయి.' కొండయ మామ అన్నడు. ఆ ఆటను పూర్తిగా నేర్వలేదు. దాన్ని నేర్వాలంటే ఇంకో రెండు వారాలు కావాలె. అప్పటికి వాననో వరుదనో తెలువది. అయినా ఇప్పుడు వానలు కొట్టకపోతే మాత్రం పని తక్కువుందా. చెరువు కింద నాట్లు, దున్నుకాలు. పుట్టెడు పని.

'ఓ... కొండయా... నువ్వు లేంది పెట్టకు. అడ్డగోలు పనుంది. సత్తామన్నా తీరికలేదు. ఇప్పుడు నాటుకం మొగిచ్చిన వనుకో, ఇండ్లల్ల తిడుతరు. బురుదకు కాళ్లు పెచ్చినయి. అడుగు తీసి అడుగువెయ్యత్తలేదు" దాసు చిన్నాయిన అన్నడు.



కొందరేమో ఆడితే అడుదాం అంటున్నరు. కొందరేమో వద్దే వద్దంటున్నరు. ఆడుదాం అన్నవాళ్ళకంటే వద్దన్నోల్లే ఎక్కువున్నరు. అందరికీ పనుందని పంతులు గూడా వద్దన్నడు.

వీళ్లతోని నాటుకం ఎట్లన్నా వేయించాలని మామకు పట్టుదలగా వుంది. ఆ విషయం అప్పుడే అంటే ఎవలూ ఒప్పుకోరని తెలుసు. అందుకని ఓపిక పట్టిండు మామ.

మరునాడు ఒకలిద్దరు పెద్ద మనుషులతోటి 'గంగ గౌరివ్రతం నాటుకం మా చెడ్డది మామ. దాన్ని నేర్సుడు మొదలు వెట్టినమంటే ఆట ఆడే దాకా ఇడవద్దు. మధ్యల ఆపేసిన మనుకో... ఇదిగో ఇట్లా వాన చుక్కరాలది" అన్నడట మామ.

మేము 'గంగ గౌరివ్రతం' నేరుస్తూ కాలం నెత్తిమదికి రావడంతో ఇడిసి పెట్టిన సంగతి అందరికీ తెలువది. వాళ్లు వివరాలన్నీ అడుగక ముందే "మేము గంగగౌరి వ్రతం నేర్చినం గదా... నేను ముందే చెప్పిన. అటను నడిమిలకు వదిలేత్తే గంగమ్మ తల్లికి కోపమత్తదని. ఎవలన్నా ఇంటేనా... ఇప్పుడు చూడు కాలం ఎన్నీల గాత్తుంది. అది మొదలు వెట్టకపోయినా బాగుండు. నడిమిలకు ఎత్తేసి ఇప్పుడు పరేషాన్ కొచ్చె" అన్నడట మామ.

పెద్ద మనుసులు మమూలు మనుసులు గాదు. నోట్లె అవగింజ నానది. తలుపు వెట్టిచెప్పితే కొలువు వెట్టి వింటరు. ఈ ముచ్చటను ఊరు ఊరంతా ప్రచారం చేసింద్రు. 'కాలం ఎట్ల వోయిందో తెలుసునా...?' అంటూ మనిషి మనిషికి చెప్పుడు మొదలు వెట్టింద్రు.

ఈ ముచ్చట రెండే రెండు రోజుల్లో పంతులు దగ్గరకు చేరింది. ఏమీ తెలువనట్టు కొండయ మామ గూడా 'ఏంటిది పంతులూ... ఇట్ల పుకారు పుట్టింది... ఎక్కడన్నా ఆట ఆడకపోతే వానలు కొట్టయా..' అన్నడు పంతులుతో.

"ఏమోనోయ్... గట్ల పుకారు పుట్టింది. ఆటకు వానకు సంబందమే లేదు. ఆట ఆడకనే వాన కొడుతలేదట" అన్నడు పంతులు. అనుకున్నట్లే ఆ రాత్రి పంతులింటికి సుంకరోల్లు వచ్చింద్రు. పట్వారీ పోలీసు పటేలు ఇద్దరు కలసి పంతులును రమ్మని తోలింద్రట. పంతులు పోతూ పోతూ కొండయ మామను గూడా ఎంటవెట్టుక పోయిండట.

వాళ్లు ఆ ముచ్చట ఈ ముచ్చట మాట్లాడి గంగగౌరివ్రతం వెయ్యాలన్నరట.

మామ ఎట్ల జరుగుతుందనుకున్నడో అట్లే జరిగింది. పటేలు, పట్వారి పిలిచి చెప్పినంక తిరుగు వుంటదా...? మా పంతులే అట్ల గాదు. ఇట్ల గాదు అన్నడట. 'ఎట్లన్నగాని ఆడనైతే ఆడుంద్రి. అనుమానం పోతది' అన్నరట వాళ్లు.

"ఆడుదంటే వట్టిగైతదా పంతులూ... ఏం లేదన్నా దోసౌ తీన్ సౌ ఖర్చు" అన్నడట మామ.

పైసలకేందోయ్ సంగానికిన్ని వసూలు జేత్తం. మీరు ఆడనైతే ఆడుంఁడ్రి అన్నడట పట్వారి.

అన్నట్లుగనే రెండు రోజుల్లో కుల సంగాలను కూసుండవెట్టి సంగానికిన్ని వసూలు చేసిండు. రెండు వందల యాభయి ఆరు రూపాయిలు కొండయ మామ చేతుల వెట్టిండు పట్వారి.

మొత్తం మీద ఊరు ఊరంతా వానను మేమే అపినట్లు, ఈ నాటకంతో వాన పడుతదన్నట్టు ప్రచారం జరిగిపోయింది. అందరూ మా ఆట కొరకే చూస్తంఁడ్రు. ఏసేదేదో మక్కలు ఎండిపోకముందే ఎయ్యమని తొందరపెడుతున్నరు. ఇక మా సంగతి. అది పూర్తిగ నేర్చిన ఆట గాదు. పటేలు, పట్వారి భయానికి ఆడుతున్నం.

రెండే రెండు రోజులు కూసుండి రియార్సల్ చేసినం . పొద్దంతా పారట్లు బట్టీవెట్టినం. మైకు లేకుంటనే కశీరు కాడ బజారు లైటు కింద స్టేజీ వెయ్యాలనుకున్నం.

ఈసారి కిరీటాలు, భుజకీర్తులకు కొత్తపెల్లి పంతులుకు గుత్తకిచ్చినం. మప్పయి రూపాయలిత్తే కిరీటాలు, బాణాలు, భుజకీర్తులు తయారు చేత్తనన్నడు. పని తీర్పాటం దొరికితే మేమే చేసుకుందుము. ఇప్పుడు జెట్టన ఆడాలెగదా.

రెండు వారాలు రియార్సల్ చేస్తే తప్ప నేర్వని ఆటను రెండు రోజుల్లోపలే ఏం నేరుస్తం. ఏదో ఆడినమా అంటే ఆడినం అన్నట్టు ఆడాలనుకుని కచీరు కాడ శాందిరి ఏసినం.

మేము ఏ ఆట ఆడినా మేటి వేశకాళ్లు ఆట ఆడిన రోజు పొద్దున ఒక్కపూటే తింటరు. అంతే! ఎంత పని ఉన్నా. ఇంట్లో పండుగున్నా, చుట్టాలు వచ్చినా పగటియాల్ల, రాత్రిపూట అసలే భోజనం చెయ్యరు. భక్తి ఆటయితే నీచు కూడా ముట్టరు. తానం చెయ్యందే స్టేజీ దగ్గరకు రారు. కడుపు నిండా తింటే పాటలకు రాగం రాదు. రాగం తీస్తుంటే దమ్ము ఎత్తేసుకత్తది. అదే కడుపు ఖాళీగా వుంటే ఈ ఇబ్బందులుండయి. రాగం కాకపోతే రాగమస్తది.

ఈ దున్నుకాలు ఉన్నప్పుడు నాటుకం వెయ్యాలంటే భయం. ఆకలైతుంటది. తినడానికి మనసొప్పది. పానం సొలుగుతుంటది. కాళ్లు గుంజుక పోతయి. అయిన తప్పది కదా.



అటో ఇటో ఆట మోగిచ్చినం. పంతులు కామరెడ్డికి పోయి మేకప్ సామన్లు తెచ్చిండు. ఆట పూర్తిగా నేర్వలేదు గదా? హార్మోని గూడా తియ్యలేదు. తబులా తాళం మీదనే పారట్లు చేతపట్టుకుని రాని పాటను చూసుకుంట ఎల్లదియ్యాలనుకున్నం.

గొల్ల రాజంకు ఆకలి ఎక్కువ. ఎప్పుడూ ఏదో ఒకటి స్టేజీ దగ్గరకు తెచ్చుకునిఆట అయిపోంగనే తింటడు. ఒక్కొక్కసారి సద్ది కట్టుకచ్చుకుంటడు. ఆట అయిపోంగనే సద్ది తిన్నంకనే ఏశం ఇప్పుతుండె. అట్లా ఈ రోజు గూడా అటుకులు కట్టుకచ్చుకున్నడు రాజం. ముల్లెకు ముల్లె బట్టలల్ల చుట్టి పక్కన పెట్టుకున్నడు. గొల్ల రాజంది గంగ పాత్ర. గౌరి ఏశ మేసే కొప్పుల చంద్రం అటుకుల్ని గడికిన్ని బుక్కిండు.

గంగగౌరి ఇద్దరు వాదం పెట్టకునేటప్పుడు చంద్రం నోరు ఆడిచ్చి సప్పరిత్తుంటే రాజంకు అనుమాన మచ్చి ముల్లెను చూసిండట. అప్పటికే ముల్లె మొత్తం కతమయింది. అప్పుడే ఇద్దరు తన్నుకునే మోపయింఁడ్రు. స్టేజీ వెనుకనే కుత్తి వట్టింఁడ్రు.

మా కొండయ మామది శంకరుని వేశం. ఇద్దరికీ సముదాయించి చెప్పిండు. అయినా వినరు. ఆడో నేనో తేలిపోవాల్సిందే నంటరు. కొండయ మామకు కోపమచ్చింది. ఇద్దరిని ఎత్తుకపోయి స్టేజీ మీద దించిండు. ఇద్దరియి ఆడివేశాలే నాయె. స్టేజీ మీద కొంగుల కొంగులు గుంజుకున్నరు. ఒకల నొకలు వంగపెట్టి గుద్దుకున్నరు. చెవులు పిండుకున్నరు.

కొండయ మామ మాత్రం 'ఇద్దరు భార్యలుంటే ఇట్లనే ఉంటది. వాళ్ల తెరువువోతే నన్ను తంతరు అన్నడు. జనమంతా సముతిలద్దరు తన్నుకుంటంఁడ్రు అనుకుని నవ్వుడే నవ్వుడట. అటుకుల సంగతి జనానికి తెల్వది.

తర్వాత ఏం జరిగేదో గని అప్పడే వాన. యానంగ మొదలయిందో యానంగ తెప్ప లచ్చినయో గానీ ఉరుములేదు. మెరుపులేదు సల్లని వాన. జనం ఇండ్లల్లకు చేరేసరికే తోపుతోపు నానింఁడ్రు. మా పరుదాలన్నీ నానినయి. 'అరే ఇదేం చిత్రంరా ఆట ఆడితే వాన కొట్టనే కొట్టింది... రేపు ఊరు ఊరంతా మనను యాదిజేత్తరు' అనుకున్నం.

సూదు సూదు మంట ఆనాడు గొల్ల రాజం పొల్లు పొల్లయిండు. ఎప్పుడైనా ఆట పూర్తికాంగనే షాందిరి ఇప్పేసి సామాన్లు పట్టుకుని అందరి కందరు సోపతితోని పోదుము. ఇక్కడుంటే వానల తడుసుకుంట స్టేజి ఇప్పవదుతదని తప్పిచ్చుకుని ఇంటికి పోయిండు రాజం. అంతకు ముందే అటుకుల పంచాదాయె. అదో కారణం అనుకో.

పోతూ పోతూ అవుసులోల్ల ఇండ్లు దాటినంక గౌండ్ల దేవయ్య సందిల ఏదో లొల్లి ఇనవడితే అటు దిక్కుపోయిండట. దేవయ్య ఇంట్లనే బొబ్బ ఇనవడుతుందట. అన్న

దమ్ముల పంచాది అనుకుని 'అరేయ్ ఇంత రాత్రి ఏం కొట్లాడుతరురా... ఏదన్న ఉంటే పొద్దుగల్ల మాట్లాడుకోండ్రి' అంటూ లోపలికి పోయిండట. అప్పటికి వాన కొడుతనే వుంది.

పడ్డది దొంగలు. ఏది ఎక్కడ పెట్టినవని దేవయ్యను వడుకుతుండ్రట. నడీ వాన కాలమాయె. అప్పుడు దొంగలత్తరని ఎవలన్నా అనుకుంటారా...? రెండు కంకర రాళ్లు వచ్చి తలిగినయట రాజంకు. వావ్వ సత్తిరా... అనుకుంట ఒక్కటే ఉరుకుడట. అప్పటికి రాళ్లదెబ్బలు తాకి ఈపుల పచ్చెలు లేసినయట. ఆ దెబ్బ నెత్తికి గనుక తలిగితే పుర్రె పలుగుతుండెనట. అట్లా రాజం నాలుగు రోజులు ఇంట్ల నుండి లెవ్వలేదు. కొడుకు సచ్చి పుట్టిండని వాళ్ల అవ్వ ఒక్కటే ఏడ్సుడు.

ఇక తెల్లారి ఊరు ఊరంతా వానగొట్టిందని మమ్ములను మెచ్చుకుంటరనుకున్నం గదా. కానీ జనమంతా ఒక తిట్టుడు గాదు. ఎందుకంటే మేము నాటుకం ఆడక పోతెనే వానలు ఆగిపోయినయని జనానికి నమ్మకం కుదిరిపోయింది.

"మీరు చెయ్యవట్టే ఇన్ని రోజులు కాలం పోయింది. ఈ ఆట ఎప్పుడో ఆడినా లేకపోతే పూర్తిగా నేర్వకపోయినా ఇట్ల కాలం గాక పోతుండె. ఇప్పటికైనా సగమే ఆడిండ్రు ముందు ముందు ఎట్లయితదో" అన్నరు.

మాకు నాలిక సందుల ముల్లు ఇరిగినట్టయింది. 'ఏదైతే ఏంలే. మక్క కర్రలకైతే పాణమచ్చింది'అనుకున్నం.

అప్పటి నుంచి కాలం ఎనుక ముందైతే ఏమందురో గని వాన మీద వానలు వడ్డయి. వాగులు ఒర్రెలు పారినయి.



# కల్లుకుండల బాగోతం

ఆకుల నారగౌడంటే ఊర్లె పెద్దమనిషి. పేరు చెప్పితే హడల్. ఎనుకట నాటుకాలాడిండట. ఏ పంచాది జరిగినా ఆయినను పిలుచుకుంటరు. నారగౌడు ఉన్నడంటే వాళ్లమాట నెగ్గినట్టే. ఒక్కనాడు ఈతచెట్టు ఎక్కింది లేదు. కల్లులొట్టి మోసింది లేదుగనీ, మావులా మొత్తం ఆయిన మాట మీదనే నడుస్తది.

అది దీపావళికి అటూ ఇటూ కాలం. పనేం లేదు. ఇంకోనాలుగు రోజులైతే కోతలు పడుతరు. ఈ మధ్య మేము నాటుకం వెయ్యక నెలా రెండు నెలలు దాటింది. ఇప్పుడు కొద్దిగా పని తీర్పాటం దొరికింది.

మా కొండయ మామ ఉన్న జాగలుండడు. నారగౌడు కొడుకు పెండ్లి చేస్తుంటే 'ఇంతపెద్ద గౌడువు. కొడుకు లగ్గానికి ఆట ఆడిపియ్యవా..?' అని అడిగిండు.

'ఆడుంగ్రి. వద్దంటున్ననా...పైసలు మాత్రం ఇయ్య. మీరు తాగినంత కల్లువోత్త' నారగౌడు అన్నడు.

'మేకప్ సామాన్లు వట్టిగత్తయా..ఏం లేదన్నా నూరు నూటపది రూపాయలు గావాలె. అంతమందమైనా ఇయ్యి'. మామ అన్నడు.

నారగౌడు ఒప్పుకున్నడు. మరువెండ్లినాడు ఇంటిముందే స్టేజి ఎయ్యాలన్నడు. 'లక్ష్మణ పరిణయం' ఎయ్యాలని ఆటపేరు గూడా చెప్పిండు. ఇయ్యనీ ఇయ్యకపోనీ నాటుకం ఆడాలని కొండయమామ కోరిక. ఆయినేం మనిషోగనీ వరుసగ వారంరోజులు ఆడుమన్నా ఆడుతడు.

"లక్ష్మణ పరిణయం" ఆటను మేము ఎప్పుడో నేర్చినం. మా కొండయ మామ విశ్వామిత్రుడు. దాసు చిన్నాయిన జనకమారాజు. లక్ష్మణుడు గడ్డమీది రాములు. ఊర్మిల పోశెట్టి. నారాగౌడ్ చెప్పినమాట అందరికీ చెప్పిండు కొండయ మామ.

వెయ్యి రూపాయలిచ్చినా జరుగని పని కల్లుకుండతో జరుగుతది. కడుపునిండా కల్లువోత్తడనే సరికి మావోళ్లంతా తలూపింగ్రు. ఈ ముచ్చట మా పంతులుకు తెలిసింది.

'కల్లుకుండలకు ఆటాడుతాగ్రా...నీయవ్వా..వట్టి కడుపు గుత్తోళ్లున్నరు' అని యాష్టపడ్డడు. ఆటవద్దె వద్దన్నడు. మేము వినలేదు.

"మాట ఇచ్చినము గదా. నారగౌడు అందరితో చెప్పుకుంటడు. పెండ్లి ముచ్చటనాయె. ఆడితీరాల్సిందే" అన్నం. అయితే మీ ఇష్టం నేనైతే రానన్నడు పంతులు. రాకుంటే రాకపోతివి. మాకు ఆడరాదా అనుకున్నం.

అన్నట్టుగనే మరువెండ్లినాడు ఆటమోగిచ్చింగ్రు. పంతులు రానన్నడు కదా! నాకు పుస్తకమిచ్చి తప్పిపోయిన పాటను అందియ్యిమన్నరు. నాది శత్రగ్న్యుని ఏశం. ఆఖరుకు రెండుపాటలుంటయి అంతే!

చెప్పినట్టుగనే నారగౌడు పాము ఇసమసొంటి కల్లును నాలుగుకుండలు పంపిండు. కుండలను గరిశెలగడ్డకు మా ఎడ్లకొట్టంలనే పెట్టుకున్నం. మొదాలు కల్లుతాగినంకనే ఆడుదామన్నరు కొందరు.

'తాగినంక ఎట్లాడుతవురా..నిద్ర రాదా...పాణం సొలుగదా...ఆటాడినంక అందరం కూసుండి తాగుదాం.' అని గదరాయించిండు కొండయ మామ. అందరూ సరేనన్నరు.



మా ఎడ్లకొట్టం నారగౌని ఇంటికి దగ్గరనే ఉంది. ఇంటిముందు సందిలోంచి గుట్ట ఎక్కి దిగితే సక్కగ ఎడ్లకొట్టంలకే.

అందరం మేకప్ మీద కూసున్నం. లక్ష్మణుని ఏశమేసే రాములు, ఊర్మిల ఏశమేసే పోశెట్టి ఇద్దరూ ఒక్కదగ్గర కూసున్నరు.

"ఆరేయ్ మామా..ఆట పూర్తయ్యేదాక మన ఏశాలుండాలె. మిగిలినోళ్లు ఆఖరుదాక ఉండరు. మధ్యలోనే వాళ్ల పాత్రలు అయిపోతయి. ఏశాలు ఇప్పేసినంక మనం వచ్చేదాకా ఇక్కడనే ఉంటరనుకున్నావా. ఏశం ఇప్పేసినోడు ఇప్పేసినట్టు కల్లుకుండల కాడికిపోతరు. మనం పోయేవరకు మొత్తం ఖాళీజేత్తరు. అందుకే మనం ఇప్పుడే రెండు సాకలు తాగివద్దాం" 'రాములు అన్నడు. నారగౌడు కల్లుకుండలు తెచ్చిన నుంచి వానికి మనుసంతా కుండలమీదనే ఉంది.

'అవునురా అల్లుడా. ఒకవేళ గిన్నెడో గిలాసెడో ఉంచినా అర్ధరాత్రి దాటుతదిగదా! కల్లు పులుపుకెక్కుతది రుచి ఉండది. తాగితే ఇప్పుడే తాగాలె' అన్నడు పోశెట్టి.

మేకప్ వేసుకున్నట్టే వేసుకుంటూ వీళ్లిద్దరూ ఎనకనుండి ఎనకకే జారుకున్నరు. ఎవల ఆగంల వాళ్లున్నరు వీళ్లను ఎవలు చూడలేదు. కండ్లు మూసి తెరిచేవరకు మాయమయింగ్రు.

మా పంతులే ఉంటే ఆట అయిపోయేవరకు ఎవలనూ కదలనిచ్చే వాడుకాదు. నేను ఇదంతా సూత్తనే ఉన్న. కానీ కల్లుతాగపోతున్నరని మాత్రం తెలువది. ఒంటేలుకో, నీళ్లు తాగనో పోతుంగ్రనుకున్న.

నడీఊర్లె కాబట్టి జనం పట్టుజాలలేదు. సలివెడుతున్నా దుప్పట్లు కప్పుకొని వచ్చింగ్రు. చాలా మందికి కూసుండ జాగదొరుకక నిలవడ్డరు. కొందరైతే పాతగోడలెక్కి కూసున్నరు.

ఏశాలు ఏసుడు పూర్తయింది. ఆట మొదలువెడుదామని పోశెట్టి, రాములు కొరకు చూసింగ్రు. వాళ్లు ఎక్కడాలేరు. కొండయ మామ ఆగం చెప్పరాదు. "ఈ గాడిది కొడుకులు ఏటోపోయిరి" అనుకుంటా స్టేజిసుట్టూ తిరుగుతున్నడు. అందరినీ అడుగుతున్నడు.

మేటివేశాలు వాల్లేగదా. ఎక్కడా కనవడలేదు. చూసి చూసి వాళ్ల ఇండ్లల్లకుపోయి చూసింగ్రు. అక్కడ లేరు. అందరూ ఆగంల వడ్డరు. మనిషికో దిక్కు దేవులాడుతంగ్రు.

సూడంగ సూడంగ ఇద్దరు సొలుక్కుంట సొలుక్కుంట వచ్చింగ్రు. కల్లువాసన గప్పుమంది. వీళ్లను చూసినంక కల్లుతాగి వచ్చింగ్రని అందరికీ అర్థమైంది. ఆఖరున

వచ్చే వేశకాళ్లు ఇంకావేశం వెయ్యలేదు. వాళ్లు సూపులతోనే బదులుకున్నరు. పోదామా అంటే పోదాం అనుకున్నరు. అందరు గుంపులెక్క పోతే అనుమానం వస్తదని ఒక్కరెనుక ఒక్కలు దారివట్టింద్రు.

ఇంక కొంతమంది పోతున్న సంగతి ఏశమేసుకున్నోళ్లకు తెలువది. వాళ్లు రాములును పోశెట్టిని తిడుతంద్రు. ఇప్పుడే సొలుగుతున్నరు. పాటలెట్లపాడుతరని కోప్పడుతున్నరు. వాళ్లిద్దరూ తాగిన తిక్కమీదున్నరు. 'మాకు పాట పాడరాదంటుంద్రు గదా. ఇగ మేము పాడనే పాడము ఏంజేసుకుంటరో చేసుకోంగ్రి. అని మలుసుకుని పన్నరు. ఎంతకూ లెవ్వరు. ఎంత సర్దిచెప్పినా వినరు.

అప్పటికి రాత్రి పొద్దుపోయింది. జనాలు బొబ్బపెడుతంద్రు. "ఏమాయెరో..ఆడుంద్రిరో...ఇంకెప్పుడత్తరురో" అంటంద్రు. లోపలి సంగతి వాళ్లకేం తెలుసు.

మా కొండయ మామ రాములును బలవంతంగా లేపి మొఖానికి రంగుపూసి బుదురకిచ్చి ముందుకు తోలిండు. 'లచ్చుమన సామి వచ్చెనూ...ఇదిగో కల్లుకుండ తెచ్చెనూ' అనిపాట అందుకుని రెండడుగులేసి కిందబడిపోయిండు రాములు. వాన్ని పడిపోకుండా అందుకుని ఎనక్కు తీసుకచ్చిండు కొండయ మామ.

'ఈ రోజు ఆటాలేదు, గీటాలేదు' అంటూ వాడు మళ్లీ మలుసుకుని పండుకున్నడు. ఊర్మిలనైతే నిద్రదీత్తుంది. ఎనుకకు జూత్తే ఇద్దరు ముగ్గురు ఏశకాళ్లు తప్ప ఎవలూలేరు. అందరూ కల్లుకుండల దగ్గరికి జారుకున్నరు.

కొండయమామ బాగా ఆలోచించిండు. నారగౌడు మంచి మనిషికాదు. ఈరోజు ఎట్లయినా ఆటసాగది. ఈ విషయం తెలిస్తే నారగౌడు తన్నినా తంతడు. ఇగ కనవడద్దనుకున్నడు. యానంగనో బయటపడ్డడు. పోతూపోతూ నాకు గూడా రమ్మని సైగచేసిండు. ఏం జరుగుతదో సూద్దామని నేను మందిలోకెళ్లి నడుమల కూసున్న.

బయట జనం కీకెలు బొబ్బలు. ''ఏమాయరో...ఆడరేందిరో...లోపల ఏంజేత్తంద్రురో ఆటలేదు, పాటలేదు" అని ఒర్రుతంద్రు. బొబ్బలు వెడుతంద్రు. ఈ కీకలకు బయపడి ఉన్న ఒకలిద్దరు గూడా జారుకున్నరు.

ఆట ఆడుతలేరన్న ముచ్చట నారగౌనికి తెలిసింది. కట్టె అందుకుని సక్కగ కొట్టంకాడికి పోయిండట. అందరూ ఏశాలమీదనే లొట్టిముంగట కూసున్నరట. తాగింది నెత్తికెక్కింది. అక్కడనే పాటలు పాడుతంద్రట. రాగాలు తీత్తంద్రట.



'ఓరేయ్...ఆటాడుతమని ఇక్కడ తాక్కుంట కూసుంటార్రా....నీతల్లి' అని కట్టెమర్రేత్తే చెట్టుకొకడు గుట్టకొకడు ఉరికింద్రట.

ఇక్కడ రాములు గడికోసారి లేచికూసుండుకుంట 'లచ్చిమన సామిని వచ్చితీ' అంటూ తబ్లాలను కొడుతండు. ఊర్మిలను 'ఇంకా నిద్రలెవ్వవేందే' అని లేపుతండు. వాడు నిద్రలోనే 'ఎవడవురా నీచుడా! నా భర్తాలుడు గనుక చూస్తే నీ శిరస్సును ఖండిస్తాడు' అంటున్నాడు. వీళ్లు ఇద్దరే మిగిలింద్రు స్టేజివెనుక.

జనంల ఎవ్వలకో కోపమచ్చింది. స్టేజివెనుకకు వచ్చి చూసింద్రు. రాములు పోశెట్టి ఇద్దరే కనిపించింద్రు. రాములును లేవట్టి పెంటల ఎత్తేసింద్రు. వానికి పెయ్యంతా పెండనే! తీటకొలిక్కాయ తెచ్చి పోశెట్టి కాళ్లకు, చేతులకు రాసింద్రు. వాడు మొత్తం గీకుడుగోకుడు. ఒకడు పెట్రమాక్స్‌లైటు పలగ్గొట్టిండు. ఒకడు షాందిరికూలగొట్టిండు. జనమంతా తిట్టుకుంట ఇండ్లళ్లకు పోయింద్రు.

'సాకలి మంగలిపొత్తు. ఇంటికిరాదు ఇత్తు. కల్లుకుండలు చూసినంక వాళ్ల పానం ఆగుతాదిరా! ఈ నారగౌనిది తప్పుగాదు. రేపుపొయ్యనుండె. లేదంటే పొద్దున్నే పోసేదుండె. కండ్లముంగట కల్లు కుండవెట్టి ఆడుమంటే వాళ్లపాణం యాడుంటదిరా' అని ఊరు ఊరంతా నారగౌన్నే తప్పు వట్టింద్రు. నారగౌడు కొండయ మామను తిట్టుడేగాదు. వచ్చిన సుట్టాలముంగట ఇజ్జత్‌పోయిందని బాధపడుడేగాదు.

మాకు తల కొట్టేసినట్టయింది. తెల్లారి అందరు బాధపడ్డరు. అట్ల చేసేదిగాకుండె అనుకున్నరు. రాములు, పోశెట్టి, వీడేనంటే వీడేనని ఒకరినొకలు తిట్టుకున్నరు. రెండురోజుల్లో అదే నాటకాన్ని నారగౌని పేరుమీద కచీరుకాడ బ్రహ్మాండంగా ఆడి అందరినీ మెప్పించినం.

మొదటిసారిగా కొండయమామ మాటను దాటినందుకు మామ మనస్సునొచ్చుకున్నడు. పంతులు గూడా మస్తు బాధ పడ్డడు. ఇంకొకసారి కల్లుకుండలకు ఆశపడి బాగోతం ఆడద్దని ఒట్టు తీసుకున్నడు.

# మనిషికి తూమెడు వడ్లు

మాకు నాటకాలు నేర్పేది పున్నయ్య పంతులని తెలుసుగదా! పంతులు ఊర్లెకచ్చి యాడాది దాటింది. ఈ కొడుకు దగ్గరుండే టైం అయిపోయింది. ఇప్పుడు చిన్నకొడుకు దగ్గరికి నామాపురం పోవాలె. ఆయినతప్పితే ఇంకో పంతులు లేడాయె మాకు. ఎట్లా..? పంతులు లేకుంటే మా మాల్లెం ఇచ్చుకపోతది.

ఒకనాడు మమ్మల్నందరినీ కూసోబెట్టి నేను ఎళ్లిపోతున్ననని చెప్పిండు పంతులు. మాకు కండ్లల్ల నీళ్లు తిరిగినయి. ఎందుకో పంతులు ఎల్లిపోతున్నడంటే మాత్రం బాధగా ఉంది. పంతులు గూడా ఏడ్సుడే గాదు.

పొద్దంతా ఎప్పుడు టైందొరికినా పంతులు ఇంటికే పోదుము. పగటిపూటయితే కనీసం నలుగురైదుగురయినా జమయిదురు. రాని పాటలను అభ్యాసం చేసుకుందురు. పంతులు నాకు పల్లీల హార్మాని నేర్పిండు. సరిగమపదనిసలు ప్లే చేసి పాటలు పద్యాలమీద ఎలా పల్లీలు వేయాలో నేర్పిండు. ఒకచేత పల్లీలు వేయడం, మరో చేత తిత్తిని ఆడించడం ప్రాక్టీసు ఉంటే తప్ప కుదరదు. అట్లా తాళం కొట్టడం కూడా పంతులే నేర్పిండు.



పంతులు వెళ్లి పోతున్నాడంటే మా కొండయ మామకైతే తిండి గూడా తినబుద్దిగాలేదు. రెండురోజులు తిండి లేకున్నా ఉంటదుగానీ వేషం లేకుండా ఉండలేదు కదా! మొన్న పెండ్లిచూపులప్పుడు ఇట్లనే జరిగింది. పిల్లగాన్ని చూసేందుకు వస్తున్నమని అక్కపెల్లి నుంచి చెప్పి పంపింద్రు.

అంతకుముందు రోజే ఇక్కడ నాటకం. మామది శంకరుని ఏశం. మీసాలు తీసెయ్యాలె. 'నిన్ను చూడడానికి వత్తుంద్రు. వద్దురా' అని తాత. ఏషం ఏస్తనని మామ. అఖరుకు ఏయ్యనేఏసిండు. చూడచ్చినోళ్లకు బోడమూతితో కనిపించిండు. వాళ్లు ఏమనుకున్నరోగానీ పిల్లగాడు నచ్చలేదని చెప్పి పంపింద్రు.

ఒక్కమామనేగాదు. మాల్లెంలో అందరూ అదే పట్టుదలతో ఉన్నరు. మా దాసు చిన్నాయినకు ఒక్కడే కొడుకు. చిన్నపిల్లగాడు. వారం పదిరోజులు బాగలేదు. చేతులమీదనే ఎత్తుకున్నరు. అయినా చిన్నాయిన రియార్సల్‌కు తప్పియ్యలేదు.

బందూకుల మల్లేశం ఏరువడ్డడు. ఊరవుతల ఇల్లు. భార్య ఒక్కతే ఉంటది. ఒక్కదానికి భయమైతదని భార్య రోజూ ఏడుత్తదట. 'నిన్నేం మింగదితియ్యి. తలుపులు పెట్టుకుని పండుకునేందుకేంద'ని తిడుతడట.

అయ్యవ్వ భయానికి ఇంటికిపోకుండా ఎడ్లకొట్టం దగ్గరనే నిద్రదీసేటోళ్లు కొందరున్నరు. ఇప్పుడెంపోవుడు ఇంటికని కొందరు మా ఇంట్లనే నిద్రదీత్తురు. మా అమ్మ ఇల్లూడ్చుకుంట తిడుతుంటే లేచిపోదురు.

వీళ్లందరిదీ ఒక ఎత్తయితే బాల్‌నర్సుది మరోఎత్తు. అర్ధరాత్రిపూట ఊరుకూరుదాటి ఎల్లమ్మ గుడికాడికి పోవాలె. కుక్కలు వెంటపడుతయి. చిమాన చీకటి.ఎండాకాలమైతే దొంగల భయంగదా.

ఒకనాడు రియార్సల్ అయినాక కోటగడ్డదిగి ఇంటికి పోతుంటే దొంగోడే అనుకుని రాళ్లతోని కొట్టింద్రట. 'నేను బాల్‌నర్సునురో' అని మొత్తుకుంటే ఎవలు ఇంటరు. బొబ్బల బొబ్బ నాలుగు ఉతికింద్రట. అయినా రియార్సల్ మానలేదు.

అట్లాంటిది పంతులు పోతున్నడంటే అందరికీ బాధనే! ఇకముందు నాటకాలు ఉండవేమోనన్న భయం మొదలయింది. అందరికీ కొండయమామ మీదనే నమ్మకం. ఎవలు కాదన్నా మామమాత్రం ఏదో ఒకమార్గం ఆలోచిస్తాడనుకున్నరు. అనుకున్నట్టుగానే మామనే ముందువడి తిరుగుతున్నడు.

ముందుగా గంగరాములును కలిసిండు మామ. వచ్చిన యాడాదికొద్దీ గంగరాములు భార్య మాత్రం పంతులుమీద కోపంతోనే ఉన్నదట. ఎప్పుడుపోతడనే

చూస్తందట. 'నాకేమన్నమనులు పంచిచ్చిండా మాన్యాలా..? ఇల్లరికం ఇచ్చిన కొడుకు దగ్గరికి వస్తడా' అంటుందట. మా కొండయమామ బాగా ఆలోచించిండు. గంగరాములు భార్యను ఒప్పిస్తే చాలనుకున్నడు.

సభ్యులందరినీ కలిసి మాట్లాడిండు మామ. నేనుకాక మొత్తం పదమూడుమంది. 'ఇంకో యాడాది ఉండుమందాం. మనిషికి తూమెడు వడ్లు ఇద్దాం' అన్నడుమామ. మామాల్లెంలో కూలీలు, జీతగాళ్లున్నరు. వాళ్లకు ఎద్దులేదు. ఎవుసంలేదు. అయినా సరే అన్నరు. కానీ ఈ విషయం ఇండ్లల్ల తెలువద్దన్నరు.

కొండయమామ గంగరాములు భార్యతోనే మాట్లాడిండు. 'రామక్క రామక్కా. మేము పదమూడు మందిమున్నం. ఇంటికి తూమెడు వడ్లు ఇస్తం. ఇంకోయాడాది పంతులును ఇక్కడనే ఉండుమను. కాదంటే ఇంటికి మానెడు బియ్యంగూడా తెస్తం' అని చెప్పిండు.

క్షణాల్లో ఆదాయాన్ని లెక్కగట్టుకుంది రామక్క. ఏంలేదన్నా పదముత్తుమువడ్లు. ఆరుబస్తాలు. ఇంత ఆదాయం వస్తుంటే ఎట్లా కాదంటుంది? భర్తకు ఏం చెప్పిందో గని గంగరాములు మరునాడే తమ్మునికి నాయిన ఇక్కడనే ఉంటడని చెప్పి పంపిండట.

పంతులు ఇక్కడనే ఉంటడని తెలిసినంక మాకుపండుగే అయింది. పంతులుకు కండ్లపొంట నీళ్లు రాలినయి. 'మీరు నాకొడుకులసొంటోళ్లు. ఉన్నోళ్లుంటరు లేనోళ్లుంటరు. తూమెడు వడ్లు వద్దుబిడ్డా..ఇంటికొకనాడు తిండిపెట్టుండ్రి సాలు. సచ్చేదాక మీతోనే ఉంట. మీ పాతబట్టలుంటే ఇయ్యిండ్రి కట్టుకుంట' అన్నడు.

ఈమాట వింటుంటే మాకు దుఃఖమచ్చింది. వద్దని సర్దిచెప్పినము లేదంటే ఇంటికి పిడికెడు బియ్యం పెట్టుండ్రి. నాదినేను వండుకుని తింటనంటడు. అట్లగూడా వద్దని సర్దిచెప్పినము.

పంతులుకు కోపం ఎక్కువ. అనుకున్నది అనుకున్నట్టు జరుగాలె. లేదంటే చిటపట మంటడు. పాటలు నేర్పేటప్పుడు అంతే! రెండుమూడుసార్లు చదివి వినిపిస్తడు. మళ్లీ తప్పు చదివినమనుకో. చేతులున్న పుస్తకంతోనే ఇరిసికొడుతడు. రియార్సల్ చూడడానికి ఎంతోమంది వస్తరు. వాళ్లు వీళ్లున్నరని కూడా చూడడు. అయినా ఎవలు తప్పు వట్టుకోరు.

ఆ కోపమంతా ఎటు పోయిందోగాని ఇప్పుడు మాత్రం పంతులులో ఇవేవీలేవు శాంతంగా ఉన్నడు. అయినా మా భయం మాకుంది.

'ఇదువరదాక ఏదో నేర్చుకున్నం ఆడినం. ఐపోయింది. ఇప్పుడు మనము ఒకట్రూప్ చేసుకోవాలె. ఐదు నాటకాలు మంచివి నేర్చుకోవాలె. ఒకరిక్షాగూడా కొనుక్కోవాలె. రిక్షాకు



మైకుపెట్టి ఆకులు గట్టి ఊరంతా తిప్పి అడ్విటేజ్ చెయ్యాలె. సంచారం బయిలెల్లినమంటే కనీసం ఊరికి ఐదు ఆటలాడుకుంటూ పది ఊర్లయిన తిరుగాలె' అన్నడు పంతులు.

ఇది మా కొండయమామ ఎన్నటినుండో అనుకుంటున్న మాటలు. ఇప్పుడు పంతులు నోటివెంట వినేసరికి మామకు పట్టరాని సంతోషం కలిగింది. ఏదో అద్భుతం చెప్పినట్టుగా ఉంది. నిజంగా అట్లా చేస్తామా అనిపించింది. అదేమాట పంతులును అడిగిండు మామ.

'నేను చేస్తనా లేదా చూడు' అన్నడు పంతులు. మేము పట్టుదలగా రియార్సల్ మొదలు వెట్టినం.

ఈ కథ ఇట్లా ఉంటే పంతులుకొడుకులు కొట్లాడు కోవడం మొదలెట్టిండ్రట. తనతండ్రి నాటకాలు నేర్పి బాగానే సంపాదిస్తున్నడని అందులో తమకు కూడా వాటాగావాలని అడుగుతున్నరట గంగరాం తమ్ముండ్లు.

పంతులుకు మాత్రం మా నాటకాలే లోకమైనవి. ఇంతకుముందు పాత్రలు రాయించుదుము. రాసినందుకు మల్లయ్య సేటుకు పదిరూపాయలిద్దుము. ఇప్పుడు పంతులే వట్టిగనే రాసిత్తుండు. తెల్లతాపు పేపర్లు కూడా తనే కొనుక్కత్తుండు. ఊరిలో ఎవరినోటవిన్నా మా పాటలే.

ఎందరో కొత్తవాళ్లు మాతో చేరాలనుకుంటున్నరు. ఇప్పుడు ఆ విషయం మామ చేతిలోలేదు. పంతులు చేతుల్లో ఉంది. కొత్తవాళ్లు వచ్చేదిలేదు. పాతవాళ్లు పోయేదిలేదంటున్నడు పంతులు. ఇద్దరికి తబలా కొట్టుడు నేర్పిండు. రెండు తాళాల జతలు రియార్సల్ పూర్తయ్యేసరికి అందరి చేతుల్లోంచి తిరిగాల్సిందే.

రోజూ రియార్సల్ మొదలు పెట్టేప్పుడు దేవుడిపోటోకు దండం పెట్టడం బొట్టు పెట్టడం మాకు మనిషికింతా బొట్టుపెట్టడం కొత్తగా పెట్టిండు పంతులు. ఇకముందు బాగోతాలు యక్షగానాలు నేర్వద్దని కేవలం నాటుకాలే నేర్వాలని మాతో చెప్పిండు. మేముగూడా సరేనన్నం. ఏ పండుగైనా ఒకనాటకం వెయ్యాలన్నడు.

ఇదంతా చూసినాక మాకుమొదట ఆటలు నేర్పిన జంగం పంతులు ఏమనుకున్నాడో! తనుగూడా నాటకం నేర్పిస్తానని ఎవరైనా ఇష్టం ఉన్నవాళ్లు రావచ్చునని అందరికీ చెబుతున్నడట. జంగమమ్మకూడా నోరుతెరవడం లేదట.

ఈ విషయం విన్నాక మా మ్యాల్లెం మనుషులు జారిపోకుండా చూసిండు కొండయమామ. ఎవరినో ఆరేడు మందిని కూడగొట్టి జంగం పంతులు మ్యాల్లం మొదలువెట్టిండట.

"ఊర్లె రెండు మ్యాల్లాలెందుకు..? జంగం పంతులు మీకు తెలిసినోడేనాయె. మీరు అక్కడనే నేర్చుకోండ్రి. నేను నామాపురం ఎల్లిపోత. మీకు మీకే కొట్లాటలయితయి." పున్నయ్య పంతులు ఒకనాడు అన్నడు.

"నేర్సుకుంటే మీ దగ్గరనే నేర్సుకుంటం. లేదంటే మానేత్తం. అంతేగనీ జంగం పంతులు దగ్గరికి పోము." మా కొండయమామ చెప్పిండు. మేమంతా అవునంటే అవునన్నం.

ఆ మరునాడే పంతులు చిన్నకోడలు వచ్చిందట. ఇద్దరు యారండ్లకు పెద్ద పంచాది అయిందట. "ఇంత సంపాయిస్తండని ఉండుమంటున్నవు. లేకుంటే ఎందుకు ఉండుమందువే" అని చిన్నకోడలు పెద్దకోడలును అన్నదట. నాగురించే కొట్లాట గావట్టెనని పంతులు మనసునొచ్చుకున్నడట. వెళ్లిపోదామంటే మమ్ముల్ని విడువడానికి ఇష్టంలేదు. ఉందామంటే ఇంట్లకొట్లాటలు. పంతులు మస్తు బాధపడుతుండు.

ఇదంతా చూసినాక మాకొండయమామ 'పంతులూ... మీరు వెళ్లిపోండ్రి. నడుమల మీకెందుకు బాధ" అన్నడు. మా పంతులు మారు చెప్పలేదు. నాలుగురోజులు కనిపించలేదు. మేమంతా వెళ్లిపోయిండనుకున్నం. ఆశ జాలిచ్చుకున్నం. సామాన్లన్ని ముల్లెగట్టి దూలాల మీదికి ఎక్కిచ్చినం.

ఐదవనాడు కొంత సామానుతో వచ్చిండు పంతులు. రెండుగిన్నెలు, కొంత వంట సామానుంది. ఊర్లెనే చిన్న ఇల్లు కిరాయికి తీసుకున్నడు. 'నాదినేను వండుకుంట. నా తిండి నేను తింట. కోపాలద్దు కొట్లాటలద్దు. మీరు వెళ్లిపొమ్మనేదాక పోను' అన్నడు.

ఇచ్చుకపోతదనుకున్న మ్యాల్లెం మల్లా మూటికచ్చింది. మా కొండయమామ సంబూరం చెప్పరాదు. "ఒరేయ్... పంతులు మనకోసమే ఉన్నడు. ఏలోటు లేకుండా చూడాలె" అన్నడు.

కాయ, పండు, మాకు ఏది కనిపించినా పంతులు ఇంట్ల ఉండాల్సిందే. ఎండ్రికాయలు, చాపలు, రొయ్యలు పంతులు ఇంట్ల నీసు లేని దినమే లేదు. ఒక్కొక్కనాడు బువ్వకూర మేమే వండుదుంటిమి. ఎవలింట్ల పండుగైనా పంతులును తోలుకపోదురు.

ఇదంతా చూసినంక ఒకనాడు పంతులు కండ్లకు నీళ్లు తీసుకుని 'కన్న కొడుకులన్నా నన్ను ఇంత మంచిగ చూసుకోలేదురా. నాకు ముగ్గురు కొడుకులు గాదు. ఇరువైమంది కొడుకులు' అన్నాడు.



# ఒక్కనాటి బాగోతం ఇడుపు కాయిదాలకచ్చింది

ఆరోజుగూడా ఏశాల రాములు రియార్సల్‌కు రాలేదు. 'ఏశాల' వాళ్ల ఇంటిపేరుగాదు. వాళ్ల కులంల ఇద్దరు రాములులున్నరు. ఈ రాములు నాటుకాలాడుతడని ఈపేరు పడిపోయింది. బాగోతుల బాల్‌రాజు, తబులా కొండయ్య, నాటుకాల నర్సయ్య, జోకర్ నాంపెల్లి... ఇట్లా కొన్నిపేర్లు స్థిరపడిపోయినయి.

మేమందరం చుట్టూ కూసున్నం. నడుమల దూలానికి కందిలి కట్టిండ్రు. కందిలికింద మా పంతులు కుర్చీల కూసున్నడు. అంతా మసుకమసుక చీకటే ఉంది. ఇంకా రియార్సల్ మొదలు కాలేదు. కొండయమామ తబలా సుతి చూసుకుంటుండు. దారాలను బిగిత్తండు. ఎవరి పారట్లను వాళ్లు ఒకసారి చదువుకుంటుండ్రు.

మా అందరినీ ఒకసారి చూసి 'అగో..రాములు ఇయ్యల్లగూడా రాలేదు. మాల్లెంల ఉండడటనా.?' మా పంతులు అడిగిండు.

'ఇంకో మాల్లెం బెట్టింగ్రట. పక్కీరోళ్ల ఇంట్ల రియార్సలట. జంగం పంతులే నేర్పిత్తుండట. మాయాబజార్ నాటకమట.' చెప్పిండు కొండయమామ. అంతవరదాకా ఈ సంగతి సగం మందికి తెలువనే తెలువది.

అందరం గుసగుసలాడుకున్నం. వాళ్ల మాల్లెంల ఎవలెవలున్నరో అడుగుతున్నం. ఒకలిద్దిరు' వీడు ఇట్లజేత్తడని మేము ఎన్నడో అనుకున్నం. మొన్నటి నుండే మసులుతండు' అన్నరు.

'అచ్చా...మనకు పోటీ వెట్టింగ్రన్న మాట. అట్లనేగానీ పోటీ ఉంటేనే ఎవలేంటిదన్నది బయటవడుతది ఇవారదాక ఊర్లె ఒక్కటే మ్యాల్లముండే. ఇప్పుడు రెండు మ్యాల్లాలు అయినయన్నమాట. వాళ్లకంటే మంచిగ ఆడి సూపియ్యాలె.' మా పంతులు అన్నడు.

ఊర్లే ఇంకో మాల్లెం పుట్టుడుకు అసలు కారణం కొండయ మామనే! మేము ఇప్పుడు నేర్సుకుంటున్న 'ధర్మకంకణం' నాటకంల రాజు ఏశం దగ్గర తకురారు వచ్చింది.

రాజు వేశం నాకు గావాలంటడు రాములు. కాదు నాకే కావాలంటడు మామ. ఎవరి పట్టువారిదే! నిజానికి రాజువేశం మామకు కుదురుతది. రాములు బక్కగా పొడుగ్గా జొన్నకట్టె లెక్క ఉంటడు. వానికి రాజువేశం అసలేకుదురది. ఈ సంగతి మాల్లెంల అందరికీ తెలుసు. ఒకలిద్దరు 'నీకు రాజు ఏషం కుదురదిరా' అని రాములుకు చెప్పింగ్రుగూడా. వాడే వినలేదు.

రాజు తర్వాత ఆటలో మేటివేశం శంకరునిది. మా పంతులు ఇద్దరికీ సరిచెప్పి మామకు రాజు వేశం రాములుకు శంకరునివేశం ఇచ్చిండు. ఏమనుకున్నడో రాములు ఇంక కొందరిని జమ జేసుకుని కొత్త మాల్లెం బెట్టిండు.

జంగం పంతులు ఎప్పటినుండో ఎదురు చూస్తుండుగదా! రాములు బయటకు రాంగానే పట్టుకున్నడు 'మిమ్మల్ని వాళ్ళకంటే మంచిగ జేస్త సూడు' అన్నడట.

మేము రియార్సల్ చేస్తానే ఎప్పటికప్పుడు వాళ్లరియార్సల్ గురించి తెలుసుకుంటన్నం వాళ్లకి తబలాకాడు లేడని, తాళం కొట్టుడు వస్తలేదని. పక్కీరోల్లు వద్దంటున్నరని రోజుకో కొత్తవిషయం తెలుస్తుంది.

ఒకసారి కర్నాల మక్కచేన్ల దొంగలు వడ్డరు. నాలుగు సంచుల మక్క కంకులు పోయినయి. ఈకేసు బెస్తరాజం మెడకు చుట్టుకుంది. రాజం వాళ్ల మ్యాల్లంల మనిషే. ఈ దెబ్బతో మ్యాల్లం ఇచ్చుకపోతదనుకున్నం. అట్లా జరుగలేదు.



అటో ఇటో వాళ్లు మాయాబజార్ నేర్సింగ్రు. మేం 'ధర్మకంకణం' నేర్సినం. మేము ఎన్నడు ఆడితే ఆనాటి మరునాడే మాకు పోటీగా ఆడాలని వాళ్లు నిర్ణయించుకున్నరు. నిజానికి మాయాబజార్ నాటకం. ధర్మకంకునం యక్షగాణం. వేశకాళ్లు బాగుంటే యక్షగానం కంటే నాటకమే మంచిగుంటది.

నాటకంలో పాటలు బలె రంజుగుంటయి. పాటలు ఎత్తుతూ దించుతూ రూపక తాళం మీదుంటయి. మనుసును కరిగియ్యాలంటే రూపక తాళం పాటలే కావాలె. అట్లా వాళ్లకీ మంచి పేరువస్తదన్న భయం మొదలయింది మా మామకు. వాళ్ల ఆటకంటే మా ఆటనే గొప్పగున్నదని జనం అనుకోవాలంటే ఏవైనా జిమ్మిక్కులు చెయ్యాలనుకున్నం.

ఇటువంటి విషయాల్లో మాపంతులు మహా దండోడు. ఆయన మనుసుల గూడా ఇదే సంగతి మెదిలినట్టుంది. మేం చెప్పకముందే ఏదేదో చేస్తండు. జోకర్ పాత్రను పెట్టిండు గదా! మాటమాటకూ జోకులే!

ఆట రక్తి గట్టాలంటే ఒక్క జోకులే చాలవని మామ నమ్మకం. తనమీద కోపం కొద్ది రాములు వేరే మాల్లెం బెట్టిండు గదా! అందుకని ఆ మాల్లెమే లేకుంట జెయ్యాలెనని మామకు పట్టుదల. వాళ్ల మ్యాల్లెం లేకుంట జెయ్యాలంటే 'మాయాబజార్'కు జనంలో పేరు రాకుండ చెయ్యాలె. జంగం పంతులు మ్యాల్లెం 'ఏం ఆట ఆడింగ్రుదురా...థూ...అదే కొండని మాల్లెంజూడు 'ధర్మకంకణం ఆడింగ్రంటే అదీఆట' అని అనాలె జనం.

అందుకని నడుమ నడును రికాడ్డ్యాన్సులు పెట్టిండు. కొన్ని నోటిపాటలు గూడా పెట్టిండు. పాటలు పంతులు పాడాలె. కొండయ మామ తబలా కొట్టాలె. మ్యాకల పోశం డ్యాన్స్ చెయ్యాలె.

ఒకనాడు గడీల స్టేజి వేసినం. ధర్మకంకునం కథ ఏమిటంటే సత్యధర్మరాజు సత్యవతి భార్యా భర్తలు. అడిగింది లేదనకుంట ఇస్తానని కంకునం కట్టుకుంటరు. వీళ్లను పరీక్ష చేయడానికి శంకరుడస్తడు. రాజునే తన సేవకు రమ్మంటడు. రాజు అతడి వెంట ఎళ్తడు.

మరొక నాడు వచ్చి తనకోరికను తీర్చడానికి వేశకాంత కావాలని రాణిని అడుగుతడు. రాణి ఒప్పుకుంటది. వికారమైన శంకరుని వేశం చూసి వేశ్యలెవలూ ఒప్పుకోరు. ఇచ్చినమాట నిలబెట్టుకోవడానికి తనేవస్తానంటుంది రాణి.

పతివ్రత కాబట్టి ఆమెను ముట్టబోతెనే మంటలు లేత్తయి. వాళ్ల ధర్మబుద్ధికి మెచ్చి కైలాసప్రాప్తి ఇస్తడు శంకరుడు.

నాటకం మొదలయింది. మొదటినుంచి చివరిదాకా మంచి రక్తికట్టింది. మ్యాల్లాలు

రెండు అయినయి కాబట్టి ఎవలెట్ల ఆడుతరో సూడాలని మాకంటే ఎక్కువ జనానికే ఉంది. అప్పడే ఊర్లె గూడా వాదులాట మొదలయింది. 'జంగం పంతులేం తక్కువగాడని' కొందరు, 'పున్నయ్య పంతులు గురించి మీకింక తెలువదు'. అని కొందరు వాదులాడుకుంటం(డట.

అందుకని జనంబాగానే వచ్చిం(డు. మంచికలెక్షనయింది. జోకర్ మస్తు నవ్విపిచ్చిండు. సత్యవతి కష్టాలుజూసి జనం ఏడ్సుడేగాదు. 'మసకమసక చీకటిలో' పాటమీద పోశం డ్యాన్స్‌చేస్తే జనం సీటీలు గొట్టుడేగాదు. నోట్లె ఆటాన బిళ్ల వెట్టి వన్స్‌మోర్ గొట్టిం(డు.

మా కొండయమామ మురుపం చెప్పరాదు. ఎవరిచ్చిం(డో ఐడియా గనీ అప్పటికప్పుడు గ్యాస్‌నూనె లీటరు తెప్పిచ్చిండు. 'ఈదెబ్బతో మనం ఫుల్ సక్సెస్. వాళ్లు ఏంజేసినా మనమీదికిరారు.' కుషీగా అన్నడు. అది ఇంతకుముందు అనుకోని ప్లాను.

ఎట్లుంటదోనని అందరం ఎదరుచూస్తున్నం. అక్కడికి మాపంతులు 'వద్దు అతిలావు శాంతనం జుట్టు పీక్కున్నట్టుంటది' అని అంటనే ఉన్నడు. కొండయ మామనే వింటలేడు. 'మీకెందుకు పంతులు. సూడుం(డి గంతే' అంటుండు.

ఆ సీన్ రానే వచ్చింది. బటులు వచ్చి వేశ్యలు ఎవరూ రావడం లేదని చెప్పినాక సత్యవతి 'నన్నూగైకొమ్మ మునిపుంగవా' అనిపాట ఎత్తుకుని పాడి తనే వత్తానంటుంది. అయ్యోదొర్సానికి ఎంతకట్టమచ్చెనని జనం కలకలాంటం(డు. అప్పుడు శంకరుడు 'కొమ్మా రమ్మీ...ననుజేరుకోసుమ్మీ' అనిపాటపాడి ఆమెచేతిని అందుకోబోతాడు. అప్పుడు మంటలు లెవ్వాలె.

మామ జనానికి కనబడకుండా సైడుపరదా చాటుకు జాక్కున్నడు. నోటినిండా గ్యాసునూనెను పోసుకున్నడు. అగ్గిపుల్లను గీకి పట్టుకున్నడు. 'ఊఫ్' మని నూనెను ఊదిండు. ఇద్దరి మధ్యల బగ్గుమని మంట. జనం సంతోషంతో కీకెలు పెట్టిం(డు. మరోసారి చెయ్యిని అందుకోబోతే మల్లీమంట. జనం విచి(తపడుతం(డు. చూసేవాళ్లకు ఎట్లాగంటె నిజంగనే చెయ్యివడితే బగ్గున మంటలు లేత్తున్నయా అన్నట్టుంది. కొండయమామ ఎగిరి గంతులేత్తండు. మూడవసారి మళ్లా ఊదిండు. ఊదుడు ఊదుడే కొద్దిగ గట్టిగ ఊదిండు.

మంట కొద్దిగా యాస తిరిగి శంకరుని దోతికి అంటుకుంది. వాడు భయం భయంగా స్టేజిమీద ఎగురుతుండు. జనాలకు ఏంతెలుసు? అదినాటకంలో భాగమే అనుకుంటున్నరు.

'మంచిగైంది ముండకొడుక్కు. దేవతలెక్కున్న రాణిని చెయ్యివడుతడా' అంటం(డు.



ముందుగా (గహించిన సత్యవతి శంకరుని దోతిని గుంజేసి ఇసిరికొట్టింది. కొట్టుడు కొట్టుడు అటుపక్కనో ఇటుపక్కనో ఇసిరికొట్టినా బాగుండు. ఆగంల పరుదాదిక్కు ఇసిరికొట్టింది. అది సైడు పరదాకి తాకి బగ్గున మంట లేచింది.

అప్పుడు క్యాల్లికచ్చిన కొండయమామ. 'నీళ్లురో...నీళ్లు అందుకొం(డిరో....' అని కేకలేసిండు. మంటలు లేచినాక జనానికి అసలు విషయం అర్థమైంది.

'అక్కడ నీళ్లెక్కడియి...? తాగుడుకు తెచ్చుకున్న బిందెడు ఎప్పుడో ఖాళీ అయినయి. మనిషికో దిక్కు మేకప్ సామాన్లు పక్కకు పెట్టినము. స్టేజి అందంగా ఉండాలని పూలపూల చెద్దర్లు అడుక్కువచ్చికట్టినం. వాటిని గట్టిగా సుతిలి తాళ్లతో కట్టినం. ఎంతగుంజినా రాలేదు. ఆ చెద్దర్లు ఇచ్చినోళ్లు ముందటనే కూర్చున్నరు.

'నా చెద్దరురో...ఎ(ర చెద్దరు గుంజుం(డిరో...వచ్చ చెద్దరు గుంజుం(డిరో....కాలుతుందిరో' అని జనంలోంచి కేకలు. అటోఇటో స్టేజిని గుంజేసినం. మేన్ పరుదా కాలిపోకుండా కాపాడినం. అటుగుంజుడు ఇటు గుంజుడు అందరు జమ కూడిం(డు.. గంట గడిచిపోయింది. ఇంకా కొంత ఆటమిగిలేవుంది. జనం అసంతృప్తిగానే లేచిం(డు.

తెల్లారిమా(తం వెంకట్‌రెడ్డి పటేల్ ఇంట్ల పెద్ద పంచాదయింది. కత ఇదుపు కాయిదాలదాకా పోయింది. అసలు సంగతేమిటంటే శంకరుడు కట్టుకున్న పితాంబరం సత్తవ్వ దొర్సానిది. వేశం మీదికి కావాలని అడిగి తెచ్చుకున్నడట గొల్లరాజం. అది కాలిపోయింది కాబట్టి అసలు సంగతి బయటకు వచ్చింది.

శంకరుని వేశమేసిన రాజిగానికి నీకూ సోపతి ఎప్పుడయిందని దొర్సానిని కొట్టిండట పటేలు. ఎంత చెప్పినా వినడట. సోపతిలేకుంటే చీర ఎందుకిత్తవు అన్నడట.

ఈ ముచ్చట తెలవంగనే గొల్లరాజం పటేలు ఇంటికిపోయి ఇద్దరికాళ్లు మొక్కిండట. 'పటేలా..మీకాలుకు చెప్పసొంటోన్ని. నాలుగురోజుల కైకిలి వత్తనని బతిలాడితే దొర్సాని ఇచ్చిందని ఏడ్చిండట.

అటో ఇటో పటేలు కోపం తగ్గిపోయినా పితాంబురం బాకీ మా(తం అట్లే మిగిలింది. పటేలు దగ్గర పితాంబురం బాకీ తీరడానికి రాజంకు మూడేండ్లు పట్టింది. అది వేరే విషయమనుకో.

మొత్తం మీద మా జిమ్మిక్కులే మానెత్తిమీదికచ్చినయి. "వారెవా... "ఏం ఆట ఆడిం(డురా!. ఆట కమ్మేయాల్లకు షాందిరిని అంటువెట్టుకునిరి పిచ్చిముండకొడుకులు. అని మొఖం ముంగటనే తిట్టిం(డు ఊరి జనం.

# దొంగలు... దొంగలు

"సోదర సోదరీ మనులారా... ఈ రోజు మన ఊరి గడీలో జరుగబోయే బ్రమ్మాండమైన నాటకం మాయా బజార్.... చూడండి, చూసి ఆనందించండి. మాయా బజార్. మంచి మంచి పాటలు, అందమైన ఆటలు, మిమ్మల్ని కడుపుబ్బనవ్వించే మాటలు. తప్పక చూడండి. చూసి ఆనందించండి. ఆలోచించిన ఆశా బంగము. మంచి సమయం మించిన దొరుకదు. మీ అభిమాన పంతులు జంగం పంతులు నేర్పిన మాయా బజార్.... మరువకండి మాయా బజార్... టికెట్లు రేట్లు... నేలకు చారానా, చాపకు ఆటానా, బేంచికి బారానా, కుర్చీ రూపాయి.... మరువకండి సోదరులారా మాయా బజార్.. మీ



అభిమాన నటులు ఏశాల రాములు, కుంటిపోశి బాలయ్య... ఎనగంటి బాల్‌నర్సు..." చేతులో పుంగీ వట్టుకుని మెడలో తబులా వేసుకుని దప్పదప్ప కొట్టుకుంట చాటింపు వేత్తండు బెస్తలింగం.

చాటింపు వేసినప్పుడే అనుకున్న వీళ్లు ఎట్లయినా 'మాయాబజార్' మంచిగ ఆడుతరని. ఎందుకంటే మా ఊర్లె ఎవలు గూడా నేలకు ఇంత, సాపకు ఇంత, బేంచికి ఇంత, కుర్చికి ఇంత అని ఇంతవరకు టికెట్లు పెట్టలేదు. ఒక్కటే టికెటు ఉంటుండె.

మేము మొన్న ధర్మ కంకనం ఆడినంగదా! అది పేలయిపాయె. ఇయ్యాల్ల వీళ్లు గనుక మంచిగ ఆడి 'శెభ్బాష్' అనిపించుకున్నరనుకో! మా మ్యాల్లం పని అయిపోతది. మేటి ఏశకాళ్లు జంగం పంతులు మ్యాల్లంల చేరిపోతరు. మాది ఇచ్చుక పోతది.

ఈ మాట నేనే గాదు. ఊరు ఊరంతా అనుకుంటున్నరు. 'ఏశాల రాముడు సన్నపోడుగాదు. ఈతలు నేర్చినోడు. ఏదో మాయ జేత్తడు' అంటున్నరు. నాకు పొద్దంతా ఇదే ఆలోచన. బడినుంచి ఇంటికి రాంగనే పుస్తకాల సంచిని గూట్లె వెట్టి సక్కగ గడీలకు పోయిన.

వీళ్లు గూడా మైకు వెట్టింద్రు. రికాడు లేత్తంద్రు. స్టేజీ మేము వేసిన జాగలనే వేసింద్రు. ముందట సాపలు పరిచింద్రు. వెనుకకు నేల. ముందటనే ఒక పక్కకు నాలుగైదు బేంచీలు, మరో పక్కకు ఐదారు కట్టె కుర్చీలు వేసింద్రు. మైకులో అప్పుడప్పుడు 'సోదర సోదరీమనులారా..' అని చెప్పుతంద్రు.

మా బడిపిల్లలంతా అక్కడనే ఉన్నరు. పాటలకు డ్యాన్స్ జేస్తంద్రు. కొందరు టొక్క ఆడుతంద్రు. ఇంకొందరు రేసాడుతంద్రు. నలుగురైదుగురు ఒక మూలకు నాటుకమే ఆడుతుంద్రు. నేను మాత్రం స్టేజి చుట్టూ తిరిగి సూత్తున్న. వాళ్లు ఏమనుకుంటున్నరో వింటున్న.

స్టేజి మీద మేన్ పరుదా కొత్తగా ఉంది. ఎవరిదో అడుక్కచ్చినట్టున్నరు. స్టేజి పెద్ద పీటలతోనే వేసింద్రు. అరటాకులు కొబ్బరాకులు కట్టి పెండ్లి పందిరి లెక్క చేసింద్రు. సైడు పరుదాలు పెద్దగా ఉన్నయి. కిందా, పైన ఎర్రటి బట్టను స్టేజి చుట్టూ కుచ్చులు కుచ్చులుగా కట్టింద్రు. ఎల్పర్ బాల్‌రాజు కరెంటు బుగ్గలు పెట్టి రంగు రంగు కాయిదాలు చుడుతున్నడు.

మాయా బజార్ నాటకంల శశిరేఖ పెండ్లి ఉంటది. పెండ్లి చేయడానికి బామని పంతులును మాట్లాడినారట. నిజంగ పెండ్లి లెక్కనే జేత్తరట. ఈ ముచ్చట ఊరంతా మాట్లాడుకుంటున్నరు.

ఈ స్టేజీ చూసినంక నాకు గట్టినమ్మకం కుదిరిపోయింది. ఎట్లయినా 'మాయాబజార్' ఆట దుమ్మురేగుతదనుకున్న. జంగం పంతులు గూడా ఉత్తుత్త మనిషిగాదు. ఏదో ఒకటి చేసి జనాలను మెప్పిస్తడనుకున్న. ఈ పోటీ మా రెండు మ్యాల్లాలకు గాదు. ఇద్దరు పంతుళ్లకేనని అనిపించింది. ఈ మాట నేనే కాదు జనం కూడా అంటున్నరు.

ఈ మాటలన్నీ విన్నాక మాకొండయ మామకు భయం పట్టుకుంది. కొత్త పరుదాలకు, తబులాలకూ, పల్లీల హార్మానికీ వెయ్యి రూపాయలదాకా పెట్టుబడి పెట్టిండు. నాలుగు ఆటలు ఆడి ఆ బాకీని నింపుకుందామనుకునేలోపునే ఈ పోటీ పడింది. వాళ్లకు మంచి పేరస్తే మా నాటుకాన్ని ఎవలూ చూడరనీ మామ భయం. అందుకని ఆ రోజంతా మా దాసు చిన్నాయినను వెంటేసుకుని ఊరంతా తిరిగిండట. ఊరంతా ఏమనుకుంటున్నారో విన్నడట.

మసుకు వడ్డాక మరోసారి చాటింపు వేసింఁడ్రు. మైకుల చెప్పేది చెపుతున్నరు. నేను మా లస్మవ్వను చారాన అడుక్కున్న. అన్నం తిని గడీలకు పోయిన. గేటు ముందట టేబుల్ వేసుకుని టికెట్లు అమ్ముతున్నరు. గేటు దగ్గర ముగ్గురు మనుసులు కావలున్నరు. టికెట్లు తీసుకుని లోపలికి పంపిత్తున్నరు. ఇదెట్లుంటదో సూస్తామనుకున్నట్టున్నరు జనం. రషి బాగానే ఉంది.

నేను చారాన ఇచ్చి నేలకు టికెటు తీసుకున్న. టికెట్‌ను చూసినంక నాకొక ఐడియా వచ్చింది. వెంటనే మిగిలిన టికెట్లు గూడా చూసిన ఓరినీయవ్వ... ఇంతేనా...? అనుకున్న. సక్కగ మా ఇంటికి పోయిన. నేను ఆడుకునే సిగరెట్ డబ్బా పత్తాలు తీసిన. ఒక సీసమీది మూత తీసిన. దానికి సిరాపూసి చార్మినార్ పత్తా మీద ముద్రవేసిన. నేల టికెట్ రెడీ. బర్కిల్ సిగరేట్ పత్తా మీద రెండు ముద్రలేసిన. చాప టికెట్ రడీ. ఇట్లా నేల టికెట్లో నాలుగు, చాప టికెట్లో నాలుగు తయారు చేసిన. బెంచికి కుర్చికి వాడిన పత్తాలు నా దగ్గర లెవ్వు.

ఈ టికెట్లల్ల మా అమ్మకొకటి ఇచ్చిన. అక్కకు రెండిచ్చిన. మిగిలినయి జేబులేసుకుని పోయి మాదోస్తులకిచ్చిన. నేను సాపలకు పోయి కూసున్న. మా మ్యాల్లెం వాళ్లు ఎవలన్నా వచ్చింఁడ్రా అని చూసిన.

మా మ్యాల్లెం మొత్తం అక్కడనే ఉంది. ఒకడు కుర్చీల దగ్గర కొట్లాడుతున్నడు. ఇరిగిపోయిన కుర్చీ వద్దేవద్దంటున్నడు. ఇంకొకలు బెంచీలదగ్గర ఇక్కడ గాదు అక్కడ కూసుంటనంటున్నడు. ఒకడు సాపలు చినిగినయంటున్నడు. ఇంకొకడు నేలదగ్గర ఎనకవద్దు ముందటనే కూసుంటనంటున్నడు. ఇట్లా కావాలనే లొల్లి పెడుతున్నరు. చూస్తుండంగనే గడి నిండింది.



ఆట మొదలయింది. మొదలు మొదలే రెండు డ్యాన్స్‌లు చెక్కు చెక్కున లైట్లు మెరుత్తున్నయి. బుడ్డెనుకాడు మస్తునవ్విత్తండు. మాట మాటకు నవ్వుడే, పాటలు కంద పద్యాలైతే మోత మోగుతున్నయి. పల్లీల హార్మోని మీద రాగం గాకపోతే రాగం తీత్తంఁడ్రు. వేశాలు గూడ బొమ్మల లెక్క కుదిరినయి. జనం అట్లాంటి నాటుకాన్ని ఎప్పుడూ చూడనట్టుగనే చూస్తంఁడ్రు.

అంతవరదాకా నాకు ఏదో మూల కొద్దిగా ఆశ ఉండె. నాటకం కొద్దిగా జరిగిన తర్వాత నా ఆశ అడుగంటింది. ఖచ్చితంగా మా మ్యాల్లం పని అయిపోయినట్టే అనుకున్నా.. ఇట్లా అనుకోగానే నాకు భయం మొదలయింది.

నా పక్కనే కూసుంది గొల్ల ఎంకట్రాజవ్వ. ఆమెకు ఐదుగురు కొడుకులు. ఏరువడ్డరు. ఒక్కటే ఇంట్ల తడుకలు కట్టుకుని ఉంటున్నరు. ఆమె ఇద్దరు కొడుకులు ఇదే మ్యాల్లంల ఉన్నరు. అందుకనే అందరికందరు ఇంటికితాళం వేసి వచ్చింఁడ్రు. ఎంకట్రాజవ్వ నోరు బలే పెద్దది. ఎవలకూ భయపడది. మేము గోడ పక్కన కూసున్నం. అక్కడ చీకటి చీకటిగానే ఉన్నది.

ఆట ఇంక కొద్దిగా సాగిందో లేదో బేంచి మీద కూసున్న మా దాసు చిన్నాయిన నాదగ్గరికి వచ్చి కూసున్నడు. ఎందుకు వచ్చిండో అర్థం గాలేదు. నెత్తికి ఎర్రరుమాలు చుట్టిండు. లుంగీని గోశివోసుకున్నడు. ముందుగా నేనే గుర్తుపట్టలేదు.

గుర్తువట్టినాక 'ఏంటిది చిన్నాయినా... బేంచిమీది నుంచి కిందికి వచ్చినవు' అని నేను అడిగేలోపే... 'అరేయ్... ఇంటికిపోదాం నడువురా.. ఊర్లెకు దొంగలచ్చింఁడ్రట... గొల్ల ఎంకట్రాజవ్వ ఇంట్ల పడ్డరట' అన్నడు గొంతుని తగ్గించి.

నేను నిజమే అనుక్కు. ఎంకట్రాజవ్వ నా పక్కనే ఉందికదా! ఈ మాటలు విన్నది. ఆగమాగాన లేచి నిలవడ్డది. నెత్తి ముడుసుకుంటూ.. 'కోటా.. ఎల్లుగా... రాజిగా... యాడున్నరురా... నడువుంఁడ్రిరా... నడువుంఁడ్రి.. దొంగలు వడ్డరట. నీ ఆటపాడుగాను. వద్దు వద్దనంగ ఇల్లుకు తాళమేసి వత్తిరి. దొంగలురో.. దొంగలు...' అని బొబ్బెకెత్తుకుంది.

దొంగలనంగనే అందరికీ భయం పట్టుకుంది. నేను నిలబడి చుట్టూచూసిన. మా మ్యాల్లంవాళ్లు ఎవరూ కనిపించలేదు. దాసుచిన్నాయిన గూడా మాయమయిండు. అప్పుడే బలబలమని ఇండ్లమీదికి రాళ్లు పడ్డయి. వాడలల్ల 'వచ్చెరో పాయెరో' అని కేకలు బొబ్బలు మొదలయినయి.

జనం పుట్ట బెదిరినట్టు బెదిరింఁడ్రు. అందరూ ఒక్కసారే లేచి నిలవడ్డరు. గేటుకు అడ్డంగా కట్టిన దుప్పట్లను ఇసిరికొట్టి పరుగందుకున్నరు. అంతవరకూ ఏ చప్పుడూ

లేని ఊరు ఇప్పుడు కేకలు బొబ్బలతో నిండిపోయింది. పావుగంటలో గడీ మొత్తం ఖాళీ అయింది.

అప్పటికీ ఆట జోరందుకున్నది. దుర్యోదనుడు వచ్చిండు. లక్ష్మణకుమారునికి పెండ్లి చూపులు. ఆట కమ్మేది అప్పుడే! వేశకాళ్లు గూడా వేశాలు ఇప్పకుండానే ఇంటికి ఉరుక తలిగింద్రు.

మా కొండయమామ మురిపెం చెప్పరాదు. తెల్లారి దాసు చిన్నాయినకు తాగినంత కల్లు తాగిచ్చిండట. 'నేను ఏమో అనుకున్న గనీ దాసు బావా... నువ్వు దండోనివి' అన్నడట.

ఇగ మాకు మంచి చాన్స్ దొరికింది. వారం రోజులు ఆగి అదే 'ధర్మ కంకనం' నాటకాన్ని మూడు తొవ్వల దగ్గర ఏసినం. కొండయ మామకు ముందుగనే భయం చెప్పినం. అయినా చేసేది చేసిండనుకో.. ఈసారి ఆటగాకపోతే ఆట కమ్మింది. ఊరు ఊరంతా మెచ్చుకున్నరు.

మేము ఆడిన మూడవ నాడే అదే జాగల స్టేజివేసి జంగం పంతులు మ్యాల్లం వాళ్లు 'మాయాబజార్' ఆడింద్రు. వాళ్లేంతక్కువ తిన్నరా....! మోత మోగిచ్చింద్రు.

ఊరి జనం మాత్రం ఇద్దరూ బాగానే ఆడింద్రు గనీ 'మాయాబజార్' మ్యాల్లపోళ్లు రాగాలు మొదట తీసినంత మంచిగ తియ్యలేదు' అన్నరు. ఆ మాటలే మాకు మనుసు నింపినయి. కొండంత బంగారం దొరికినట్టయింది.

అప్పుడే మేము బాలనాగమ్మ ఆటను నేర్చినం. మేము మ్యాల్లం మొదలువెట్టి రెండేండ్లు దాటింది. ఎందుకోగని మ్యాల్లం ముందటిలెక్క పురిమీద లేదు. ఎవలకు వాళ్లే మొనగాళ్లయింద్రు.

మొత్తం మీద ఊర్లె రెండు మ్యాల్లాలయినయి. నువ్వా నేనా అన్నట్టుంది పోటి. వాళ్ళు మమ్ముల్ని పడగొట్టాలని, మేము వాళ్లను పడగొట్టాలని రియార్సల్ మొదలు వెట్టినం. అటు జంగం పంతులు, ఇటు పున్నయ్య పంతులు మాది గొప్పంటే మాది గొప్పని కొత్త కొత్త పద్దతులు పెడుతంద్రు.

పోటీ మ్యాల్లాలకు గాదు. పంతుల్లకే ఉంది.



# ఇంటికో కత ఉంది

మేమందరం అనుకున్నట్టే కొప్పుల బాలయ్య ఇంట్ల కొట్లాట మొదలయింది. బాలయ్యకు ముగ్గురు కొడుకులు. పెండ్లీలయినయి. ఇద్దరు కొడుకులకు పిల్లలు గూడా ఉన్నరు. సల్లకదులని సంసారం. ఇంట్ల బాలయ్య మాటనే మాట. కొడుకులు, కోడండ్లు ఎవలూ ఎదురు చెప్పరు. గీత వెడితే గీత దాటరు. అట్లా దాబు మీద నడుత్తున్న సంసారంల కొట్లాట మొదలయింది. అది ఏరువడేదాక వచ్చింది.

బాలయ్య నడిపి కొడుకుపేరు చంద్రం. మంచి మాటకారి. చంద్రం మా మ్యాల్లంల కూడిండు. కొద్దిగా సదువస్తది. గొంతు సన్నగుంటది. ఆడివేశం బలే కుదురుతది. వేశానికి తగ్గట్టు నడుమును తింపుకుంట నడుత్తడు. చెలికత్తె వేశం కట్టిండంటే చాలు. ఏ ఒక్కలూ నవ్వకుండా ఉండరు.

చంద్రంకు ఎప్పుడూ మూడు నాలుగు వేశాలుంటయి. అన్నీ ఆడిపాత్రలె. ఎవలన్నా చిన్న చిన్న వేశకాళ్లు రాకపోయినా వాళ్ల పాత్రలను కూడా ఏత్తడు. ఎవరు లేకపోయినా ఆట సాగుతదిగనీ చంద్రం లేకపోతె సాగది.

ఇంకోసంగతి ఏంటిదంటే చంద్రంకు పాటలను ఒంటిచ్చే గుణముంది. పాటలను ఒంటిచ్చుడంటే అప్పటికప్పుడు పాటకు కొత్త పదాలను కలుపుడు. పాట కుదురక పోతే కొత్త పాటను కడుతడు. అట్లా రెండుమూడు భక్తి పాటలను, మా ఊరి అనుమండ్ల దేవునిమీద ఒక మంగళారతి పాటను కట్టిండు చంద్రం.

చంద్రం మాతో నాటుకాలాడుతున్నడుగదా! వాళ్లింట్లో కొట్లాటకు ఇదే కారణం. 'వాడు బాగోతాలాడుతడు. మేము పని జెయ్యాలెనా...? మేం చెయ్యనే చెయ్యం' అన్నరట మిగిలిన ఇద్దరు కొడుకులు.

"నేను బాగోతాలాడితే మాత్రం పని జేత్తలేనా.... ఎనుకో ముందో మీతో వత్తలేనా....? నాకంటే మీరు ఎక్కువేం చేత్తుండ్రు" అని చంద్రం అన్నడట.

"లేదు. నువ్వు బాగోతాలు బందువెట్టాలె. అంతదాకా మేం పనిముట్టం." అన్నదమ్ములిద్దరూ మొండికేసిండ్రట.

"నేను బందువెట్ట. ఆడుడు ఆడుడే" చంద్రం ఇంకా మొండిగా అన్నడట.

తండ్రి ముగ్గురు కొడుకులకు సర్ది చెప్పాలని చూసిండట. ఇద్దరు ముగ్గురు పెద్ద మనుషులతో గూడా చెప్పిండట. ఎవల పట్టు వాళ్లది. ఎవలూ వినలేదట. బాగోతులు వద్దురా అంటే వీడు వినడట. పోతేపోని తియ్యిరా అంటే వాళ్లు వినరట. ఎసోంటి సంసారం ఎట్లగావట్టెనని బాలయ్యకు రంది మొదలయిందట.

బాలయ్యగూడా చిన్నప్పుడు నాటుకాలు ఆడినోడేనట. ఇప్పుడు వయసు ముదిరిందిగనీ ఈడు మీదున్నప్పుడు తబులాచప్పుడు వినబడితే కాలు నిలువక పోవునట. వాళ్లు ఒకసారి 'కంసమర్ధన' ఆటను వేసిండ్రట. కంసునిది కృష్ణునిది రెండు వేశాలు తనకే కావాలని బాలయ్య పట్టువట్టిండట. రెండు వేశాలు ఎట్లేత్తవు. ఇద్దరు ఒక్కసారి వచ్చి వాదం పెట్టుకుంటరుగదా అంటే వినడట. ఒకల పాట పాడినంక ఇంకొకల పాట పాడుతానంటడట. ఈ విషయం మా బాపు చెప్పిండునాకు.

ఈ కత ఇట్లుంటే సాకలి రంగవ్వ కథ ఇంకోటుంది. మా మ్యాల్లంల మనిషి రంగవ్వకు ఎక్కడ ఎదురైనా తిట్టని తిట్లు తిడుతుంది. ఒకసారి నన్ను చూసి సాదు కండలు పోసింది. ఎందుకంటే రంగవ్వకు ఒక్కడే కొడుకు. భర్తలేదు. చిన్నప్పుడే తమ్ముని



బిడ్డను తెచ్చి లగ్గం జేసింది. పిల్ల తండ్రయిండు. మా మ్యాల్లంల కూడిండు.

అప్పటినుండి పనికి వంగుతలేడట. ఇంటిపట్టున ఉంటలేడట. ఒకటి చెబితే ఒకటి చేత్తండట. మక్కలు వేసేయాల్లకు మ్యాల్లంల తిరిగిండట. ఎవలనో బతిమిలాడి మక్కలు ఏసుకుందట. దున్నినోడు సక్కగ దున్నక మొత్తం గడ్డి మొలిచిందట. మక్క కర్రలు పలుచగా లేచి సగం పంటగూడా రాలేదట. ఇదేంటిదిరా అంటే కుక్క లేచినట్టు లేత్తుండట.

ఇంకో కథ పల్లెమీది గోపయ్యది. మక్కకంకుల మీద మంచెకాడికి కావలి పోతున్నని రియార్సల్‌కు వచ్చిండట. రాత్రి రాత్రి నక్కలు, పందులు మక్క చేన్లవడి చేను చేనంతా ఇరిసి కుప్ప పెట్టినయట. గోపయ్య భార్య ఏడ్సుకుంట అవ్వగారింటికి పోయిందట. చెప్పక చెయ్యక తల్లిగారింటికి పోయిందని కోపంతో గోపయ్య అత్తగారింటికి పోలేదు. భార్య తిరిగిరాలేదు. మూడు నెలల పొద్దునుంచి ఒక్కడే వండుక తింటున్నడు. అయినా మ్యాల్లం ఇడువలేదు.

తెనుగు మైసయ్యను జీతంలనుంచి తీసేత్తనన్నడట పటేలు. ఈ ముచ్చట వాళ్ల నాయినతో చెప్పుతూ 'మీ మైసడు నాదగ్గర జీతముంటడా... బాగోతులల్ల ఉంటడా ఆలోచించుకొమ్మనురా' అన్నడట. మైసని తండ్రి ఒక్కటే మొత్తుకునుడు. బాగోతులద్దురా అంటే వాడు ఇనడు. నేను సావనన్న సత్తగని బాగోతులు మానని మైసడు.

మా మ్యాల్లంల కూడినందుకు ఆవులగాసే బాల్ నర్సుకైతే చేతుల పని ఊడినంత పనైంది. వేరే ఊర్లె నాటకమేత్తే ఒక కైకిలి మనిషిని మాట్లాడి ఆవుల కాడికి పంపి వస్తుండె. ఇట్లా నాలుగైదు సార్లు చూసినంక రైతులు కోపానికి వచ్చిండ్రట. 'మనం వాన్ని కాపలా పెట్టుకుంటే వాడు ఇంకొకన్ని కాపలా పెట్టుకుంటున్నడు. బాల్‌నర్సుగానికంటే వీడే మంచిగా మేపుకస్తుండు. వీన్నే పెట్టుకుందాం. వాడెందుకు...? బాగోతులల్ల తిరిగేటోడు ఆవులగాత్తడా...? అన్నరట.

బాల్‌నర్సు పెండ్లాం ఒక్కటే మొత్తుకునుడు. 'నీ బాగోతం ఇంట్ల పీనుగెల్ల బతుకుదెరువు ఎట్ల' అని రైతులను బతిలాడుతుంది.

అందరిదొక కత అయితే ఆకుల పోశెట్టిది ఇంకొక కత. పోశెట్టిది గూడా పర్మనెంటుగా ఆడివేశమే! రాణి పాత్ర. జుట్టును భుజాల దాకా పెంచుకున్నడు. నాటుకాలు ఉన్నా లేకున్నా మీసాలుంచడు. నున్నగా గీక్కుంటడు. మనిషి తెల్లగా బలంగా ఉంటడు. ఇంకా పెండ్లి కాలేదు. ఎప్పటికీ ఆకు నములుతడు. ఈ అలవాటు గూడా మ్యాల్లంల కచ్చినంకనే మొదలయింది.

తొవ్వంట పోతుంటే  పోశెట్టిని చూసి ఆడోల్లు నవ్వుతరట. ఇంట్లకు రమ్మని ఆకులేసి ఇత్తరట. ఎవలు ఏసి పంపుదురో గానీ మేము నాటుకం వేసేనాడు స్టేజి దగ్గరికి పది పన్నెండు పాన్‌లు వత్తుండే. అందరు పోశెట్టికే పంపుదురు.

ఇది మంచి పద్ధతి కాదని మా కొండయ మామ తిడుతుండె. దాసుచిన్నాయిన 'ఒరే పోడా... ఆడోళ్లు మంచోళ్లు గారు. మరుగుమందు పెడుతరు. అవ్వకొక్క కొడుకువు. గడ్డకు గడ్డ గుటుక్కుమంటవు' అని తిడుతుండె.

ఒకసారైతే పటేండ్ల చిన్న జీతగాడు రెండు పాన్‌లు లాగు జేబుల పెట్టుకచ్చి పోశెట్టికి ఇచ్చిండు. అవి మా కొండయమామ కంట్ల పడ్డయి. ఆకులు ఇప్పి మేక గొతికలేసికట్టిండు మామ. తెలువక రెండు పాన్‌లు తిన్నడు పోశెట్టి. తిన్నంక ఎట్లున్నయని మామ అడిగితే కొద్దిగా ఒగరు వక్కలు ఎక్కువైనయిగనీ కొండన్నా... ఏం రుచి... ఎంతయినా దొర్సానులు దొర్సానులే...' అన్నడట.

ఆఖరుకు మా మామ అన్నట్టే అయింది. ఒకనాడు కూరుకు రాత్రి గరిశెలగడ్డకు గడ్డివాముల పోశెట్టిని దొరుకవట్టి పొట్టు పొట్టు తన్నింద్రట. చీకటిపూట. వచ్చింది ఎవలో తెలువది. తన్నింది ఎవలో తెలువది. పోశెట్టి మాత్రం వారం రోజులు కోలుకోలేదు. బయట పడనియ్యలేదు గనీ బండారి గాలయ్య పెద్దబిడ్డకు ఆగమాగాన లగ్గం జేసింద్రు.

మంగలి నారాయణకు ఎవలో మంత్రం జేసింద్రట. ఎదురు బొచ్చె తేలి ఎండుకపోతండు. వాళ్ల అవ్వా నాయినా శివసత్తుల దగ్గరికి తిరుగుతంద్రు. అయినా వాడు మ్యాల్లంలకత్తుండు.

ఇగ మా కొండయ మామను తాత ఇల్లు కదులనిత్తలేడు. మామకు మొన్ననే పెండ్లయింది. ఇంతకు ముందు ఎటు తిరిగినా పట్టించుకోని తాత ఇప్పుడు చీకటి పడితే కడుప దాటనిత్తలేడు. అంతే కాదు. 'ఊర్లె నుంచి ఈ పంతులును పంపిత్తేగాని పోరగండ్లు తొవ్వకురారు' అంటున్నడు.

ఇగ నా కథ జూడు. ఇస్కూల్ల హాజిరి తక్కువయింది. యూనిట్ అసైన్‌మెంట్ పరీక్షలైతే రాయనే లేదు. అన్నీ గీతలు పెట్టి ప్రొగ్రెస్ కార్డు ఇత్తే మా బాపు సంతకం నేనే పెట్టి ఇచ్చిన. సార్లు రూములకు అడుగు వెట్టంగనే నన్నే చూస్తంద్రు. నాది ముందటి బెంచేనాయె. 'ఆ... బాగోతులోడు వచ్చిండారా..... ఇయ్యల్ల ఏ ఊర్లెలేదారా... బాగోతం' అంటుంద్రు నా పేరు 'బాగోతులోడే' అయిపోయింది.

ఈ కథలన్నీ ఇట్లుంటే గొల్లపెల్లిల నాటకాన్ని మాట్లాడుకచ్చిండు మా పంతులు. అక్కడ గంగమ్మ జాతర అయితందట. నాటుకం వెయ్యాలన్నరట. ఖర్చుల మందమైనా



వస్తయోరావో అని మా పంతులు అనుమానపడితే నూట పదహారు రూపాయలకు ఎవలో గుత్త పట్టుకున్నరట. ఎక్కువేరానీ తక్కువేరానీ, నూట పదహారు రూపాయలు మాకు ఇయ్యాలె. అప్పుడు పనిగూడా లేదు. అందరం సరేనని ఒప్పుకున్నం.

కొంతమంది పగటి యాల్లనే సైకిళ్లమీద పోయింద్రు. సామానులన్ని సైకిల్ల మీద తీసుకపోయింద్రు. మేం నడిచి వత్తమని కొందరు ఊర్లెనే ఉన్నరు. పంతులు సిరిసిల్లకు పోయి మైకు కిరాయికి తెచ్చిండు. గొల్లపెల్లి ఊరు రోడుమీదనే ఉంది. మైకు సామానంతా బస్సులనే తెచ్చిండు.

సైకిళ్లమీద పోయినోళ్లు స్టేజివేసింద్రు. మైకుల అడ్వైటేజ్ జేసింద్రు. గుత్తపట్టుకున్న మనిషి టికెట్లు అమ్మిండు. జనం బాగానే వచ్చింద్రు. ఊరినుంచి నడిచి వత్తమన్న వేశకాళ్లు మాత్రం రాలేదు. కూరుకురాత్రి దాటింది. ఎట్లా....?

చూసి చూసీ ఎంతకూ రాకపోయేసరికి నాటుకం నడువదని, రేపు ఫ్రీగా ఆడుతమని మైకులో చెప్పినం. రెండువందల రూపాయలచ్చినయట టికెట్ కలెక్షన్. ఇక్కడనే ఉంటే పైసలడుగుతరని గుత్త పట్టుకున్న మనిషి మాయమైపోయిండట. జనం మానెత్తిమీదికచ్చి కూసున్నరు. 'పైసలిత్తరా ఆడుతరా' అని వాదానికి దిగింద్రు.

ఇంకా కొద్ది సేపైతే ఏం జరిగేదోకానీ మా వేశకాళ్లు అప్పుడే వచ్చింద్రు. ఇంట్లో రానియ్యలేదని, తప్పించుకుని వచ్చినమని బాధపడ్డరు. అయిందేదో అయింది. ముందుగాళ్ల నాటుకం ఆడుదామని వేశాలమీద కూసున్నం. అప్పటికప్పుడు ఆడుతున్నామని మైకుల జెప్పి అత్తరో బుత్తరో ఏశాలుగట్టి ఆట మొదలువెట్టినం.

అది హరిశ్చంద్ర నాటకం. ఏదో ఆడింద్రా అంటే ఆడినం అన్నట్టు ఆడుదామనుకున్నం. కానీ ఆట మంచి రక్తిగట్టింది. జనం ఏడ్వనోళ్లులేరు. కూసున్నరంటే ఎవ్వలూ లెవ్వలేదు. ఆట పూర్తయ్యేవరకు పొద్దు కరకర పొడిచింది. అంతవరకు గూడా జనం వెళ్లిపోలేదు. కూసున్న జాగలనుంచి లెవ్వలేదు. మంగళారతి పాటవాడి ఆట అయిపోయిందన్నంక లేచింద్రు. మాకైతే కడుపు నిండినట్టయింది.

ఆ రోజు గొల్లపల్లి ఊర్లె పొద్దుబారెడు ఎక్కినంక వాకిళ్లు ఊడ్చి సానుపు చల్లింద్రు. మేము మెల్లగ లేచి పండ్ల పుల్లలేసుకుని ఊరి మొఖం పట్టినం.

# కర్రె కుక్కనే బాలనాగమ్మ

ఏ నాటుకమైనా సరే మంచిగా కమ్మాలంటే బుడ్డెనుకాడు ఉషారుగుండాలె. బుడ్డెనుకాడంటే జోకర్. ఈ పాత్ర అచ్చు పుస్తకంల ఉండది. రాజు వేశం వచ్చినప్పుడు మంత్రిలెక్క, రాణి వేశం వచ్చినప్పుడు చెలికాని లెక్క, వేరే చిల్లర చిల్లర వేశాలు వచ్చినప్పుడు బుడ్డెనికాని లెక్క, పాత్రలన్నిటినీ పరిచయం జెయ్యాలె. ఏ రాజ్యం, ఏం పేరు, ఎటువోతున్నవని అడుగాలె. అదోటి ఇదోటి డిల్లేకి మాటలు చెప్పి అందరినీ నవ్వియ్యాలె.

ఎప్పుడన్నా మేకప్ రడీగాక టయానికి ఏశం రాకపోతే ఏశం వచ్చేదాక ఏదో పిట్ట కథనో పాటనో అందుకోవాలె. ఎప్పుడన్నా ఏశకాళ్లు వచనం తప్పు చెప్పితే సవరిచ్చి చెప్పాలె. ఏశకాళ్లందరు పాడిన పాటలే పాడుతరు. చెప్పిన వచనమే చెప్పుతరు గనీ, బుడ్డెనుకాడు చెప్పిన జోకులు చెప్పద్దు. ఆట ఆటకు కొత్త కొత్త జోకులు చెప్పాలె. రకరకాల పాటలు అప్పటికప్పుడు కైగట్టి పాడాలె.



ఇవన్నీ పంతులు చెప్పడు. పుస్తకంల దొరుకయి. వాళ్లకు వాళ్లే పుట్టియ్యాలె. మాటలు, పాటలు ఒంటియ్యాలె. అందుకని అన్ని వేశాలకంటే బుడ్డెనుకాని వేశం కష్టం. ఇంకో కష్టమైన పనేంటిదంటే ఏశాలన్నీ ఇటు వచ్చి అటు వోతయి. బుడ్డెనుకాడు మాత్రము ప్రార్థనతో వచ్చి మంగళారతి పాట దాక ఉండాలె. అసొంటి డిల్లేకి మనుషులు మా మ్యాల్లంల లేరు. ఏవో పంతులు జెప్పిన నాలుగు జోకులు తప్ప పుట్టిచ్చి చెప్పే తెలివి ఎవ్వలకు లేదు.

మాకు లేకపోతే లేకపాయె. ఎట్లనో ఎల్లదీత్తము. ఇన్ని రోజులు ఎల్లదియ్యలేదా? ఇప్పుడు గట్లనే ఎల్లదీత్తుముగనీ మాకు పోటీగా పెట్టింద్రే ఏశాల రాములు మ్యాల్లం. అందులో కొండం రాజయ్యది జోకర్ ఏశం. వాడు వచ్చిండంటే కతం. కడుపులు కుట్లువట్ట నవ్విత్తడు. పిచ్చిపిచ్చిగా జోకులేత్తడు. అన్నీ డబుల్ మీనింగు మాటలు మాట్లాడుతడు.

వాళ్లు మొన్ననే 'బాలనాగమ్మ' ఆటాడింద్రు. ఒక్కనికి పాట సరిగ్గా రాలేదు. పద్యాలు సరిగ్గా పాడరాలేదు. బాలనాగమ్మ ఆట జూత్తుంటే జనం గొడగొడ ఏడ్వాలె. మానిక్యాలదేవి మరుమన్న పిల్లలను కట్టపెడుతున్నప్పుడు, ఏడుగురు ఆడిపిల్లలను రాజు అడివిలో విడిచిపెట్టినప్పుడు, పద్యాలు పాడుతుంటే పొలగాండ్లకు ఎంత కట్టమచ్చెనని కంట తడివెట్టాలె. బాలనాగమ్మను మాయల పక్కీరు కర్రె కుక్కను జేసి తీసుకపోతుంటే జనం పక్కున పలుగాలె. మాయల పక్కీరు వచ్చిండంటే టేటర్ గడగడ వనుకాలె.

ఏశాల రాములు మ్యాల్లంల ఇవేవీ లెవ్వు. జనం ఒక్కడంటే ఒక్కడుగూడా కంటతడే పెట్టలేదు. మాయలపక్కీరు ఏశమేసిన బచ్చు మల్లయ్యకైతే గూతనే ఎల్లలేదు. గట్టిగ గాలివెడితే కొట్టుకపోయేట్టున్నడు. అయినా వాళ్లకు మంచి పేరచ్చింది. ఏం ఆటరా అంటే ఏమాటరా అన్నరు. బలే ఆడింద్రని పొగిడింద్రు.

అట్లా పేరు వచ్చుడుకు కారణం జోకర్ ఏశమేసిన కొండం రాజయ్యనే! వాడు అప్పటికప్పుడు ఎన్నో జోకులు చెప్పిండు. దోమకత చెప్పితేనైతే నవ్వనోళ్లు లేరు. గమ్మతి గమ్మతి పాటలు గట్టిండు. 'అడ్డెనుక బుడ్డెనుక రాంతాతా... నీ గడ్డంల నా...' మోటు పాట వాడితే నవ్వుడే నవ్వుడు.

మా మ్యాల్లంల పాటలు పాడేటోళ్లకు తక్కువేంలేదు. ఏ రాగమంటే ఆ రాగం. ఏ పాటంటే ఆ పాట. ఏ తరీఖంటే ఆ తరీఖన ఎత్తుతరు. దించుతరు. రాగం మీదనే జనాలను గొడగొడ ఏడిపిత్తరు. ఇప్పుడు మాకు కావలిసింది నవ్విచ్చే మనిషి. కొండం రాజయ్యకు సరి సమానమైన మనిషి మా మ్యాల్లంల ఎవలూ లేరు.

దుఖసారముండే బాలనాగమ్మ ఆటను జోకులు చెప్పి మంచిపేరు తెచ్చుకున్నరు

వాళ్లు. అదే ఆటను ఆడి జనాలను నవ్విచ్చి, ఏడిపిచ్చి మెప్పిచ్చి ఆటంటే ఇట్ల ఆడాలెనని పేరు తెచ్చుకుని, వాళ్లను పడగొట్టాలని మా కొండయమామ ప్లాను. అనుకున్నట్టుగనే బాల నాగమ్మ నాటుకం నేర్చినం. అది యక్షగానం. కానీ నాటుకం స్టైల్ తీసినం. పాటలను ఆట తాళం నుంచి రూపక తాళానికి తెచ్చినం.

అప్పుడే ఎంకట్రెడ్డి బిడ్డలగ్గమైంది. దాసు చిన్నాయిన కొండయమామ ఇద్దరూ ఎంకట్రెడ్డి దగ్గరికిపోయి 'పటేలా మీరు ఇంతటోళ్లు అంతటోళ్లని' బత్తిగొట్టి ఆటను ఖాయం జేసింన్రు. మూడు తొవ్వలకాడ ఆట వెయ్యిమని ఇన్నూట పదారు రూపాయలు ఇచ్చిండు పటేలు.

మాకు మంచి చాన్సు దొరికింది. ఆటను మంచిగా ఆడి మేమంటే ఏమిటో చూపియ్యాలనుకున్నం. కానీ మాకు జోకర్ ఏశం తక్కువుందికదా! అన్నారం రెడ్డిపేటనుంచి ఇరువై రూపాయలిత్తమని ఒక జోకర్ ఏశకాన్ని తోలుకచ్చినం. అతని జాడ మా పంతులే చెప్పిండు. వాళ్లకు గూడా ఒక మ్యాల్లముందట. దాంట్లో ఈయన్నే పర్మినెంటు బుడ్డెనుకాడట. బాలనాగమ్మ ఆటను మత్తుసార్లు ఆడింన్రట వాళ్లు.

ఆటలో కొండయ మామది మాయల పక్కీరు ఏశం. నేను బాలవద్దిరాజును. దాసు చిన్నాయిన కార్యవద్దిరాజు. కొండయమామ ఏశంకోసమే కర్రెకుక్కను పెంచుకున్నడు. అది కార్తీక పున్నమి సందు. వానలు గుంజుకున్నయి. సలికాలం మొదలు కాలేదు. ముందటి చేన్లు కోతకచ్చినయి. ఇంకా కోతలు పట్టలేదు.

పీరీల మసీదు ముందు స్టేజి వేసినం. ఈ నడుమ మైకులేకుంటే ఆట సాగుతలేదు. అందుకని మైకు తెచ్చినం. గడీల టికెటు పెట్టి ఆడితేనే అడ్విటేజ్ జేత్తం. బజార్ల ఆడితే అడ్విటేజుండది.

ఏమో అనుకున్నంగనీ కొత్త బుడ్డెనుకాడు అనుకున్నదానికంటే ఎక్కువనే చేసిండు. 'దగ్గువడిశం పట్టింది అవ్వలారా నా దగ్గరికి రాకుంన్డ్రి అవ్వలారా' అన్న పాట వాడితే జనం నవ్వుడేగాదు. భూలచ్చిమిదేవికి పాము కుట్టినప్పుడు జనం ఏడ్సుడే గాదు. నడుమ నడుమ బుడ్డెనుకాడు చెప్పే పిట్టకతలకు మేమే నవ్వును ఆపుకోక పోయినం. ఇది జూసి ఇంకా ఎక్కువ జోకులు చెప్పుడు వెట్టిండు బుడ్డెనుకాడు.

ఆడోల్లకు అతుక్కుంటది. మొగోళ్లకు యాలాడుతది. ఏంటిదని శాత్రం చెప్పి చెలికత్తె ఏశమేసిన చంద్రంను ఆటాడిచ్చిండు. రాణి సంతానం అయితలేదంటే వంద చెట్లపేర్లను గడగడ సదివి దంచుకుని కషాయం తాగుమన్నడు.

రాణికి సంతానం కలిగినప్పుడు 'జో అచ్చుతానంద జోజో ముకుందా... రార



పరమానంద రామగోవిందా... అటుముట్ట ఇటుముట్ట నీకు కిసరు వెట్ట. మల్లచ్చె పండుక్కు నిను బొందవెట్ట' అని పాడితే జనం నవ్వుడే నవ్వుడు.

మాయల పక్కీరు ఏశం వచ్చింది. ఎంబడి డింగిరి గాడుండాలె. బుడ్డెనుకాడే డింగిరిగాడు. అక్కడ మాయల పక్కీరు డింగిరిగాన్ని 'సురాపానం తేరా... సేవిద్దాం' అనాలె. డింగిరిగాడు రెండు సీసాలు తెచ్చి ఒకటి పక్కీరుకిచ్చి ఇంకొకటి తను తాగాలె. ఈ బుడ్డెనుకానికి సార తాగే అలువాటుందట. ముందుగనే ఒక సీసల సార తెచ్చుకుని దాచి పెట్టుకున్నడట. ఈ సంగతి మాకు తెలువది.

ఎప్పుడైతే కొండయమామ 'సురాపానం' అన్నడో అప్పుడే బుడ్డెనుకాడు సారా సీస తను తీసుకుని నీళ్ల సీసను మామకిచ్చిండు. ఇద్దరూ యాక్షన్ జేసుకుంట తాగింన్రు. బుడ్డెనుకాడు సొలుగుతుంటే అందరూ యాక్షనే అనుకున్నరు. తత్తర బిత్తర మాట్లాడుతుంటే కావాలనే మాట్లాడుతున్నడనుకున్నరు. కొండయమామనైతే 'అరే అచ్చం తాగినోడు మాట్లాడినట్టే మాట్లాడుతున్నడు' అనుకున్నడట.

ఎప్పుడైతే బుడ్డెనుకానికి కడుపుల సారవడ్డదో అప్పుడు మాటనే వేరయింది. అన్నీ మోటు మాటలే మాట్లాడుతండు. 'పోరగండ్లు రా... పోరగండ్లురా.. పోరగండ్ల...' అని ఓ బూతు పాటను అందుకున్నడు. బుడ్డెనుకాన్ని ఎవలూ తప్పువట్టరు. ఏమాట మాట్లాడినా నవ్వుతరు. ఈ పాట విని జనం గూడా నవ్వుతంన్రు. కొందరు మాత్రం తిడుతుంన్రు.

ఆట సాగుతుంది. మాయల పక్కీరు బాలనాగమ్మను కుక్కను చేసుకుని వచ్చిండు. అప్పటికి మా ఆట మోత మోగుతుంది. తాగింది నెత్తికెక్కినంక బుడ్డెనుకాడు ఏదేదో అంటుండు. అడ్డం బడుతుండు. అందరూ అదంతా యాక్షనే అనుకుంటుంన్రు.

కొండయమామ స్టేజి మీదికి వచ్చిండు. ఎంబడ కర్రెకుక్క ఉంది. కుక్కను గొలుసుపెట్టి చేతులపట్టుకున్నడు. 'ఒరే డింగిరీ అని పిలిచిండు.

'క్యాహోనా పక్కీర్ సాబ్' అని వచ్చిండు జోకర్.

"ఒరే డింగిరీ.. ఇదిగోరా బాలనాగమ్మను తెచ్చిన. ఎంత అందంగా ఉందో చూడు" అన్నడు మామ కుక్కను చూయించుతూ.

"ఓయ్. ఇది నాగమ్మనా... ఈ కర్రెకుక్క బాలనాగమ్మనా.. క్యా పక్కీర్ సాబ్... జూటా బోల్‌రాక్యా" అన్నడు జోకర్.

"కాదురా... నిజంగనే బాలనాగమ్మను తెచ్చిన. ఒకసారి మంచిగ సూడు." పక్కీరు నవ్వుతూ అన్నడు.

జోకర్ గాడు కుక్కసుట్టూ రెండుసుట్లు తిరిగిండు. 'ఇది నాగమ్మనా.. నిజంగ నాగమ్మనా... నాగమ్మ... ఓ నాగమ్మ.. నీ మొఖమేది నాగమ్మా... నీ ముక్కేది నాగమ్మా.... నీ అందమేది నాగమ్మా...' అంటూ కర్రెకుక్కను తోకవట్టుకుని పీకిండు. చెవులు వట్టుకుని ఊపిండు. బూరు వట్టుకుని ఎగిరిండు. అందరూ నవ్వుడే నవ్వుడు.

అది అసలే మందకాడి కుక్క. నక్కలను తోడేళ్లను గెదిమి మందకావలి కాసింది. బలంగా గెచ్చుకుగెచ్చుంది. రోజు మూడు పూటల తిండి పెట్టుట్ల మామతోని తిరుగుతుందిగనీ అది అడివిపొంట తిరిగేదే! మొదలు మొదలు తోక పీకుతుంటే కుయ్ కుయ్‌మని వట్టిగనే ఉంది. జనం నవ్వుతుంటే బుడ్డెనుకాడు ఇంకా గట్టిగ పీకిండు.

కుక్కకు తిక్కలేసినట్టుంది. రెండు కాళ్లమీద 'భౌ' మని లేచింది. బుడ్డెనుకాన్ని అందుకుంది. అంగిని చీరుకలు చీరింది. మీదికి కలెవడ్డది. వాడు కింద అది మీద. 'బౌ బౌ' మనుకుంట పిక్కలు అందుకుంది. ఇదంతా సూత్తుండగనే జరిగిపోయింది. పరుదాసందుల నుంచి మేము సూత్తనే ఉన్నం. కుక్క గొలుసు కొండయమామ చేతులనే ఉంది.

బుడ్డెనుకాడు ఒక్కటే మొత్తుకునుడు. లాగుమొత్తం నానింది. ఆఖరుకు కొండయమామనే గొలుసువట్టి కుక్కను గుంజిండు. బలంగా గుంజినా రాలేదు. పరుదా ఎనుకన ఉన్నోళ్లు ఇద్దరు ముందుకురికి గుంజిండ్రు. అప్పటికి జోకర్ గాడు పొట్టుపొట్టయిండు. తాగినదంతా దిగిపోయింది. కుక్కను గెదుముడు గెదిమితే మందిలనుంచి బయటకురికింది.

జనమంతా లేచి స్టేజి దగ్గరికచ్చిండ్రు. కేకలు బొబ్బలు. బుడ్డెనుకాని పెయ్యంతా రక్తమే. బట్టలన్నీ రక్తమే! చేతులది చేతులనే క్యాల్లిదప్పిండు బుడ్డెనుకాడు. ఆ రక్తాన్ని చూస్తే మాకే భయమేసింది. ఆట ఎటువోయిందో, బాగోతమెటుపోయిందో, రాత్రికి రాత్రే దవాఖానకు తీసుకపోయినం.

కుక్కకాటుకు మందులు, మంత్రాలు, కారం మెతుకులు, బొడ్డు సుట్టు సూదులు. పత్తెంగట్టుడు చెట్లమందులు పోసుడు... బుడ్డెనుకాడు మందిల కలువడానికి ఆరునెల్లు పట్టింది.

ఈ మందులు గోళీల ఖర్చంతా మామీదనే రుద్దాలని చూసిండ్రు. కానీ బుడ్డెనుకాడు నియ్యతు మనిషి. తప్పంతా తనదేనని సారా తాగుట్లనే క్యాల్లిదప్పి ఇంతపని జరిగిందని చెప్పిండు. అంతవరుదాక వాడు సారా తాగిండని మాకు తెలువనే తెలువది.



# పిచ్చకుంట్ల బాగోతం

మేము వేరే ఊర్లె ఎక్కడన్నా నాటకం వెయ్యాలనుకుంటె మొదట ఒకలిద్దరం సైకిల్‌మీద ఆ ఊరికి పోతం. స్టేజి ఎక్కడ వెయ్యాలో సూత్తం. సర్పంచ్‌ను ఇద్దరు ముగ్గురు పెద్దమనుషులను కలుత్తం. ఆ ఊర్లె ఇంతకుముందు ఎవలన్నా ఆటలు ఆడిండ్రా తెలుసుకుంటం. ఎవరన్నా మ్యాల్లం గట్టిండ్రా తెలుసుకుంటం. ఎవలన్నా మంత్రగాళ్లున్నరా అన్న సంగతి గూడా తెలుసుకుని ఇంటికివస్తం. అందరం కలిసి ఎన్నడు పోవాలో మాట్లాడుకుంటం. రెండుమూడు రోజులు రియార్సల్ జేస్తం.

సైకిళ్ల మీద మనిషికొక సామాను తీసుకుని పగటి యాల్లవరకు ఊరికి పోతం. మైకు పెట్టాలనుకుంటే ముగ్గురు సైకిళ్లమీద సిరిసిల్లకు పోయి పొద్దుగూకేవరకు మైకు తెత్తరు. మా ఎంబడి ఎలితబొంగులు, పరుదాలు, తబులాలు, ఆర్మాను, మేకప్ సామాన్లు బాగానే ఉంటయి.

"నారాయణ పొరం'ల ఆట ఆడుదాం. ఇప్పుడేం పని లేదుగదా... ఇండ్లల్ల గూడా ఏమనరు. పనున్నదినమైతే తిడుతరు" మా కొండయమామ అన్నడు. అందరు సరే అన్నరు.

అనుకున్నట్టే సైకిండ్ల మీద సామాన్లు కట్టుకుని నారాయణపురం బయిలెల్లినం. అది శివరాత్రి శీతలమాస సందు. కలుపులు అయిపోయినయి. ఎండలు అప్పుడప్పుడే ముదురుతున్నయి. ఊరు చేరుకుని కర్నాలగోడలల్ల స్టేజివేసినం. ఊరంతా తిరిగి అడ్విటేజ్ చేసినం. బారాన టికెటు పెట్టినం

ఇంతకుముందు స్టేజి వేసేటప్పుడు ఎంతమంది ఉందురో స్టేజి విప్పేటప్పుడు గూడా అంతేమంది ఉందురు. అడుక్కచ్చిన సామాన్లు ఎవరియి వారికి అప్పగిస్తురు. మా పరుదాలు, కట్టెలను ముల్లెకడుదురు. ఇప్పుడు ఏమైతున్నదంటే స్టేజి వెయ్యంగ వేత్తున్నరు. ఇప్పేటప్పుడు మాత్రం ఎవలూ ఉంటలేరు. వేశాలు ఇప్పంగనే అందరు మాయమై పోతున్నరు. సామాన్లు ఇప్పుడు కట్టుడు మోసుడు కొండయమామ వంతే అయితుంది.

అందుకని స్టేజి ఏసేటప్పుడే చెప్పిండు మామ. "ఒరేయ్ ఏసేటప్పుడు ఏత్తండ్రు. తీసేటప్పుడు మాత్రం ఎవలూ ఉంటలేరు. మీతాత ఇప్పుతడనుకుంటుండ్రా. ఇవన్నీ ఎవలు మోత్తరనుకుంటుండ్రు. ఇప్పుడే చెప్తుతున్న స్టేజి ఇప్పి సామాన్లన్ని ముల్లె కట్టెదాక ఎవలూ కదులద్దు. ఎవలకు అప్పజెప్పిన ముల్లెను వాళ్లు ఇంటికి పట్టుకపోవాలె".

అందరూ మంచిదని తలకాయ ఊపిండ్రు. ఎప్పుడూ అట్లనే ఊపుతరు. ఏశాలు ఇడువంగనే ఎవ్వలూ కనవడరు. ఎక్కడోళ్లు అక్కడ జారుకుంటరు. ఇంతకుముందయితే భయంమీదుందురు. మామ కన్ను సైగ జేత్తె సైగ మీద నడుచుకుందురు. మామ భయం లేకున్నా పంతులు భయమన్నా ఉంటుండె. ఇప్పుడు ఏదీలేకుంట పోయింది. మాట్లాడితే మర్రవడుతున్నరు.

ఇట్లయితే ఇనరని మా కొండయమామ ఒక ఐడియా చేసిండు. ఏశకాల్లందరూ బట్టలు ఇడిసి ఏశాలు ఏత్తరుగదా! అట్లా ఏశాలు ఏసేటప్పుడు ఇడిసిన బట్టలు తీసి ముల్లెకట్టి దాచిపెట్టిండు. స్టేజి మొత్తం ఇప్పేసి ఎవల సామాన్లు వాళ్లు ముల్లెగట్టుకుంటేనే బట్టలు ఇత్తనని చెప్పిండు.

ఒకలిద్దరు కోపానికచ్చి "బట్టలు దాచిపెట్టుడెందుకు..? మేము అంత దొంగలమా..." అన్నరు. మామ గూడా కోపానికచ్చిండు. "ఎక్కడోళ్లు అక్కడ దొరలలెక్క తుడుసుకునిపోతే ఈ ముల్లెలు మూటలు నేను మొయ్యాలెనా... నాపెండ్లి కొరకు ఎత్తండ్రా ఏంది...? అందరిని నిలవెట్టే జిమ్మదారు నీదేనా" అని అడిగిండు.

ఎవలూ నోరు తెరువలేదు. ఆట మొదలయింది. మేము ఆడుతున్న ఆటపేరు



'క్రూరసేన'. తక్కువమందే వచ్చిండ్రు. అంతా అరువై రూపాయలన్నా రాలేదు. అంతదూరం నుంచి ఇంతదూరమత్తే నూరు రూపాయలన్నా రాకపాయెనని మనుసు నారాజయింది. మైకు కిరాయే నలుబైరూపాయలు పోతయి.

"అట్ల లెక్కలు చూసుకుంటరా.... ఇట్ల తయారయిండ్రు?. ఇంతకుముందు మంచిగ ఆడాలందురు. ఇప్పుడు పైసల కొరకు చూస్తండ్రు. ఇక్కడ గాకుంటే ఇంకోజాగలత్తయి. ఆట మాత్రం మంచిగా ఆడాలెనా వద్దా" అన్నడు మా పంతులు కోపంగా

మొఖాలకు రంగుపూసుకున్నా అందరికీ మనుసుల అదే సంగతి మెదులుతుంది. పాటలు సక్కగ పాడలేదు. వచనం సక్కగ చెప్పలేదు. రెండుమూడు వాదాలను పడగొట్టిండ్రు. ఎవరికి తెలువదనుకున్నరు.

ఈ 'భద్రసేన విలాసము' ఆఊరి వాళ్ళే నేర్చి ఆడిండ్రట. ఎట్లాడుతరో సూద్దామని వచ్చి ముంగటనే కూసున్నరట. ఈ సంగతి మాకు తెలువది. మేము ఎప్పుడైతే పాటలను సక్కగ పాడుతలేమో అప్పుడే గుర్తువట్టిండ్రు. వాళ్లండ్ల వాళ్లే బదులుకున్నరు.

కొండయ మామది క్రూరసేనుడివేశం. ఎగురుతున్నడు. దుంకుతున్నడు. ఆకుల పోశెట్టిది ఆడివేశం. క్రూరసేనుడి వదినె. క్రూరసేనుడు అన్నను చంపి రాజ్యాన్ని ఆక్రమించి వదినెను పొందాలనుకుంటడు. వదినె ఇదిపాపమని అడ్డు చెప్తుతుంది. ఆ వాదం జరుగుతుంది ఇప్పుడు. మామ పాటలన్నీ పాడుతుండు. వచనం చెప్తుతుండు. పోశెట్టిమాత్రం పాటలన్నీ పడగొడుతుండు. ఒకటో రెండో పాడిండు అంతే!

నిజంగా అప్పుడు జనమంతా ఏడ్వాలె. క్రూరసేనున్ని తిట్టాలె. మేము మొదట ఊర్లె ఈ ఆట ఆడిన్నాడు ఇదే వాదం జరుగుతుండంగ కుమ్మరి మల్లమ్మ లేచి 'ఓ ముండకొడుకా... ఏం బుట్టిందిరా... నీతలపందువలుగ... అన్నెంపున్నెం తెలువని పొల్లను గోసపుచ్చుకుంటన్నవు. మనిషివిగాదురా' అని తిట్టింది.

ఇప్పుడు ఏడ్పుడులేదు తుడుసుడులేదు. పోశెట్టి 'నను ముట్టరాకూ దురాత్మా' అనే పాటను గూడా ఎత్తగొట్టిండు. ఆ పాట మంచిపాట. రాగంతీసి పాడుతుంటే మనుసు కలికలి గావాలె. ఈ నాటుకం పేరెత్తితే మొదట అదే పాట యాదికి రావాలె. ఎప్పుడైతే ఈ పాట ఎత్తగొట్టిండో అప్పుడే ముందు కూసున్న ఐదుగురు వేశకాళ్లు లేచిండ్రు.

"ఓయ్.... ఏమాటాడుతున్నవు....? ఎన్నడన్నా ఆడిన మొఖమేనానీది. పిచ్చకుంట్ల బాగోతమాడుతుండ్రు. ఈ దండి ఆటకు ఆ ఊరునుంచి ఈ ఊరుకచ్చిండ్రా... రీతి మీదనే ఆడుతుండ్రా... నీ ఆట....' ఒకడు గట్టిగా అన్నడు. ఇంకొకడు మేము ఏ వాదాలను ఎత్తగొట్టినమో ఏ పాటలను పాడలేదో చెప్పిండు. అందరికీ గుండె జల్లుమంది. ఒకడైతే

మైకు ముందుకువచ్చి 'ననుముట్టరాకూ...' పాటను యాక్షన్‌తోని పాడిండు.

కొద్దిసేపు వాళ్లకూ మాకూ గిలగిలయింది. మా పంతులు అందరిని సముదాయించి కూసుండవెట్టిండు. అక్కడినుంచి ఆట పడగొట్టకుంట నడిచింది. ఎక్కడ కొద్దిగా తప్పువోయినా వాళ్లు ఊరుకుంటలేరు. మైకు ముందుకచ్చే పాడుతుండ్రు. వాళ్లు ఊరోల్లయిరి. మేము పరాఊరోల్లమైతిమి జనం గూడా వాళ్లకే సపోటున్నరు.

అటో ఇటో ఆట అయిపోయింది. అందరు ఏశాలు ఇప్పిండ్రు. సామానులన్ని సదిరితెనే బట్టలిత్తనన్నడు కొండయమామ. మనిషికొక చెయ్యేసి శాందిరి ఇప్పినం పరుదాలు ముల్లెగట్టినం. బొంగులను కట్టగట్టి సైకిండ్లకు కట్టినం. మా ఆగంల మేముంటే కొండయమామ ఆగంల కొండయమామ ఉన్నడు.

మా బట్టలన్నీ లుంగీల ముల్లెగట్టి పక్కనే ఉన్న పాతగోడ సాటుకు దాచిపెట్టిండట. ఎవలు ఎత్తుకపోయిండ్రోగనీ ముల్లెకుముల్లె మాయమైంది. పెరడంతా లెంకుతున్నడు. జాడ దొరుకుతలేదు.

అందరియి పైంట్లు, అంగీలు, దోతులు, తువ్వాలలు బనీన్లు అందులోనే ఉన్నయి. ఇప్పుడు మా పెయిలమీద ఆడివేశకాల్లకు చీరలు, మగవేశకాల్లకు దోతులు అవి గూడా పట్టు పితాంబురాలే ఉన్నయి. ఏదో గులుక్కుంటు పెరడంతా దేవులాడుతుండు కొండయ మామ.

మామ ఆగం చూసినంక అసలు విషయం అందరికీ తెలిసిపోయింది. ఒక్కొక్కల గుండెల రాయివడ్డట్టయింది. అయ్యో!.... నా జేబుల గడియారముండెనని ఒకలు, పైసలుండెనని ఒకలు, అయ్యో ఇంటి తాళంచేతులుండెనని ఒకలు, మనిషికొక మాట. కొండయ మామను కొట్టకొట్ట వోయిండ్రు.

పెద్దలొల్లి అయింది. మాలొల్లికి చుట్టుపక్కలోళ్లు లేచివచ్చిండ్రు. జరిగిన సంగతి వాళ్లకు గూడా తెలిసిపోయింది. 'ఓర్నియవ్వ.. బాగోతులోల్ల బట్టలెత్తుకపోయిండ్రట... ఇప్పుడు ఊరికి ఎట్ల వోతరు. కొందరు జాంగలమీదనే ఉన్నరు' నవ్వుకుంట గుసగుసలు పెట్టిండ్రు.

అటొర్ర ఇటొర్ర బలబల తెల్లారింది. ఆడోళ్లు లేచి వాకిళ్లు ఊడుత్తండ్రు. ఈ ముచ్చట ఆ నోట ఆనోట ఊరు ఊరంతా తెలిసిపోయింది. మమ్ములను చూడనీకి దారివట్టిండ్రు. కొందరు సైదు పరుదాలను చుట్టుకున్నరు. కొందరు జోరతట్టలను కట్టుకున్నరు. ఆడివేశకాల్లు చీరలనే గోసి పెట్టుకున్నరు.



ఎట్లన్నా తెల్లారకముందే ఊరు దాటాలనుకున్నం. లేకుంటే సిగ్గువోతది. ఎవలంతల వాళ్లు సైకిలెక్కిండ్రు. సైకిళ్లు లేనోళ్ల గోస చెప్పరాదు. సందూకుపెట్టెను పట్టుకుని సందులల్ల వడ్డరు. సైకిళ్లు ఎక్కినోళ్లు గూడా సందుల పొంటనే ఊరు దాటిండ్రు. ఎంత సందులైనా మనుసులుంటరు గదా! మమ్ములని చూసి ఒక నవ్వుడు గాదు. మా ఏశాలను చూసి కుక్కలు ఎంటవడ్డయి. అట్లనో ఇట్లనో ఊరు దాటినం. వాగుల మొఖాలు కడుక్కొని మల్లా సైకిల్లెక్కినం.

అటో ఇటో ఆ ఊరు దాటినంగనీ మా ఊరికి ఎట్లపోవాలెనో తెలుస్తలేదు. సూదు సూదుమంట ఆనాడే ఎల్లారెడ్డిపేట ఎడ్ల అంగడి. అందరు బర్లను, ఎడ్లను కొట్టుకుని తొవ్వపొంటి నడుత్తుండ్రు. మా గోస చెప్పరాదు. మనిషి వత్తున్నడంటే చెట్టుసాటుకు జాక్కోవాలె. మనిషి కండ్లవడకుంట పోయినంక తొవ్వవట్టాలె.

అట్లనో ఇట్లనో జాక్కుంట జాక్కుంట గంటతొవ్వను మూడుగంటలు నడిచి ఊరంచుకు చేరుకున్నం. అప్పటికి తొమ్మిది గొట్టింది. అందరం వాగంచుకు బతుకమ్మ గుండుకాడ కూసున్నం. అందరు బదులుకొని పెద్ద తువ్వాలను నాకు కట్టి బట్టలు తెమ్మని నన్ను ఊర్లెకు తోలిండ్రు. నేను సైకిలందుకుని ఇంటికి పోయిన

నా అవతారం జూసి మా అమ్మ తిట్టుడేగాదు. ఏం జరిగిందో చెప్పిన. అంతా విన్నంక కడుపుకుట్లువట్ట నవ్వింది. నేనుగూడా నవ్వుకుంట 'ఇప్పుడు బట్టలు తీసుకపోవాలె. లేకుంటే వాళ్లు ఊర్లెకు రారు' అన్న.

"ఆ... చిన్నమావులగాదు.. ఇల్లిల్లు తిరిగి సాకలోనిలెక్క బట్టలు ఎదురుక పోతడట. పనేం లేదురా... సక్కగ బడికిపో..." అన్నది అమ్మ గదరాయిస్తూ...

నేను తానంజేసి బట్టలేసుకుని తిని సంచిపట్టుకుని సక్కగ బడికి పోయిన. ఎవ్వలు ఏమయిండ్రో ఎప్పుడచ్చిండ్రో తెలువది గనీ కొండయమామను గొర్లమందల కాడి కుక్కలు ఎంటవడి గెదిమినయట. పల్లెమీదిగోపయ్య తాళంచేయి లేక తాళం పలుగ్గొడుతుంటే దర్వాద ఇరిగిందట గానీ తాళం పలుగలేదట.

# అలుకుడు అటు-మామ ఇటు

కొండయ్య మామకు ఎప్పటినుంచో ఒక కోరిక ఉంది. అదేంటిదంటే మా మ్యాల్లంతో సెంచాలం బయిలెల్లాలని. మంచి ఐదారు నాటుకాలు నేర్చి ఇంక కొంత సామాను మైకు కొనుక్కొని, ఒకరిక్షా కొనుక్కొని ఊరికి ఐదు ఆటలాడుకుంట ఐదారు ఊర్లు తిరుగాలని ఉన్నది.

ఇప్పుడు ఐదారు ఆటలు ఎట్లానూ నేర్చినయి ఉన్నయి. యాసంగి కోతలైనంక పనేం ఉండది. అప్పుడు బైలెల్లితే సరే! ఆయిటి మూనేవరకు తిరిగి రావచ్చు. కానీ మాకు లేనిదల్లా సామాన్లు, మైకు, రిక్షా వీటికి లెక్క గట్టితే ఏంలేదన్నా మూడునాలుగు వెయిలయితున్నయి.

ఇన్ని పైసలు జమకావని మామకు తెలుసు అయినా ఎప్పుడూ ఇదే ముచ్చటనే అంటడు. మా పున్నయ్య పంతులు ఒంటిగ కనవడితేసాలు. ఇద్దరూ ఇదేముచ్చట మాట్లాడుకుంటరు. వీళ్లిద్దరినీ చూసి దాసు చిన్నాయిన 'ఎల్లయ్యకు ఎడ్లు లెవ్వు. మల్లయ్యకు బండి లేదు. బాడిగలు కొట్టాలని తెల్లందాక గుసగుసలు వెట్టిండ్రట. కానిపోని మాటలు ఎందుకు మాట్లాడుతరట' అంటడు.



ఎవలు ఏమన్నా కొండయ్య మామ మాత్రం ఈ ముచ్చట చెప్తూతనే ఉంటడు. ఎందుకోగానీ ఈ సెంచాలం ముచ్చట చెప్పేటప్పుడు మామ మొఖం ఎలిగిపోతది. మాటనే మారిపోతది. ఎప్పుడూ కొత్తగా చెప్పినట్టే చెప్తుతడు.

మామ ఒకనాడు వోటల్లకూసుండి చాయ తాగుకుంట ఎవలతోనో ఈ ముచ్చట చెప్తుతుండట. వాళ్లు ఒక చల్లని ముచ్చట చెప్పిండ్రట. అది నిజమో అవద్దమో తెలుసుకుందామని అప్పటికప్పుడు సైకిలందుకుని మామ బండ లింగంపల్లికి పోయిండు.

అసలు సంగతి ఏంటిదంటే బండలింగంపల్లిల మాలెక్కనే ఒక మ్యాల్లంగట్టిండ్రు. అమ్యాల్లంల నలుగురైదుగురు పైసలున్నోళ్లున్నరు. ముందుగాల్ల కొంత పెట్టువడి పెట్టి సామాన్లు కొన్నరు. సామాన్లంటే తక్కువేంకాదు. మా కొండయ్య మామ కోరుకున్న సామాన్లే. పరుదాలు, బట్టలు, విగ్గులు, షేర్వాన్‌లు, జుబ్బలు, పైజాములు, దండలు, మైకు, రిక్షా..... ఇట్లా ఆటకు పనికివచ్చే అన్నిసామాన్లున్నయి.

వాళ్లు మూటిమీద నాలుగైదేండ్లు ఆడిండ్రు. అందరికీ లగ్గాలయినయి. సంసారాలుమీద పడ్డయి. ఒకలకొకలకు పడరాకుంటయింది. సామాన్లు అమ్మి ఎవలంతల వాళ్లు ఉందామనుకున్నరు. కొన్న ధరకు రావాలంటే రాదుగదా! మొత్తం మూడువెయిలకు గుత్త చెప్పిండ్రు. నిజానికైతే అందులో ఐదు వెయిల మాలుంది.

కొండయ్య మామ సామాన్లన్ని చూసిండట. పెద్దమనుసులను కలిసిండట. ఇచ్చేధర చెప్పమన్నడట. మూడువెయిలకు ఒక్కపైస కమ్మిరాదని చెప్పిండ్రట వాళ్లు.

మామ ఊర్లెకు వచ్చిండు. తిండి గూడా తినలేదు. ఆనాడే పెరుమాండ్ల కాడి చేన్ల అలుకుడు. మాతాత ఊరికిపోయిండు మా అత్త, లస్మవ్వ మొలకను ఇప్పి గంపలల్ల నింపి మామకొరకు ఎదురు చూత్తుండ్రు.

ఊర్లెకచ్చిన మామ ఇంటికి పోలేదు. అసలు అలుకుడు ఉన్నదని నాగలికట్టాలని యాదికేలేదట. సక్కగ మాపంతులు ఇంటికి పోయిండు. అక్కడ దాసు చిన్నాయిన, పోశెట్టి, చంద్రం ఇంకో ఇద్దరు ముగ్గురు కనిపించిండ్రు. బండలింగంపల్లి సామాన్ల ముచ్చట వాళ్లకు చెప్పిండు.

"అబ్బో మూడు వెయిలంటే ఎక్కడయితయి.. మనిషికో రెండు వందలు ఏత్తే అయితయిగనీ ఎవలు ఎయ్యాలె" దాసు చిన్నాయిన అన్నడు.

"ఉన్నసామాను సాలదా.. అన్నిపైసలు వెట్టి అదెక్కడ వెట్టుకుందాం" పోశెట్టి అన్నడు.

"ఏం... ముక్కిపోయేదా.... వక్కిపోయేదా...చెడిపోయే వస్తువు కాదుగదా! అందర్ని అడుగుండ్రి. కొంటే కొందాం. ఆ పైసలు ఒక్క నెలల సంపాయించచ్చు. నాలుగు ఊర్లు తిరిగితెసాలు" చంద్రం అన్నడు.

'పంతులు గూడా కొంటే కొనుండ్రి చంద్రమన్నట్టు తలుసుకుంటే ఒక్కనెలల సంపాయించచ్చు. మూటిగ ఉండాలె' అన్నడు.

"ఏమన్నగానీ... ఓసారి పోయి చూసి వద్దాం పాండ్రి. సామాన్లు సూత్తే అర్థమైతది" మామ అన్నడు.

పంతులు చంద్రం తయారయిండ్రుగనీ పోశెట్టి ఏదో పనున్నదని తప్పించుకున్నడు. దాసు చిన్నాయిన మాత్రం "కొనంది చెయ్యనిది ఎందుకు సూసుడు. వట్టిగ పని తెర్లు పైసలు తెర్లు" అన్నడు.

"ఏ... సూడంగనే మీద వడుతదా.... నువ్వురా బావా...? వట్టిగ నాతో నిలవడు ఐతే అయితది లేకుంటే లేదు. నీమీదనే ఇరిగినట్టు జేత్తున్నవు" అన్నడు మామ.

దాసు చిన్నాయిన అప్పటిక్కూడా కదులలేదు. చంద్రం నవ్వుకుంట "ఈ దాసన్న గిట్లనే జేత్తడు గుమ్ములనిండ వడ్లుండాలే...గూటాలోలె బిడ్డలుండాలంటడు. ఆటలు ఆడాలెనాయె.సామాన్లు వద్దాయె ఎట్లమరి?" అన్నడు. అప్పుడు కదిలిండు చిన్నాయిన.

"ఏ... నాదేంది. రమ్మంటె వత్త... పోదాంపాండ్రి" అన్నడు చిన్నాయిన.

ఇంటిదగ్గర మా లస్మవ్వ మొలుక గుల్లలు ముందట పెట్టుకుని ఎదురు చూస్తంది. మామ నాగలే కట్టి దున్నుతున్నడు అనుకుంది. పెరుమాండ్లకాడి చేను ఊరుపక్కనే ఉంది. పోయి చూస్తే నాగలిలేదు మనిషిలేదు. మంటరమంట మాయింటికచ్చింది. నేను వాకిట్లనే కనవడ్డ. "ఓపిల్లగా.... మామ యాడున్నడో తోలుకరాపో..." అని నన్నుతోలింది.

మామ జాడ నాకు బాగ తెలుసు. ఏటైంలో యాడుంటడో కూడా తెలుసు. సక్కగ పంతులు ఇంటికి పోయిన. మామ అక్కడనే ఉన్నడు. నేను పోయేసరికి ఈ సామాన్ల ముచ్చటే మాట్లాడుతన్నరు. వచ్చినపని మరిచిపోయి నేను వాళ్ల మాటలే వింటున్న.

''బరువంతా మన నెత్తిమీదనే ఎందుకు పెట్టుకుందాం. ముఖ్యమైనోళ్లున్నరుగదా.... వాళ్లనుగూడా అడుగుదాం" చిన్నాయిన అన్నడు.

"అడుగుదామంటే అడుగుదాం... అందరుసై అంటేనేసై. లేకుంటే లేదు. చంద్రం...నువ్వు నాంపల్లిని తోలుకరాపోరా'' అని నాదిక్కుతిరిగి ఇద్దరి పేర్లు జెప్పితోలుకరమ్మన్నడు. నాకు చిన్నది పయ్యగీర ఇనుపది సలాక చీకు ఉన్నది. ఎటు



పోవాలన్నా ఇనుపపయ్యను చీకుతో తింపుకుంట ఉరుకుడే! పది నిమిషాలల్ల ఇద్దరిని తోలుకచ్చిన.

అందరు మాట్లాడుకుంటుండ్రు. ఎవలయినా గట్టిగ మాట్లాడుతలేరు. అలాలిస మాట్లాడుతున్నరు. కొండయ్య మామనే కొందామని గట్టిగా అంటున్నడు. అప్పుడే మా లస్మవ్వ 'అలిగిపోయిన అల్లీసాబ్ అటేవాయె. పిలువవోయిన పీర్ సాబ్ అటేవాయె' అనుకుంట వచ్చింది. లస్మవ్వను చూసి నేను సందిల జొక్కున్న. అలుకుడు ఇడిసిపెట్టి ఊర్లె తిరుగుతున్నవని మామను కోప్పడ్డది.

"ఈడికెందుకచ్చినవు. నువ్వు నడువు వత్తున్న..." అని మామ లస్మవ్వ మీదికి గరానికచ్చిండు. లస్మవ్వ మ్యాల్లాన్ని తిట్టుకుంట పోయింది.

కొండయ్యమామ అప్పుడు గూడా ఇంటికిపోలేదు. అందరినీ జమ జేసుకుని సక్కగ బండలింగంపెల్లి పోయిండు. ఇంత ఆగమాగం గాక రేపో ఎల్లుండో పోవచ్చు. కానీ అవి ఉంటయన్న గ్యారంటిలేదు. బండలింగంపెల్లి మ్యాల్లమంటే సుట్టూపదూర్లల్ల పెట్టింది పేరు. అప్పటికే ఎక్కడెక్కడోల్లో వచ్చి అడిగిపోతున్నరట. కొత్తపెల్లి నుంచి పైసలు పట్టుకునే వచ్చిండ్రట. వీళ్లు కలువకనే మర్రిపోయిండ్రట. ఎవలో కొనుక్కపోతరని మామ బాధ.

సామాన్లన్ని చూసినంక దాసుచిన్నాయిననే 'అబ్బ... ఎంత అగ్గోధరకిత్తండ్రు' అన్నడట. మొత్తం ఆరుగురు పోయిండ్రట. ఆరుగురు అదేమాటనట. కొనాలంటే కొనాలన్నరట. సామాన్లు సూత్తే ఇదువరని మామకు తెలుసు. చివరికి అట్లే అయిందట. పంతులుగూడా 'కొండయా...కొనాలెనోయ్. సామాన్లు మంచిగున్నయి. నేను మిగిలినోళ్లను ఒప్పిత్తగనీ బయాన ఇయ్యి' అన్నడట.

ఏటైం ఎట్లుంటదోనని అక్కడిక్కడ బదలు అడిగి నాలుగు వందలు జేబులుంచుకున్నడట మామ. నాలుగు వందలు బయానా ఇచ్చి పదిరోజులల్ల మొత్తం పైసలిత్తనన్నడట మామ. వాళ్లు మామ మాటమీదనే సామాన్లన్ని తీసుకపొమ్మన్నరట. అప్పటికప్పుడు ఎడ్లబండి కిరాయి మాట్లాడిండ్రట. పొద్దుగూకే సరికి సామాను మొత్తం మా ఇంట్ల ఉంది. అలుకుడు అలుకుడు జాగలనే ఉంటుండె. తాత వత్తే మామను తిడుతడని మా బాపే నిలవడి అలుకుడు చేసిండు.

పదిరోజులు గడిచింది. వాళ్లు పైసలకచ్చిండ్రు. మల్లో వారం వాయిద పెట్టిండు మామ. ఇట్లా రెండు వాయిదలయినయి. మా మ్యాల్లం వాళ్లు మాత్రం పైసలు ఎల్లయంటున్నరు. గట్టిగ మాట్లాడితే మ్యాల్లంలకే వచ్చేటట్లులేరు. లింగంపెల్లి మ్యాల్లపోళ్లు

నలుగురైదుగురువచ్చి మామ ఇంట్ల కూసున్నరు. మామనేమో పంతులింట్లకూసున్నడు.

"ఎట్ల పంతులు... మీమాట మీద నమ్ముకంకొద్ది బ్యారానికి దిగితి వాళ్లసామాన్లు వాళ్లు తీసుకపోతరటగనీ భయాన ఇచ్చిన నాలుగు వందలు ఇయ్యరట. నడుమల నేను మునుగుడేగదా" అన్నడు.

పంతులు గూడా మస్తు బాధపడ్డడు. కనీసం భయాన పైసలన్నా మనిషికిన్ని మునుగుదామని అందరికీ చెప్పిండు. నాదే పొరపాటయింది నేనే తీసుకోమన్ననని అందరినీ బతిలాడిండు. ఎవలూ ఒప్పుకోలేదు. మునుగుతేనువ్వు కొండయ్య ఇద్దరు మునుగుండ్రి అన్నరు.

వీళ్లతోబ్యారానికి పోయినోళ్లుగూడా గోడమీది పిల్లుల లెక్క మీది మీది మాటలు మాట్లాడిండ్రు. 'ఎవలు ఒప్పుకోకపోతే మేమేం జేత్తం మంచిగుంటదా అంటే మంచిగుంటదని చెప్పినం" అని కొత్తపాట ఎత్తుకున్నరు.

అందరి మాటలు విన్నంక కొండయ్య మామనే తెగాయించిండు. 'ఎవ్వలు పైసలియ్యకుండ్రిగనీ నేను రమ్మన్నఊరికి మాత్రం రాండ్రి. ఆడుమన్న ఆట ఆడుండ్రి' అన్నడు. ఎక్కడనో బాకీతెచ్చి సామానుకు పైసలు కట్టిండు. ఈ ముచ్చట మా తాతకు తెలిసింది. కొండయ్య మామను తిట్టుడంటే మామూలు తిట్టుడుగాదు. ఆ మాటలకు మా అత్తనే అలిగి రెండురోజులు తిండే తినలేదు.

ఇంట్ల తిట్టినోడు ఊకుండక పున్నయ్య పంతులు ఇంటికిపోయి ఆయిననుకూడా తిట్టిండు. ఇదే సందనుకుని ఇంకో ఇద్దరు ముగ్గురు తండ్రులు పున్నయ్య పంతులును తిట్టిండ్రు. మల్లా కంటికి కనబవడితే ఖతం జేస్తమన్నరు.

వీళ్లపనిల వీళ్లుంటే మామ పనిల మామ ఉన్నడు. ముస్తవాద ఊర్లె ఐదు ఆటలెయ్యాలని అందరినీ తయారు జేత్తండు. ఏమనుకున్నడోగాని పున్నయ్య పంతులు ఎవలకూ చెప్పక చెయ్యక చిన్నకొడుకు దగ్గరికి పోయిండట.

ఈ ముచ్చట తెలువంగనే మామకు సల్ల చెముటలు పుట్టినయి. అయినా భయపడలేదు. మాటమాటనే అన్నడు. నోటికి వచ్చిన ఐదు ఆటలు రియార్సల్ చేయించిండు. నాట్లు పట్టేలోపునే ముస్తవాద ఊర్లె ఐదు అటలెయ్యాలని ఆడరేసిండు.

అందరు సరే అంటే సరే అన్నరు.



# ఎడ మొఖం - పెద మొఖం

సామాన్లు కొన్నందుకు మూడు వెయిల బాకీ అయిందనీ తెలుసుగదా! అవి కొండయ మామ జిమ్మదారుతోనే తీసుకచ్చె. ఎవలు ఇచ్చినా ఇయ్యకపోయినా మామనే కట్టితీరాలె. ఈ బాకీ తేర్చేందుకైనా ఆటలు ఆడాలెగదా! పంతులు లేకపాయె... ఎట్లా....?

ఇప్పుడు రియార్సల్ చేసి కొత్త ఆటను నేర్చుకునే ఓపిక ఎవలకూ లేదు. ఉన్న ఆటలు ఆడితే మేమే మంచోల్లం. అందుకని ఇప్పుడు మాకు ఆటలు నేర్పె పంతులు కావాలని లేదు. ఎనుకనుండి పాటలు అందిచ్చే పంతులు ఉంటే సాలు. అన్నీ నోటికి వచ్చిన పాటలేనాయె.

అందుకని బట్టు పంతులును మాట్లాడిండు మామ. బట్టు పంతులుకు పాటలు పద్యాలు రావుగనీ సదువు వచ్చు. కట్నంగూడా మాట్లాడిండు. నెలకు ఇంత అనిగాదు. ఆటకు పదకొండు రూపాయలియ్యాలె. వరుసగ ఐదు ఆటలాడితే దోతుల జోడ పెట్టాలె.

మొదట అట్లనీ ఇట్లనీ తిట్టినా ఇప్పుడు నోరెత్తుతలేదు తాత. బాకీ తేర్పకపోతే తన మీద పడుతదని తెలుసు. ఎందుకంటే మామ తెచ్చినా తాతనే అడుగుతరుగదా! అందుకని బాకీ తేరేదాక నోరు తెరువద్దనుకున్నట్టున్నడు.

ముస్తవాదకాడ ఆట మోగిచ్చినం. ఊరు పెద్దదే. అన్నం దొర పెరట్ల స్టేజి వేసినం. చుట్టూ గోడలున్నయిగనీ ఒకదిక్కు గోడలు కూలిపోయినయి. కూలిపోయిన దగ్గర కట్టెలుపాతి తడుకలు గట్టినం. ఒక్కరోజు నాటుకమైతే ఎట్లనో ఆడుదుము. దినం తప్పిచ్చి దినం ఐదు నాటుకాలను పదిరోజులు ఆడాలనుకుంటున్నంగదా. పెరడును గూడా శుభ్రంగా సాపుజేసినం. రాళ్లు రప్పలుంటే ఏరిపోసినం.

అది మాఘమాస సందు. కోతలు అయిపోయినయి. తుకాలు పోసింల్రు. పనేం లేదు. కానీ బుద్ధున్నోడెవడూ ఆ కాలంల నాటుకాలు ఆడరు. ఎందుకంటే అది మాగికాలం. సల్లగసలి. పొద్దుగూకిందంటే బయటకు వచ్చుడే భయం. మాఘమాస దినాలల్ల మంటల పడ్డా పోని సలి. సంకురాత్రి దాటితే సంకలు లావట్టనియ్యది. శివరాత్రి రావాలె. సలి శివశివ అని పోవాలె. అంత సలిలో నాటకం చూడాలని ఎవడత్తడు. ఒకయాల్ల వచ్చినా ఒకటో రెండో సూత్తడు. ఏకంగా ఐదు ఆటలు ఎవలు సూత్తరు...?

ఈ విషయం కొండయమామకు తెలువదని కాదు. కానీ మొన్ననే సామాన్లు కొన్నం గదా. రిక్షాగూడా కొంటిమి. వాటిని చూసినంక పాణం ఆగుతలేదు. నాలుగువేయిల బాకీ గూడా అయిందికదా! నూరు రూపాయలత్తే నూరే ఆసరా అన్నట్టుంది. ముందు కొందరు వేశగాళ్లు గూడా ఒప్పుకోలేదు. రాత్రంతా ఏమీ కప్పుకోకుండా మేకప్ మీదనే ఉండాలెనాయె. మొఖం ఇర్రిర్రుమంటది. కాళ్లు చేతులుగజగజ వణుకుతయి. రాగం రాదు అన్నరు. కొండయమామనే బెదిరిచ్చి పట్టుకచ్చిండు.

రిక్షాకు అరటాకులు, కొబ్బరాకులు కట్టినం.రంగు రంగు కాయిదాలు అంటేసినం. అప్పుడు బంతి పూల సీజన్. బంతిపూల దండలు కట్టినం. అచ్చం రథం లెక్క తయారు చేసినం. తెల్లది పెద్ద టాపుమీద బండి కందెనతో 'బాలనాగమ్మ' అని నేనే వంకరటింకర రాసి రిక్షాకు అతుకేసిన. రిక్షాల ఒకలు కూసోవాలె. పుంగీవట్టుకుని చెప్పాలె. ఇద్దరు రిక్షాను నూక్కుంట ఊరంత తిరుగాలె.

అసలైతే రిక్షాల మైకువెట్టుకుని బ్యాట్రీ పెట్టుకుని పాటల రికాడు లేసుకుంట మౌతుపీసుల నాటకం ఉందని చెప్పుకుంటా పోవాలని మామ ఆలోచన. అసలు యాల్లకు బ్యాట్రీ దొరుకలేదు. అందుకని వట్టిపుంగీల చెప్పుకుంట పోవుడయితుంది.

కొత్త మురిపెంగదా... రిక్షా నేను ఎక్కుతనంటే నేను తొక్కుతనని అందరు అన్నరు. మామ మాత్రముందుగల్లనే చెప్పిండు. 'తొక్కుడు ఎవలన్నా తొక్కుండ్రిగనీ... ఎక్కుడు మాత్రం మా బక్కోడే ఎక్కుతడు. మీరు ఎక్కికూసుంటే రిక్షా రెండురోజులుండది' అన్నడు.

నేను మురిపెంగా పుంగీ వట్టుకుని ఎక్కికూసున్న పల్లెమీది గోపయ్య, నాంపెల్లి ఇద్దరూ రిక్షానూకుడు. మేము రిక్షాతో నాలుగు అడుగులు ఏసినమోలేదో పదిమంది పిల్లగాండ్లు చుట్టుకున్నరు. ఎప్పుడో ఒకటి అరా తప్ప ఆ ఊరికి నాటుకాలు వరుసగా ఆడుడే కొత్త. అందులో ఇట్లా రిక్షామీద తిరిగి చెప్పుడు ఇంకా కొత్త.

గోపయ్యను నాంపెల్లిని రిక్షా ముట్టనియ్యనేలేదు పిల్లగాండ్లు. వాళ్లే తొక్కింల్రు. వాళ్లే నూకింల్రు. కొంతదూరం నడిచి వాళ్లిద్దరు గూడా ఎక్కి నవ్వుకుంట నాపక్కనే



కూసున్నరు. పిల్లగాండ్లే ఇటు దిక్కంటే అటుదిక్కని వాడవాడ సంది సంది తిరిగింల్రు. నేను దమ్ము తీసుకుంట 'సోదర సోదరీమణులారా మన ఊరిలో బ్రమ్మాండమైన నాటుకం.' అని సంది సందికి చెప్పిన. నేను చెప్పింది పిల్లగాండ్లకు నోటికచ్చింది. కొద్దిగ దూరం పోయినంక నా చేతుల పుంగీ గుంజు కుని వాళ్ళే చెప్పింల్రు.

ఇట్లా రిక్షాను పొద్దున, పగటియాల్ల, పొద్దుగూకే జామున మొత్తం మూడుసార్లు తింపినం. ఆటాన టికెటు పెట్టినం. ఏశకాళ్లు కొందరు పొద్దుగల్లనే వచ్చింల్రు. మిగిలినోళ్లు ఆటయాల్లకు వత్తనన్నరు. అన్నట్టుగనే వచ్చింల్రు.

మొదటి రోజు బాలనాగమ్మ ఆటనాడు మంది తక్కువనే వచ్చింల్రు. అంత అరువై ఒక్కరూపాయి వచ్చింది. ఆట మాత్రం మంచిగ కమ్మింది. మంది వచ్చి కూసున్నరంటే అయిపోయేదాక పోలేదు. మొదాలు మొదాలు మంచి పేరు రావాలని ఆ ఆటను ఆడినం. అనుకన్నట్టే మంచి పేరు వచ్చింది. రెండు మూడు రికాడ్డ్యాన్సులు గూడా ఏసినం.

ఈసారి రికాడ్ డ్యాన్స్ చంద్రం చేసిండు. దుమ్ములేపిండు. రెండుసార్లు నోట్లె రూపాయినోటు పెట్టి వన్స్‌మోర్ కొట్టింల్రు.

తెల్లారి ఆ రెండు రూపాయల దగ్గరనే తకురారచ్చింది. పాటలు అందిచ్చేతందుకు బట్టుపంతులును మాట్లాడుకున్నంగదా! వన్స్‌మోర్ గొట్టిన పైసలు తనకేనంటడు. అంతే గాదు. ఇప్పుడు బట్టు పంతులు ఒక కొత్త పద్దతివెట్టిండు. అదేంటిదంటే కట్నాలు సదివిచ్చుడు, మంగళారతిల పైసలేసుడు.

బాలనాగమ్మ ఆటల కార్యవద్దిరాజుకు బాలనాగమ్మకు పెండ్లయితది. పంతులు ఈ పెండ్లిని నిజంగ పెండ్లిలెక్కనే చేసిండు. ఇద్దరినీ కూసుండవెట్టి మంత్రాలు చదివిండు. జిలకర బెల్లం ఒత్తిచ్చిండు. పిల్ల, పిలగాని కట్నాలయ్యా... చారానవో ఆటానవో చదివియ్యండ్రి అన్నడు. తనే జేబులనుంచి పావులా పైసలు తీసి ఎవరిపేరో చదివిండు.

అరే... పంతులు బలే చేత్తండనుకున్నం. జనం పదిపైసలు, ఇరువైపైసలు, ఐదుపైసలు సదివిచ్చింల్రు. ఇచ్చినోళ్ల పేరు మైకుల సదువుతూ 'దానదర్మేంద్రాయ, సోమ సువర్ణగలిశే శత సంవత్సరం దీర్ఘమాయా' అని పొగుడుతుండు. అట్లో మూడు రూపాయలచ్చినయి.

ఆట అయిపోయే ముందు బాలవద్దిరాజు తల్లిని వెతుక్కుంటూ పోతడు. అప్పటికి జనం మస్తుబాధపడుతున్నరు. అప్పుడే పంతులు ఒక తపుకులో మంగళారతి పెట్టి 'అవ్వా... తల్లిలేని పిల్లగాడు. తల్లికొరకు తిరుగుతండు. తండ్రి రాయిగా మారిండు. తల్లి మాయల పక్కీరు చెరల ఉంది. పిల్లలున్న తల్లులు మీరు. పైసదానం చేసుకోండ్రి'

అనుకుంటూ మంగళారతి పట్టుకుని పెరడంతా తిరిగిండు.

ఐదు పైసలూ, పదిపైసలూ దానం చేసింఁడ్రు. లేనోళ్లు ఉన్నోళ్ల దగ్గర చేపోయి అడుక్కుని ఏసింఁడ్రు. బొడ్లె సంచులు దేవులాడి దేవులాడి ఏ పైస దొరికితే ఆ పైస ఏసింఁడ్రు. ఇది పది రూపాయల దాకా వచ్చినయి.

పంతులు మంచి ఐడియనే చేసిండనుకున్నడు మామ. కానీ ఆ పైసల దగ్గరనే తకురారచ్చింది. అవిగూడా తనకే కావాలంటడు పంతులు. వన్స్‌మోర్ పైసలు తీసుకోగని మంగళారతుల పైసలు ఇయ్యిమన్నడు మామ. పంతులు అలిగిండు. మాట్లాడలేదు.

తెల్లారి అందరం ఇంటికివచ్చినం. నాటుకం దినంతప్పిచ్చి దినంగదా! ఆనాడు ఇంటిదగ్గరనే ఉండి మరునాడు పోయినం. 'లక్ష్మణ పరిణయం' నాటుకం. ఆరోజు బ్యాట్రీ దొరికింది. రిక్షాలమైకు పెట్టినం. ఈ సారి కొండయమామ రిక్షా ఎక్కిండు. బట్టు పంతులును చూసినంక మామకు గూడా ఒక ఆలోచన వచ్చినట్టుంది. దేవుడిలగ్గముందని ఓడిబియ్యం తేవాలని అడ్వీటేజ్ చేసిండు.

మొన్న మంచిగ ఆడినంగదా... ఈరోజు గిరాకీ పెరుగుతుందనుకున్నం. మా ఆశ నిరాశనే అయింది. గిరాకీ సగానికీ సగం తగ్గింది. ఓడిబియ్యం ఇద్దరు ముగ్గురే తెచ్చింఁడ్రు. అవిగూడా పిడికెడుకంటే మించిలెవ్వు.

"కొండయా... ఇట్లాడితే మన నెత్తికి బురుదనేరా... మ్యాల్లాన్ని ఎత్తేసి ఇంటికి వోదాం. మేకప్ ఖర్చులు మైకు మందమైనా రాకపోతే ఎట్లా....' దాసు చిన్నాయిన యాష్టపడ్డడు. ఆనాడు ఆయిన ఏశమే ఎయ్యలేదు. మేకప్ వేసుకోకుంటనే మొఖానికి పౌడర్ రాసుకుని ఉన్నదోతినే సింగులిడిసి కట్టుకుని కతకతోలె ఎల్లదీసిండు.

కొండయమామకు రంది మొదలయింది. పైకి మాత్రం 'ఆటన్నప్పుడు గట్లుంటదా... వందచ్చినా ఆడాలె వట్టిగైనా ఆడాలె పైసలు ఇయ్యల్ల గాకుంటే రేపత్తయి. పేరు మాత్రం రాదు. ఇయ్యల్ల చెడ్డ పేరచ్చిందనుకో.. రేపు ఎంత మంచిగ ఆడినా పేరు పోదు. ఆడేదేదో మంచిగనే ఆడుదాం' అన్నడు.

ఇంకోనాడు 'హరిశ్చంద్ర' ఆడినం. ఆనాడు మరీ ఇకారంగ పదమూడు రూపాయలే వచ్చినయి. ఆడుదామా వద్దా అనుకున్నం. చివరికి ఆట మోగిచ్చినం. ఇటు ఆట మోగిచ్చుడు. అటు కరంటు పోవుడు. ఒక్కటే సారయింది. చూసి చూసి కండ్లు కాయలు గాసినయి. ఇగరాదు. అగరాదు. రెండు పెట్రమాక్సులు ముట్టిచ్చి ఏదో ఆడింఁడ్రా అంటే ఆడినమన్నట్టు ఆడినం. ఆట అయిపోయేదాక కరంటు రాలేదు.



అందరూ మ్యాల్లం ఎత్తేద్దామన్నరు మామనే వద్దన్నడట. ఇంతదూరమచ్చినం గదా! మన ఆట ఎట్లుంటదో ఊరంతటికీ సూయించిపోదాం. 'హరిశ్చంద్ర'ను మూడు తొవ్వల దగ్గర ఏసిపోదాం' అన్నడు. ఇష్టంలేక పోయినా అందరు ఒప్పుకున్నరు. రిక్షా పెట్టి వట్టిగనే ఆడుతున్నమని అడ్వీటేజ్ చేసినం. టికెట్లు పెడితే ఎవ్వలు రాలేదుగని వట్టిగ అనేసరికి పట్టు జాలలేదు జనం.

మాకు పైసలు రానీ రాకపోనిగనీ జనం నిండుగా కనవడితే మేము మేము గాదు. ఆట ఆటగాదు. అట్లా 'హరిశ్చంద్ర' నాటుకాన్ని నవ్విచ్చి పుట్టెడు బాధను కడుపుల పెట్టుకుని ఆటను మాత్రం మోతమోగిచ్చినం.

అదే మంచిదయింది. మా ఆటను ఊరంతా చూసింఁడ్రు. పైసలు రాకపోతే రాకపోనిగానీ మంచిపేరైతే వచ్చింది. ఇంతమంచిగ ఆడుతరనుకోలేదు అన్నరు. మేము షాందిరి ఇప్పేసుకుని రాంగా మాత్రం 'అరే ఇప్పుడేపోతున్నరా.... ఇంకరెండు మూడు ఆడిపోంఁడ్రి' అన్నరు.

'ఆ... ఆడుతం... ఈ దండి పైసలకు... ఇంక నాలుగు ఆడుతం' అన్నడు దాసు చిన్నాయిన. కొండయమామ మొదటిసారిగా బాధపడ్డడు 'ఈ సామాన్లు, ఖర్చులు ఎవీలేకుంటే ఊరికి రెండు ఆటలు వట్టిగ ఆడితే ఎంత పేరచ్చు. టికెట్లు వెట్టి జనాలకు దూరం కావడితిమి. జనాలమెప్పు ముందు ఏ పైసలు పనిజెయ్యయి' అన్నడు.

కొండయమామను చూసి అందరూ నవ్వింఁడ్రు. వీనికింక నాటకాలమీద బుద్ధితీరలేదు అన్నరు.

దాసు చిన్నాయిననైతే 'ఏందోయ్ కొండయా... మీ నాయిన గట్టిగనే ఉండె. బాకీ కట్టుమను. ఊరికి రెండుగాదు. నాలుగు ఆడుదాం'. అన్నడు నవ్వుకుంట.

ఆ మాటలకు కాదు. నాటుకానికి పైసలకు పొత్తుపెడుతున్న వాళ్ల గుణాన్ని చూసి మనుసు నొచ్చుకున్నడు మామ.

# పారేనీళ్లను కట్టే మంత్రగాడు

మల్లపోరం పేరు వింటేనే ముందుగా గుర్తుకొచ్చేది మంత్రాలు. అందుకే మల్లపోరంకు పిల్లను ఇచ్చుడుకు భయపడుతరు. మా ఊరికి దూరమే వుంటది. దగ్గర దగ్గర కామారెడ్డి దాక పోవాలె. వాడకొక్కమంత్రకాడున్నరట. మూడేండ్ల కింద కరువు పడ్డప్పుడు కుమ్మరి బాలయ్య లచ్చపేట నుంచి బండెడు గడ్డి తెచ్చుకున్నడట. వత్తూవత్తూ బండితో మల్లపోరం ఊర్లె నుంచే వచ్చిండట. భయ పట్టుకుంటనే ఊర్లెకు అడుగుపెట్టిండట. భయపడ్డట్టే అయిందట.

'అబ్బ... ఎడ్లు జూడు ఎంత మంచిగున్నయో. జోడి మంచిగ కలిసింది' అన్నరట ఎవలో. అంతే! ఇంటికి వచ్చినంక ఎడ్లు ఎడ్లుగా లేవట. నీళ్ళు ముట్టయట. గడ్డిమెయ్యవట.

ఆ ఊర్లె ఇంతదాకా ఎవలూ నాటుకం ఎయ్యలేదట. ఐదారేండ్ల కింద ఏ ఊరి నుంచో ఒక మాల్లెం వచ్చి నాటుకమేసింద్రట. నాటుకం అన్నంక టికెటు పెడుతరు గదా. మీసాలు తిప్పుకుంట ఇద్దరు ముగ్గురు వచ్చి వట్టిగ తోలియ్యమంటే తోలలేదట. టికెట్ కొనాల్సిందే అన్నరట. మీరు ఎట్లాడుతరో సూత్తమని వాళ్లు ఎల్లి పోయింద్రట.



ఆట మొదలయ్యే టయానికి ఏశకాళ్లకు గొంతులు బొంగుపోయినయట. ఎట్లనో ఆటను నడిపిద్దామనుకుంటే మేటి వేశకాళ్లకు కక్కుడు బైలట. నాటుకం నడువనే లేదట. ఆనాటి నుండి ఇంతవరదాక అక్కడ ఆటలాడినోళ్లు లేరట.

మా కొండయ మామ మల్లపోరంల నాటుకం ఎద్దామన్నడు. మామకు ఆ ఊరు యాదికి రాకపోతుండె గానీ కార్తీక పున్నమి నాడు అక్కడ పెద్ద జాతర జరుగుతది. చుట్టూ పదూర్లపెట్టు పేరున్న జాతర. జనం బాగా వత్తరు. మూడు రోజులు జరుగుతది. రోజుకొక్క ఆట చొప్పున మూడు ఆటలు ఆడవచ్చు. బాకీ సగం తీరిపోతది. కానీ మంత్రగాళ్ళ భయం.

ఎప్పుడైతే మామ ఆ ఊరి పేరు చెప్పిండో అప్పుడే ఎవలూ రామని చెప్పింద్రు. పంతులు గూడా ఆ ఊరికి వద్దేవద్దన్నడు. మామనే పట్టు ఇడుత్త లేడు. ఈ మధ్య రెండు మూడు ఊర్లు తిరిగినంగదా! మేకప్ ఖర్చులకే సరిపోయినయి. బాకీ బాకీ లెక్కనే వుంది. మిత్తి పెరిగిపోతంది. అదీ మామ భయం.

"మీకేం భయం లేదు. నేను వాళ్లకంటే దండి మంత్రకాన్ని తోలుకత్త. మీకు మనిషికి పది రూపాయలిత్త. ఎవరు ఏ మంత్రం చేసినా పారకుండ జేత్త" నమ్మకంగా చెప్పిండు మామ.

మాల్లెంల మూటీ లేదని తెలుసు గదా. ఎప్పుడో ఇచ్చుకపోయేట్టుంది. ఇచ్చుకపోక ముందే బాకీ లేకుండ చెయ్యాలని మామ ఆలోచన. చుట్టు ఊర్లల్ల ఎక్కడ ఆడినా లాభం లేదని తెలుసు. అందుకే నాటుకాలు ఆడని ఊర్లెనే ఎయ్యాలనుకున్నడు. కార్తీక పున్నమప్పుడు పనిగూడా ఎక్కువేం ఉండది.

అన్నట్టుగనే తెల్లారే ఎక్కడి నుంచో ఒక మనిషిని తోలుకచ్చిండు మామ. అందరం పంతులు ఇంట్ల కలిసినం. కొత్త మనిషి చెయ్యెత్తు వున్నడు. మీసాలు వడి తిరిగినయి. సూడంగనే గజ్జుమనే తట్టున్నడు. మెడకు మొల్దారానికి దండరెట్టలకు తాయితులున్నయి. మాట గూడా భీంకరంగనే వుంది. తన పేరు సిద్దిరాములని ఊరు అంబరు పేటని చెప్పిండు.

"మీరు ఆడుంద్రి. నేను మీ ఎంబడే వుంట. ఎవల మీద జిర్రవారకుంట నా జిమ్మదారు. మంత్రకాడు రాని వాని తాతరాని. మీకేం గాదు" సిద్దిరాములు అన్నడు.

ఆయన ఆకారం, మాట చూసినంక మాకు నమ్మకం కుదిరింది. అందరు సామాన్లు సదురుకున్నరు. దూరం ఎక్కువే అయినా సైకిల్ మీద పోవచ్చు రావచ్చు. కానీ ముందటి లెక్కన సామాన్లను సైకిల్ మీద ఎవలూ మోత్తలేరు. అందుకని ఒక ఎడ్ల బండిని కిరాయికి

మాట్లాడిందు మామ. సామాన్లన్నీ బండిలో మెలిగినం. రిక్షా గూడా బండి మీదనే ఎక్కిచ్చినం. అందరూ అనుకున్నట్లే తయారయిండ్రుగనీ పైసల దగ్గర తకురారచ్చింది.

మొత్తం పదిరూపాయలిత్తనని మామ, కాదు ఆటకు పది రూపాయిలియ్యిమని వాళ్లు. ఇంతకు ముందు ఈ పైసలిచ్చుడు పుచ్చుకొనుడు లేకుండె. ఇప్పుడే మొదలు. ఇట్లయినా వత్తరని మామ ఈ పద్దతి చెప్పిండు.

అటని ఇటని ఆటకు ఐదురూపాయలిచ్చేందుకు ఒప్పందం కుదిరింది. 'మీరు ఇంటికే వత్తరో అక్కడనే వుంటరో మీ ఇష్టం. మొత్తం మీద ఆట టయానికి అందరూ వుండాలే' మామ అన్నడు. అనుడే గాదు. ఇద్దరు ముగ్గురు పెద్దమనుషుల ముందు ఇదే మాటలు మాట్లాడిచ్చిండు.

మొత్తం మీద పొద్దుగూకే జాముల ఆ ఊరికి చేరుకున్నం. మా ఊర్లె గడిలెక్కనే ఆ ఊర్లెగూడా ఒక గడి దొరికింది. గడీల స్టేజీవేసి మైకు మోగిచ్చినం.

సిద్దిరాములు కర్రెకోడితో స్టేజీకి జీడిగింజలు నిమ్మకాయలు గట్టిండు. గడి గోడలల్ల ఆట, గడి ముందటనే జాతర.

సిద్దిరాములును దాసు చిన్నాయినను టికెట్లకాడ నిలవెట్టినం. సిద్దిరాములు తాపతాపకు మీసాల మీద చెయ్యేసుకుంట "పారే నీళ్లను కడుత. పొద్దు గూకపోవాలె. తెల్లారక పోవాలె. ఏమనుకుంటుండ్రో" అని బెదిరిత్తండు.

జాతర కాబట్టి జనం పట్టుజాలలేదు. జాగదొరుకక చాలామంది మర్రిపోయిండ్రు. ఎన్నడూ రానంతగా ఆ రోజు నాలుగు వందల రూపాయలచ్చినయి.

ఆట మొదలయింది. రాత్రంతా జాతరేనాయె. బయట మందిని చూసినంక సిద్దిరాములుకు ఒక ఆలోచన వచ్చింది. అది చిన్నాయినకు చెప్పిండు. చిన్నాయిన కొండయమామకు చెప్పిండు. మామ పంతులుకు చెప్పిండు.

"ఎప్పుడూ అట్ల ఆడలేదు. జనం వస్తరంటవా కొండయా" పంతులు అడిగిండు.

"సూద్దాం వత్తేనే ఆడుదాం లేకుంటె లేదు. ముందుగల్ల అడ్విటేజ్ చేద్దాం" మామ అన్నడు. అది కంసమర్ధన ఆట. పన్నెండు ఒక్కటి వరకు ఆటను పూర్తిచేసి మంగళారతి ఇచ్చినం.

వెంటనే మైకుల అనౌన్స్ చేసినం. 'ప్రేక్షక మహాశయులారా...బ్రహ్మాండమైన నాటకం. కంసమర్ధన. సెకండ్ షో ఆడబడును. రండి, చూడండి, చూసి ఆనందించండి' అని పుంగీ పట్టుకుని జాతరంతా తిరిగి చెప్పినం. మా ఎంట సిద్దిరాములున్నడు. అందుకే



మేము ఎవలకూ భయపడుతలేము. సిద్దిరాములును చూసినంక ఎవలూ గూడా మా తెరువు వత్తలేరు.

మా అంచనా తప్పుకాలేదు. మళ్లీ గడినిండింది. రెండవ ఆట మొదలయింది. ఇట్లా మూడు రోజుల్లో రోజుకు రెండు చొప్పున ఆరు ఆటలేసినం. ఏ ఆటకు మూడు వందలకంటే తక్కువ రాలేదు. ఈ పైసలు చూసినంక మామ అందరికీ అన్నంవండి పెట్టిత్తండు. ఇంటికి వచ్చేవాళ్ళు ఇంటికి వత్తండ్రు. అక్కడుండేటోళ్లు అక్కడనే వుంటండ్రు.

ఇదంతా సిద్దిరాములు మంత్రబలమే అంటుండ్రు అందరు. సిద్దిరాములు పొద్దునొకసారి సాయంత్రమొకసారి మమ్మల్ని ఎంటేసుకుని మీసాలు తిప్పుకుంట ఊరంతా తిరుగుతండు. అక్కడక్కడా ఆగి మీసాలు తిప్పుకుంట 'పారేనీళ్లు ఆగుమంటే ఆగాలె. కోడెనాగుంబామైనా కోడిపిల్లలెక్క ఎంట తిరుగాలె' అంటున్నడు. సిద్దిరాములును చూసి అందరూ బయపడుతుండ్రు. ఇగ మా స్టేజీమీద కన్నువేసే దమ్ము ఎవరికుంది. మేముకూడా ఆర్‌పార్ అన్నట్లే తిరుగుతున్నం. ఎవలకు భయపడుతలేము. నువ్వెంత అంటే నువ్వెంత అంటున్నం.

జాతర అయిపోయినంక దినందప్పి దినం ఆట అక్కడనే వెయ్యాలనుకున్నం. ఇట్లా రెండు వారాలు గడిచింది. రెండు మూడు రోజులు కొందరు అటు ఇటు తిరిగిండ్రు. తర్వాత సైకిల్లమీద తిరుగుడు దమ్ముకచ్చింది. తిరుగుడు మానేసి అక్కడనే వుంటుండ్రు.

కొండయ మామ కూడా ఖర్చుకు వెనకాముందు అయితలేదు. పూటకొక్కతీరుగా పెడుతండు. రాత్రి పూట ఆటాడుడు. పొద్దంతా నిద్రపోవుడు. నీసు లేని బుక్కలేదు. ఎక్కడన్నా కుందేలు అడవిపంది దొరికితే మా దగ్గరికే తెత్తురు. ఎక్కడ ఎండ్రికాయలు దొరికినా మాదగ్గరికే తెత్తురు. మాదగ్గరికొచ్చి మర్రిపోయిన దినుసు లేదు. దుకాణంలో ఖాతా పెట్టిండు మామ. సిద్దిరాములు చిన్నచిన్నగా తాయితులు కడుతుండు. ఊరిలో ఎవలకన్నా బాగలేకపోతే బొట్టు వెట్టి దొప్పలు దించుతుండు. అయిదో పదో సంపాయించుతండు.

ఇట్లా మరో వారం పదిరోజులు గడిచింది. ఊర్లె ఎట్లున్నరో మాకు తెలువది. మేము ఎట్లున్నమో ఊర్లెతెలువది. వచ్చుడు పోవుడు బందయిపోయింది. మేము ఎప్పుడూ ఇట్లా ఇన్ని దినాలు ఊరు విడిచి పెట్టలేదు. మా మ్యాల్లంల జీతగాల్లుండిరి. బర్లు గాచేటోల్లు ఆవులు గాచేటోల్లుండిరి. రైతులుండిరి. ఇద్దరు ముగ్గురు చదువుకునే పిల్లలు ఉండిరి. వారం పదిరోజులు ఇక్కడనే తినుకుంటూ పండుకుంటే ఊరు మొత్తం అగమైండ్రట. అందరూ బదులుకుని మా తాతను ఇంకో ఇద్దరు ముగ్గురిని తోలిండ్రట.

ఇక్కడ తిండి మంచిగదొరుకుతుంది. చాయలు, బీడీ కట్టలు దొరుకుతున్నయి. ఊర్లె గూడా మంచి గుర్తింపు వచ్చింది. మేము తొవ్వపొంటి పోతుంటె అగో బుద్దెనుకాడు, అగో మయలపక్కీరని ఏశాల పేర్లు వెట్టి పిలుత్తుండ్రు. ఆడోళ్ళతోని మాట్లాడుతుండనీ స్టేజ్ దగ్గరనుండి పోశెట్టిని కదులనిత్తలేదు మామ. సిద్దిరాములుకైతే ఊరంతా గజ్జుమంటంది.

మా తాత ఇంకో ఇద్దరు ముగ్గురు మా దగ్గరికొచ్చే సరికి మేము అడవిపందిని పొతం జేత్తన్నం. ఎవలో షికారుకు పోయి తెచ్చిండ్రట. డెబ్బయి రూపాయలిచ్చి తీసుకున్నము. తాత ఇది జూసి నవ్విండు.

“అరే ... రమ్మంటే మీరు యాడత్తరురా... తిన్నంత తిండి దొరుకుతుంది.” అన్నడు తాత. అప్పుడే మీసాలు తీడుకుంట సిద్దిరాములు వచ్చిండు.

“ఏంరా బాలుగా... ఏమేషంరో ఇది. పగటియాల్లగూడా ఏశాలేత్తన్నవా...?” అన్నడు తాత. నేను తాతను చిత్రంగా చూసి. “తాతా... ఈయిన సిద్దిరాములు దండి మంత్రకాడు. పారేనీళ్ళను కడుతడు” అన్న.

“చల్... వీడు మంత్రకాడేందిరా.. పొద్దుగూకి చెంబటుకపోవాలంటే పెండ్లాన్ని ఎంటబెట్టుకపోతడు. వీడు మంత్రకాడా... వీడు మన కొండని సద్దకుడు. కొండపురం బాలుగాడు” అంటూ మీసాలను పట్టి గుంజిండు తాత. మీసాలు ఊడి వచ్చినయి. అవి మా కొండయ మామ విశ్వామిత్రునికి పెట్టుకునే మీసాలు. ఎప్పుడైతే మీసాలు ఊడినయో అప్పుడే పేడుమూతి బాలయ్య బయటపడ్డడు. నవ్వుకుంట నిలవడ్డడు.

బాలయ్య మా మాల్లెంల ఎవలకూ పరిచయం లేదు. మా చిన్నాయినకు మాత్రం ముందే తెలుసునట. ఇద్దరు కలిసే ఈ పని చేసింద్రట. మేము మొఖం చూడలేదు కాబట్టి నమ్మినం.

ఎప్పుడైతే సిద్దిరాములు బాలయ్య అని తెలిసిందో అప్పుడే భయం పుచ్చుకుంది మాకు. ఆ రాత్రి ఎవలకూ గూత ఎల్లలేదు. నోర్లు బొంగురువోయినయి. కాళ్లుజేతులు ఆడలేదు. కడుపుల దప్పులేగినయి. బుగులు బుగులు భయం భయం అయింది. ఆట సక్కగ సాగలేదు.

“నేను ఇట్లనే మీసాలు పెట్టుకుని ఎట్లనో మందిని బెదిరిత్త. మీరు ఇంకో నాలుగు ఆటలు ఆడుండ్రి” బాలయ్య అన్నడు. మామ సరే అన్నాడు. సగం మంది మాత్రం భయపడ్డరు. మా తాత, ఇంటి నుంచి వచ్చినోళ్ళు ‘ఆటలేదు ఏం లేదు నడువుండ్రి. ఇంటిదగ్గర తిడుతుండ్రు’ అన్నరు.



బండి కిరాయికి మాట్లాడుకొని మ్యాల్లెం ఎత్తేసినం. ఆరోజు మల్లాపురం ఊరంతా కదిలింద్రు. మేము ఎల్లిపోతుంటే వద్దన్నరు. ఇంకో రెండు ఆటలాడి పొమ్మన్నరు.

మేము మల్లావస్తమని చెప్పి ఊరుదాటినం.

ఇంటికి వచ్చినంక జమాఖర్చూ అందరికీ చెప్పిండు మామ. మనిషికి ఆటకు ఐదు రూపాయల చొప్పున లెక్కగట్టి ఇచ్చిండు. మిగిలినయి బాకీ గట్టిండు.

“లెక్కలన్నీ మంచిగ చూడుండ్రి. ఎనుకశీరి ఇదేమైంది అదేమైంది అనద్దు. ఏదన్నా ఉంటే మొఖం ముందటనే మాట్లాడుండ్రి. మొకం సాటుకు మాట్లాడద్దు. మీకు ఐదేసి రూపాయలిత్తున్న. నేనైతే ఒక్క పైస తీసుకుంటలేను” అన్నడు మామ.

ఎవలూ నోరు తెరువలేదు. అందరికి కండ్లల్ల నీళ్లు తిరిగినయి.

# ఆ గుర్తులు ఇంకా ఉన్నాయి

ఎర్రటి ఎండ. ఎండా కాలమచ్చింది. కోతలు మోతలు అయిపోయినయి. ఈ సారి మామకంటె ముందే మా మ్యాల్లం మనుషులు తయారయింండ్రు. ఆటకు ఐదు రూపాయిలు. కడుపు నిండా తిండి. రుచి మరిగిండ్రు. మామ మాత్రం ముందటి లెక్క కుషీ మీద లేదు, ఆటల మీద మనుసు ఇరిగినట్టుంది. ఆటల పేరు ఎత్తుతలేదు.

అటో ఇటో సామాన్లు సదురుకుని మైకును రిక్షాలో పెట్టుకుని కోరుట్లపేటకు పోయినం. ఊరు పెద్దదేం కాదు. ఒకటి రెండు ఆటలు నడుత్తయి. అట్లనే నడిచినయి. ఈ సారి టికెట్లు అమ్మే దగ్గర కొట్లాటయింది. పది టికెట్లు ఎక్కువ అమ్మి తక్కువ లెక్కచూపిండు నాంపెల్లి. ఖర్చు ఎక్కువ తక్కువ రాసిండు పోశెట్టి.



మంగళారతి పైసల దగ్గర కూడా తకురారచ్చింది. 'హరిశ్చంద్ర' ఆడుతున్నం. కాటికాపరి సీను వచ్చింది. ఆట మంచిగ కుదిరింది. జనం బాధపడుతుండ్రు. చంద్రమతి లోహితున్ని కాటికి తీసుకపోయినంక సీస పద్యాలు చదువుతుంటే గుండె కరిగిపోతుంది.

భార్య అని తెలిసినం క కూడా సుంకం చెల్లించుమంటడు కాపరి. చంద్రమతి చేతిల నయాపైసలేదు. జనం బరువుగ ఊపిరితీత్తుండ్రు. అప్పుడే చంద్రమతిని జనంలోకి పంపిండు పంతులు.

'దయగల మా రాజులు. ధర్మం చెయ్యండి. నా కొడుకు పీనుగును కాలవెట్టాలె. కన్నతండ్రే కాదంటుండు. సుంకం కట్టుమంటుండు. మీరిచ్చిన పైసలతోనే సుంకం కడుతా" అంటూ జనంలో తిరుగుతుంది మంగళారతి పట్టుకుని చంద్రమతి.

జనంపూర్తిగా ఆటలోనే లీనమయిండ్రు. ఐదు పైసలు, పదిపైసలు, ఇరువై పైసలు, చిల్లరలేకుంటే చిల్లర తీసుకుని బొడ్లె సంచులు దేవులాడి ఏ బిళ్ల దొరికితే ఆ బిళ్లను, పైసలు లేనోళ్ళు బదులు ఆడుక్కుని మంగళారతిల పైసలు ఏసిండ్రు. మొత్తం ముప్పయి రూపాయలచ్చినయి. అవి నాకే కావాలంటడు పంతులు. ఇది వరకు ఇట్లనే కొట్లాటయింది. ఈ సారి ఆ పైసలు మా చేతులకే రానియ్యలేదు. తపుకు మొత్తం జేబుల కుమ్మరించుకున్నడు. మామకు తలుకాయ తిరిగిపోయింది.

కోరుట్ల పేట అయినంక సింగారం పోదమన్నరు అందరు. మామనే వద్దన్నడు. ఎడ్లబండి కిరాయికి మాట్లాడి సామన్లు మెలుక్కుని ఇంటికి వచ్చినం. మొట్టమొదటి సారిగ నాటుకం వద్దని మామ నోటినుండి ఇప్పుడే వింటున్న. ఆ రోజే అంగడికిపోయి 'మాందాత' నాటుకం పుస్తకం కొనుక్కచ్చిండు మామ.

'మాందాత' ఆటకు ఒక ప్రత్యేకత వుంది. ఈ ఆటను ఎప్పుడు పడితే అప్పుడు ఆడరు. ఎక్కడైనా వరుసగా నాలుగైదు ఆటలు ఆడినమనుకో. చివరగా ఈ ఆట ఆడుతరు. ఇందులో వీది నాంచారి ఏశముంటది. శిగ మూగుతుంటది. గొర్రెపిల్లతో పొలిజేత్తరు. ఆడిన తెల్లారి అందరు దావతు చేసుకుంటరు. తర్వాత ఇంకో ఆట ఆడరు.

పైగా ఈ నాటుకం నేర్వాలంటే అందరూ భయపడుతరు. ఎందుకంటే వీధినాంచారి వేశం వెయ్యడానికి ఎవరూ ముందుకు రారు. భయపడుతరు. శిగమస్తదని, నీడ వస్తదని అందరూ బయపడుతరు.

ఎప్పుడైతే మామ చేతిలో మాందాత పుస్తకం చూసిండ్రో అందరూ సల్లవడ్డరు. ఆ ఆటను ఎప్పుడు ఆడుతరో ఎందుకు ఆడుతరో తెలుసు కాబట్టి నోరు తెరిచిండ్రు.

"మాందాత ఆడుదాం. వీధి నాంచారి వేశం నేను వేస్త. ఎండకాలం ఎల్లే లోపే వేద్దాం". మామ అన్నడు.

"ఏంది కొండన్నా.. ఆటకు మంచి గిరాకి వుంది. ఇంకో యాడాది రెండేండ్లు ఇట్లనే ఆడుదాం. ఖర్చులు పోంగా ఐదో పదో మిగులుతయి". చంద్రం అన్నడు. అందరూ అదేమాట.

మామ మాత్రం నోరు విప్ప లేదు. కారణం చెప్పలేదు. వద్దని మాత్రం గట్టిగ చెప్పిండు. ఎవరూ నోరెత్తలేదు. మౌనంగా తలూపిండ్రు. ఈ నాటుకానికి మాకు పంతులు అవసరం లేకుండా పోయింది. పాటల దాటీలన్నీ మాకు తెలిసినవే. పాత్రలు నేనే రాసిన. రియార్సల్ కూడా ఎక్కువ రోజులు చెయ్యలేదు. ఎవల ఇంటి వద్ద వాళ్లే పాటలు యాది చేసుకున్నరు. నాటకం ఆడే ముందు వారం రోజులు మాత్రం యాక్షన్ నేర్చుకోవడానికి రియార్సల్ చేసినం. ఈ రియార్సల్‌కు నేనే పుస్తకం పట్టి పాటలు చెప్పిన.

మేము ఎప్పుడైతే 'మాందాత' నాటుకం రియార్సల్ చేస్తున్నమో అప్పుడే మా నిర్ణయం ఏమిటో ఊరంతా తెలిసి పోయింది. అంతకు ముందయితే మేము రియార్సల్ చేస్తే చాలు 'ఇంకేం ఆడుతరు. ఇంకేం నేరుత్తరు. అడిన కాడికి చాలదా! పని పాటలేంలేవా' అని తిడుదురు. ఇప్పుడు ఎవలూ నోరు తెరుస్తలేరు. వచ్చి రియార్సల్ ముందే కూసుంటున్నరు.

కొండయ మామ వీది నాంచారి వేశమేత్తుంటే మాతాత ఏమంట లేదుగనీ మా అవ్వా, అత్తా భయపడుతున్నరు. మా బాపు మాత్రం 'కొండడు దైర్నవంతుడు. వాడికేం కాదు. వాడే పెద్ద దయ్యం. వాడిని ఇంకే దయ్యం పట్టది' అంటుండు.

ఈ నాటుకం ఆడుదుకు కొన్ని నియమాలుంటయి. మేటి వేశకాళ్లు ఒక్క పొద్దుండాలె. ఊర్లె ఎన్ని దేవుండ్లు వుంటే అన్ని కొబ్బరికాయలు కొట్టాలె.

అందరికీ ఏదో తెలియని బాధ. మౌనంగా గంభీరంగా వున్నరు. ఇంతకు ముందయితే బరువునంతా మామ నెత్తిమీద రుద్దుదురు. చెప్పిన పని చెయ్యక పోదురు. ఇప్పుడు అట్లగాదు. ఎవరికి వాళ్లే ముందుపడి చెప్పినా చెప్పకపోయినా పని చేస్తండ్రు. కొండయమామ చేతిసైగ చేస్తేచాలు. సైగతోనే మెదులుకుంటున్నరు. నాకు మా మొదటిరోజులే గుర్తుకొచ్చినయి. మేము మ్యాల్లం మొదలువెట్టినప్పుడు ఇట్లనే చేయి సైగతోనే మెదులు కుందుము.

ఊరి నడిబొడ్డు దగ్గర స్టేజీవేసినం. స్టేజీని యాపకొమ్మలతో నింపినం.పొద్దున్నే ఊర్లె దేవుళ్లందరికీ కొబ్బరికాయలు కొట్టినం. కొండయమామ వేశంను వెరైటీగా తయారు



చేసినం. పెయ్యంతా నల్లటి రంగు పూసి నడుముకు యాపకొమ్మలు కట్టినం. నాలుగు దప్పులతో ఏశాన్ని ఎదురుకచ్చినం. వీధి నాంచారి స్టేజీ మీదికి రాంగనే నలుగురైదుగురుకి సిగాలచ్చినయి. బైండ్ల మల్లయ్య శిగాలను శాంతి చేసిండు. మామ మాత్రం ముక్కు వంచలేదు. శిగమచ్చినట్లు యాక్షన్ చేసిండు అంతే!

ఆట అయిపోయింది. మేకపోతును గావు వట్టిండ్రు. ఆ రోజు ఊరు మొత్తం వచ్చింది. తెల్లారే వరకు కూసున్నరు. ఇంతవరకు మాందాత ఆట ఎవలూ మా ఊర్లె ఆడలేదు. ఇదే మొదటిది. జనం కదులలేక అక్కడినుండి కదిలిండ్రు. ఇక ముందు నాటుకాలు చూస్తమోలేదోనన్న బెంగపట్టుకుంది వాళ్ళకు. వేశాల రాములు మ్యాల్లపోల్లు గూడా మాతో కలిసిపోయిండ్రు. రాత్రంతా పొలిజేసినం. పులిగము వండి ఊరడమ్మ దగ్గర ఆరం బోసినం. వీధి నాంచారి చెక్కబొమ్మలు చేయించినం. కొత్త చెక్కబొమ్మలను బంజెరు దొడ్డిల మూలకు వెట్టినం.

తెల్లారి మ్యాల్లపోల్లం అందరం పిల్లాజెల్లలతోని ఎల్లమ్మ మామిండ్ల కిందికి వంటలకు పోయినం. అంతకు ముందు మ్యాల్లం నుండి విడిపోయిన వాళ్లందరినీ తోలుకచ్చినం. ముగ్గురు పంతుళ్లను పిలిపించుకున్నం. వాళ్లకు కొత్త బట్టలు వెట్టినం.

పనులన్నీ కొండయమామ చేతుల మీదినుంచే నడుత్తున్నయి. ఏ ఖర్చుపెట్టినా మామ చేతిమీది నుంచే! ఎవలు ఏ పని చెయ్యాలన్నా మామనే ఆడుగుతున్నరు. కూసుండు మంటే కూసుంటున్నరు. నిలవడుమంటే నిలవడుతున్నరు. నోరు తెరిచి ఆవాజ్ జేత్తలేరు.

వంటలకాడ ఆరుకుండలకల్లు వచ్చింది. అందరూ కడుపునిండా కల్లు తాగిండ్రు. కల్లు కడుపుల వడ్డంక గుండెలు పగిలినయి. పాత ముచ్చట్లు మాట్లాడుకుంట అందరూ ఏడ్సుడే గాదు.

తెల్లారి సామాన్లన్నీ సర్దుకున్నరు. పొత్తుల సామాన్లన్నీ ముల్లెగట్టి మా ఇంట్లనే దూలాల మీద పెట్టిండ్రు. అక్కరకు వచ్చే బట్టలు, అద్దాలు, కాటుకలు, కాంటలు, పౌడర్లు అందరికీ పంచిపెట్టిండు మామ. పాత లెక్కలన్నీ ముందట వెట్టిండు. ముగ్గురు పంతుల్లను కూసోబెట్టి లెక్కలన్నీ చేయించిండు మామ.

సామాన్లు పంచుడు, లెక్కలు రెండు రోజులయినయి. ఈ రెండు రోజులు అందరూ మా ఇంట్లనే కూసున్నరు. ఎవరూ నోరుదెరుత్తులేరు. ఏది చెప్పినా తలుకాయ ఊపుతున్నరు. బాధబాధగనే వున్నరు. ఆ రెండు రోజులు మ మ్యాల్లం మనుసులు ఎవలు సక్కగతిండి తినలేదు. ఏదో పొడగొట్టుకున్న బాధ. తల్లి నుండి పిల్లను వేరు చేస్తున్న తండ్లాట. అందరూ బీరిపోయిండ్రు.

లెక్క తెగింది. వంద యాభై రూపాయల బాకీ తేలింద్రు మామకు. అంటే మనిషికి పది రూపాయలు. చివరగా ఒక్కటే మాటన్నడు మామ. "అరేయ్ తెలిసో తెలియకనో పెత్తనమెత్తుకున్న. నేనే తిన్ననో మీరే తిన్నరో ఇంతదూరం నడిపిచ్చుకచ్చిన. చివరికి కొట్లాటలు మొదలయినయి. ఏదో పండుగలకు పబ్బాలకు మురిపంగా ఆడుకునే ఆటను పైసలకొరకు ఆడుడు మంచిది కాదనిపించింది. అందరు తన్నుకుని గుద్దుకుని విడిపోవుడు కంటే మంచి మాట వుండంగనే విడిపోతే మంచిదనుకున్న. ఈ లెక్కలన్నీ మీరుగూడా చూడుండ్రి. నూట యాభై బాకీ తేలింద్రంటే మనిషికి పది రూపాయలు. లెక్కలు సరిగా ఉన్నయనుకుంటేనే పదిరూపాయలియ్యుండ్రి. లేదు ఇవన్నీ కాకి లెక్కలే అనుకుంటే ఒక్కపైస ఇయ్యకుండ్రి" అంటూ లేచిండు మామ.

ఎవ్వరూ మట్లాడలేదు. బరువుగా బయటకు నడిచింద్రు. మరునాడు మాత్రం అందరూ పదిరూపాయలు మామకు ఇచ్చింద్రు. నా వంతు పదిరూపాయలు మా అమ్మ ఇయ్యబోతే మామనే వద్దన్నడట. లెక్క లెక్కనే అని నోటు జేబుల వెట్టిండట.

అట్లా 'పుండరీక'తో మొదలైన మా మ్యాల్లం 'మాంధాత'తో ముగిసింది. అప్పుడే నా హైస్కూల్ చదువు గూడా అయిపోయింది. కాలేజీ చదువుకు గంభీరావుపేట పోయిన.

మా దగ్గరున్న సామాను అమ్ముదామని కొందరు అన్నరు. మైకు, రిక్షా మాత్రం అమ్మినం. మిగతా సామాన్లు కొండయమామనే కొనుక్కుని వాళ్ల ఇంట్లో దూలాల మీద పెట్టుకున్నడు.

సరిగ్గా ఇరువై మూడేండ్లయితుంది.

ఆ జ్ఞాపకాలు ఇప్పటికీ మా మామ ఇంట్లో దూలాల మీద పయిలంగనే వున్నయి. వాటికిందనే కుర్చీ వేసుకుని కూసుంటడు మామ. ఇప్పుడు నేను ఊరికి దూరంగా వున్నాను. ఎప్పుడైనా మామ దగ్గరికి వెళ్లినప్పుడు దూలాల మీది సామాన్లను ప్రేమగా చూస్తాను. మామ సీటి మీద 'శోకులూ వస్తవా.. పోదాం' అంటడు నవ్వుతూ. మా లస్మవ్వ గోడమీద బోసి నోటితో నవ్వుతుంటే పక్కనే తాత పోటోలోంచి కోపంగా చూస్తాడు.

సీటి కొడుదామంటే రాదు.

నా మనసు బరువెక్కుతుంది.





మా బాగోతం, మా బతుకులు తెలిసిన దోస్తు ...

**యస్.వి.సి. ప్రకాశ్** కు

(శ్రీ వెన్నెల జూనియర్ కళాశాల, ముస్తాబాద్.)

**ప్రత్యేక కృతజ్ఞతలు.**

నయనం ప్రచురణలు

**డా. నలిమెల భాస్కర్ రచనలు**

1) నూరేళ్ల పది ఉత్తమ మలయాళ కథలు (1993)

2) అద్దంలో గాంధారి... మరి పదకొండు కథలు (1996)

3) సాహితీ సుమాలు (1998)

4) తెలంగాణా పదకోశం (2003)

5) గోగుపువ్వు - వఝుల శివకుమార్ కవిత్వం (1994)

6) సుదీర్ఘ జ్ఞాపకం - యెన్నం సత్యం దీర్ఘ కవిత (1996)

7) సామెతలలోకం - టి.వి. నారాయణ (1996)

8) రేణ - చైతన్య ప్రకాశ్ కథలు (2000)

9) ఊటబాయి - పెద్దింటి అశోక్‌కుమార్ కథలు (2002)

10) మాఊరి బాగోతం-పెద్దింటి అశోక్‌కుమార్ సీరియల్ కథలు (2005)

11) చలనం - కొలిపాక శోభారాణి కవిత్వం (2004)

**జూకంటి జగన్నాథం రచనలు**

కవిత్వం

12) పాతాళ గరిగె (1993)

13) ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ (1996)

14) గంగడోలు (1998)

15) వాస్కోడిగామా డాట్ కామ్ (2000)

16) బొడ్డుతాడు (2002)

17) ఒకరోజు పది గాయాలు (2003)

18) తల్లికొంగు (2005)

కథలు

19) వైపని (2004)




MAAVOORI BAAGOTHAM
(series of stories)
by Peddinti Ashok kumar



